సోమవారం
19•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 55
• పేజీలు: 14 + 16

మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





# సమగ్ర విద్యుత్ విధానం

## దేశంలో చీకట్లను పారదోలేందుకు ఇది అవసరం

### పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీతో భేటీలో సీఎం కేసీఆర్ అభిలాష

- స్థాపిత సామర్థ్యంలో సగంకూడా వాడుకోవటంలేదు
- ఈ పరిస్థితి పోవాల్సిన అవసరం ఉన్నది
- తెలంగాణ ఏర్పడ్డ ఆరునెలల్లోనే విద్యుత్‌కోతలు ఎత్తేశాం
- అన్నిరంగాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం
- పవర్ ఫైనాన్స్ సహకారం ఎంతగానో దోహదం చేసింది : కేసీఆర్



ఆదివారం ప్రగతిభవన్‌లో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీ రాజీవ్‌శర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

- మేమందించిన సహకారం నూరుపాళ్లు సద్వినియోగమైంది
- మీరు ఏం చెప్పారో.. అది నేడు కండ్లముందు కనిపించింది
- కాళేశ్వరం గురించి యావత్ దేశం గొప్పగా చెప్పకొంటున్నది
- సీఎం కేసీఆర్‌తో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీ రాజీవ్‌శర్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం ఏర్పడిన ఆరునెలల్లోనే విద్యుత్‌కోతలు ఎత్తివేశామని, ఇప్పుడు అన్నిరంగాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీ రాజీవ్‌శర్మకు తెలిపారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయని, మూడు షిఫ్టుల్లో పరిశ్రమలు పనిచేస్తున్నాయని వివరించారు. ఇదేతీరుగా దేశవ్యాప్తంగా అన్నిరంగాలకు అన్నివేళలా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యంగా సమగ్ర విద్యుత్ విధానం రావాల్సిన అవసరం ఉన్నదని అభిలషించారు. దేశంలో ప్రస్తుతమున్న స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో సగం కూడా వినియోగించుకోవడం లేదని, ఇంకా చాలాప్రాంతాలు చీకట్లోనే మగ్గుతున్నాయని సీఎం అన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్‌కోతలు అమలవుతున్నాయని, ఈ పరిస్థితి పోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. మూడురోజులపాటు రాష్ట్రంలోని పవర్‌ప్లాంట్లు, కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన పీఎఫ్‌సీ సీఎండీ రాజీవ్‌శర్మ ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా

మిగతా 2వ పేజీలో

## కలెక్టర్లతో రేపు సీఎం భేటీ

**కొత్త రెవెన్యూ చట్టంపై కలెక్టర్ల అభిప్రాయాలు తీసుకోనున్న సీఎం కేసీఆర్**

**కొత్త మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టాలు, అరవైరోజుల కార్యాచరణపై చర్చ**

**రెండ్రోజులపాటు కొనసాగే అవకాశం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం జిల్లా కలెక్టర్లతో సమావేశంకానున్నారు. ప్రగతిభవన్‌లో మంగళవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మంత్రులను కూడా ఆహ్వానించారు. కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాలని నిర్ణయించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో భూ పరిపాలనలో ప్రత్యక్ష సంబంధం

మిగతా 2వ పేజీలో

జనసాగరం!



ఆదివారం నాగార్జునసాగర్ 26 గేట్ల నుంచి దుంకుతున్న కృష్ణమ్మ జలాలను తనివితీరా వీక్షించేందుకు సందర్శకులు పోటెత్తిన దృశ్యం 3

## రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా సోమేశ్‌కుమార్

### రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీచేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్‌గా ఉన్న రాజేశ్వర్‌తివారీని అటవీ పర్యావరణశాఖ స్పెషల్ సీఎస్‌గా బదిలీ చేశారు. రెవెన్యూ (రెవెన్యూ, ఎక్సయిజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్) స్పెషల్ సీఎస్‌గా సోమేశ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. సీసీఎల్‌ఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను కూడా నిర్వహిస్తారు. రెరా చైర్మన్‌గా కూడా కొనసాగుతారు. పంచాయతీరాజ్ కమిషనర్‌గా నీతూకుమారి ప్రసాద్ స్థానంలో రఘునందన్‌రావును నియమించారు.

**రాగల 48 గంటల్లో రాష్ట్రానికి వర్షసూచన** 7

## పరిహారం ఇయ్యరు.. పాస్‌బుక్ అందదు!

ధర్మగంట

- కాళేశ్వరం ప్రాజెక్టుకు భూమి తీసుకొని పరేషాన్ చేస్తున్నరు
- భూమి దున్నుకోండని చెప్పిన ప్రాజెక్టు అధికారులు
- పరిహారం ఇచ్చామని దాటవేస్తున్న రెవెన్యూ సిబ్బంది
- సాగుచేసుకొంటున్నా పాస్‌బుక్ లేదు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన సిద్దిపేట జిల్లావాసి సుధాకర్‌రెడ్డి

6

**అది** ఐదు దశాబ్దాల కింద ప్రభుత్వం లావుణి పట్టా కింద ఇచ్చిన భూమి. కొన్నేండ్ల కింద కాళేశ్వరం ప్రాజెక్టు కోసం అధికారులు ఆ భూమిని సేకరించారు. ఇందుకు పరిహారాన్ని కూడా ప్రభుత్వం మంజూరుచేసింది. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం పరిహారాన్ని అసలు యజమానికి అందివ్వలేదు. సదరు భూమి తనదేనని భూ యజమాని అడిగితే.. ఎంజాయ్‌మెంట్ సర్వేచేసి కాస్తులో ఉన్నవారికి పరిహారం ఇచ్చామని సమాధానమిచ్చారు. ప్రాజెక్టు అధికారులను అడిగితే ఆ భూమిని వాడుకోలేదని, వృథాగానే ఉన్నదని, దానిని దున్నుకోండి అని చెప్పారు. బాధితుడు భూమిని సాగుచేసుకొంటున్నా రెవెన్యూ అధికారులు మాత్రం కొత్త పాస్‌పుస్తకం మంజూరుచేయకుండా సతాయిస్తున్నారు. దీంతో రెండు విడుతల రైతుబంధు సాయం కోల్పోయానని, తనకు న్యాయంచేయాలని సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన రైతు పబ్బతి సుధాకర్‌రెడ్డి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.




## గ్రీన్ చాలెంజ్ @ 2 కోట్ల మొక్కలు

మొదటివిడుతలో రెండుకోట్ల బెంచ్‌మార్క్ మొక్కనాటిన ఎంపీ సంతోష్‌కుమార్

రెండోవిడుతకు శ్రీకారం.. మరో నలుగురి నామినేట్ 2

ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో గ్రీన్ చాలెంజ్ మొదటివిడుతలో రెండు కోట్ల బెంచ్ మార్కు మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్

## పాక్‌తో చర్చలంటూ జరిగితే.. పీవోకేపైనే



- ఆర్టికల్ 370 రద్దుతో పాక్‌కు భయం పట్టుకున్నది
- అమెరికా కూడా పాక్ మాటలు నమ్మడం లేదు
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

5

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 79.00 | రిటైల్ లైవ్ | 101.00 |
| డ్రెస్డ్ | 146.00 | స్కిన్‌లెస్ | 167.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 339.00 | రంగారెడ్డి | 339.00 |
| మెదక్ | 339.00 | కరీంనగర్ | 342.00 |
| వరంగల్ | 342.00 | చిల్లర ధర | 4.00 |




హిమాచల్ ప్రదేశ్‌లోని కులులో బురుదలో కూరుకుపోయిన కారు

## ఉత్తరాది విలవిల

- కుండపోత వర్షాలతో అతలాకుతలం
- హిమాచల్‌లో 22 మంది మృతి
- ఉత్తరాఖండ్‌లో 8 మంది గల్లంతు
- పంజాబ్‌లో ముగ్గురు దుర్మరణం
- కేరళలో 121కి.. కర్ణాటకలో 76కు చేరిన మృతుల సంఖ్య

5




## స్వచ్ఛ తెలంగాణ

**21 జిల్లాల్లో 100% ఓడీఎఫ్**

**మిగిలిన జిల్లాల్లో 90% పైనే పురోగతి**

**అక్టోబర్ 2 నాటికి రాష్ట్రమంతా పూర్తి**

**కేంద్ర జాబితాలో 94.59%తో ముందంజ**

2

## బీబీనగర్ ఎయిమ్స్ కాలేజీ 27న ప్రారంభం

**ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ కృషి**

**50 మంది విద్యార్థులకు బోధన, వసతి**

2



కాబూల్‌లో బాంబు పేలుడుతో ఛిన్నాభిన్నమైన పెండ్లి మండపం

## శవాల దిబ్బగా పెండ్లి వేదిక

**ఆత్మాహుతి బాంబు పేలి 63 మంది మృత్యువాత**

**182 మందికి గాయాలు**

**ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో మారణహోమం**

**తమ పనేనని ఐఎస్ ఉగ్రవాద సంస్థ ప్రకటన**

III





న్యూయార్క్ టైమ్స్‌స్క్వేర్‌లోని భారీ తెరపై ప్రసారమవుతున్న గాయత్రి పంప్‌హౌస్ విజువల్స్

# అంతర్జాతీయస్థాయిలో కాళేశ్వరం కీర్తిపతాక

- న్యూయార్క్‌లోని టైమ్స్‌స్క్వేర్ స్క్రీన్‌పై మెరిసిన గాయత్రి పంప్‌హౌస్
- రోజుకు ఐదుసార్లు వీడియో ప్రసారం
- ప్రపంచవ్యాప్తమవుతున్న తెలంగాణ అద్భుతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మరో ఘనతను సొంతం చేసుకున్నది. ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకంగా జగద్విఖ్యాతి పొందిన కాళేశ్వరం ప్రాజెక్టు.. తాజాగా అమెరికాలోని ప్రఖ్యాత న్యూయార్క్ టైమ్స్‌స్క్వేర్‌లోని భారీ తెరపై కాంతులీనింది. తెలంగాణ ఇంజినీరింగ్ ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేఘా ఇంజినీరింగ్ సంస్థ నిర్మించిన గాయత్రి పంప్‌హౌస్ విజువల్స్‌ను టైమ్స్‌స్క్వేర్ కూడలిలోని తెరపై మూడురోజులపాటు రోజుకు ఐదుసార్లు చొప్పున ప్రదర్శిస్తున్నారు. బాహుబలి మోటర్లుగా పిలుస్తున్న 139 మెగావాట్ల భారీ మోటర్లు ఎత్తిపోసిన నీళ్లు డెలివరీ సిస్టర్న్‌నుంచి కిందికి దుంకుతున్న దృశ్యాలతోపాటు.. గ్రావిటీ కెనాల్‌ద్వారా నీరు పారుతుండటాన్ని ఆ వీడియోలో చూపారు. లక్ష్మీపూర్ సర్జ్‌పూల్, భూగర్భంలోని భారీ మోటర్లు, పంప్‌హౌస్ దృశ్యాలు కూడా అందులో ఉన్నాయి.

**అతిపెద్ద భూగర్భ పంప్‌హౌస్‌గా గాయత్రి**

గోదావరిలో గరిష్ఠ నీటిలభ్యత, రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రీడిజైన్ చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ-8లో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ దగ్గర ప్రపంచంలోనే అతిపెద్ద భూగర్భ పంప్‌హౌస్‌గా గాయత్రి పంప్‌హౌస్‌ను నిర్మించారు. ఈ పంప్‌హౌస్‌లో 139 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు మోటర్లు ఉన్నాయి. ఇంత భారీ మోటర్లను ప్రపంచంలో ఏ ఎత్తిపోతల పథకంలోనూ ఇంతవరకు ఉపయోగించపోవడం విశేషం. భూగర్భంలో దాదాపు 140 మీటర్ల లోతుల్లో ఉన్న పంప్‌హౌస్‌లోని బాహుబలి మోటర్లు నీటిని 117 మీటర్ల ఎత్తుకు పంప్‌చేస్తాయి. ప్రస్తుతం ఈ మోటర్ల వెట్‌ట్రయల్ రన్ దిగ్విజయంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ మోటర్లతో రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చు.



## కలెక్టర్లతో రేపు సీఎం భేటీ

మొదటిపేజీ తరువాయి...

కలిగిన కలెక్టర్ల అభిప్రాయాలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. అవినీతికి ఆస్కారంలేని, ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగనిరీతిలో చట్టం ఉండాలంటే ఎలాంటి నిబంధనలు రూపొందించాలనే అంశంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చిస్తారు. క్షేత్రస్థాయిలో తమ అనుభవంలో ఉన్న విషయాలను, కొత్తచట్టం రూపకల్పనలో సూచనలను అందరు కలెక్టర్ల నుంచి తీసుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు అభిప్రాయాలు చెప్పటానికి, సూచనలు చేయటానికి, చర్చల్లో భాగస్వాములు కావటానికి సిద్ధమై రావాలంటూ కలెక్టర్లకు సర్క్యులర్లు జారీ అయ్యాయి. కొత్త మున్సిపల్ చట్టం, కొత్త పంచాయతీరాజ్ చట్టం అమలుపైనా ఈ సమావేశంలో చర్చించనున్నారు. పల్లెలు, పట్టణాల్లో అమలు చేయబోయే 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై కూడా ఈ సందర్భంగా చర్చిస్తారు. ఈ మూడు విషయాలపై లోతైన చర్చ జరుగాల్సి ఉన్నందున ఈ సమావేశం రెండురోజులపాటు కొనసాగే అవకాశం ఉన్నది.

## హీరా గోల్డ్ కేసులో ఉచ్చు బిగిస్తున్న ఈడీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హీరా గోల్డ్ గ్రూప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు వేగం పెంచారు. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలంటూ పలు రాష్ట్రాల్లో లక్షల మందిని నిండా ముంచిన హీరా గ్రూప్‌నకు చెందిన రూ.299.98 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను శుక్రవారం ఈడీ జప్తుచేసింది. కేసు దర్యాప్తులో కీలక ఆధారాలు, మరిన్ని బ్యాంకు ఖాతాలపై ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. పెట్టిన పెట్టుబడికి ఏడాదికి 36 శాతం వడ్డీ కలిపి ఇస్తామని ఆశచూపి దేశవ్యాప్తంగా 1.72 లక్షల మంది నుంచి రూ.5,600 కోట్లు కొల్లగొట్టినట్టు ప్రస్తుత ఆధారాల ప్రకారం గుర్తించిన అధికారులు.. వాటికి సంబంధించిన పత్రాల సేకరణలో నిమగ్నమై ఉన్నారు. కుంభకోణంలో దేశ, విదేశాల్లోని బ్యాంకు ఖాతాలు కీలకంగా మారడంతో.. వాటి లావాదేవీలను ఈడీ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

### ముహూర్తం



సూర్యోదయం: 6.03 గంటలకు



సూర్యాస్తమయం: 6.36 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, తదియ తె.జా. 1.15 వరకు, తదుపరి చతుర్థి నక్షత్రం: ఉత్తరాభాద్ర రాత్రి 7.49 వరకు, తదుపరి రేవతి, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.26 నుంచి సాయంత్రం 4.02 వరకు, రాహుకాలం: ఉదయం 7.38 నుంచి 9.12 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.55 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.15 నుంచి సాయంత్రం 4.05 వరకు, వర్జ్యం: ఉదయం 6.22 నుంచి 7.58 వరకు.

### లోకం పోకడ




# సమగ్ర విద్యుత్ విధానం



ఆదివారం ప్రగతిభవన్‌లో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీ రాజీవ్‌శర్మను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ తదితరులు ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి...

కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో, దేశంలో ఉన్న విద్యుత్ పరిస్థితిపై ఇరువురు చర్చించారు. సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ ఏర్పడినప్పుడు తీవ్రమైన విద్యుత్ సంక్షోభం ఉండేది. రాష్ట్రప్రగతికి ఆనాడు విద్యుత్ సమస్యే తీవ్ర అవరోధంగా నిలిచింది. విద్యుత్ సమస్యను పరిష్కరించనిదే రాష్ట్ర పురోగతి సాధ్యంకాదని ఆనాడు భావించాం. విద్యుత్ రంగాన్ని తీర్చిదిద్దటానికి సమగ్రవ్యూహం అనుసరించాం. ఆరునెలల్లో విద్యుత్‌కోతలు ఎత్తివేశాం. ఇప్పుడు అన్నిరంగాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నాం. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. తెలంగాణలో పరిశ్రమలు మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నాయి. దీని వల్ల ఉపాధి పెరిగింది. రాష్ట్ర ఆదాయం పెరిగింది. లో ఓల్టేజీ లేకుండా ఉండేందుకు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా చూసేందుకు విద్యుత్ పంపిణీ, సరఫరా వ్యవస్థలను మెరుగుపరిచాం. ప్రస్తుతం 20వేల మెగావాట్ల విద్యుత్‌ను వాడుకోవడానికి అనుగుణమైన వ్యవస్థ సిద్ధమైంది' అని వివరించారు.

### పీఎఫ్‌సీ సహకారం ఎంతో ఉపయోగపడింది

రాష్ట్రంలో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, ఇతర విద్యుత్ సంబంధ వ్యవస్థలను తీర్చిదిద్దడానికి, విద్యుత్ సంక్షోభాన్ని చాలా తక్కువ సమయంలో పరిష్కరించుకొని, మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ అడుగులు వేయడానికి పీఎఫ్‌సీ అందించిన ఆర్థికసహకారం ఎంతో దోహదం చేసిందని సీఎం కేసీఆర్ అన్నారు. విద్యుత్ ప్రాజెక్టులతోపాటు, రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు కూడా ఆర్థిక సహకారం అందించినందుకు సీఎండీ రాజీవ్‌శర్మకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

### ఇది.. పీఎఫ్‌సీకి గౌరవం: రాజీవ్‌శర్మ

రాష్ట్రంలో దార్శనిక ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో రికార్డు సమయంలో అటు పవర్‌ప్లాంట్లు, ఇటు నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నారని పీఎఫ్‌సీ సీఎండీ రాజీవ్‌శర్మ ప్రశంసించారు. పవర్‌ప్లాంట్లయినా, నీటిపారుదల ప్రాజెక్టులైనా ఇంత త్వరగా పూర్తికావడం తానెక్కడా చూడలేదన్నారు. అనుమతులు పొందటం, నిధులు సమీకరించటం, భూసేకరణ, ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు తదితర తతంగమంతా ఉంటుంది కాబట్టి.. ఆలస్యమవుతుంటుందని, కానీ తెలంగాణలో మాత్రం శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నదని అన్నారు. రాష్ట్రంలోని విద్యుత్‌ప్లాంట్లు, నీటిపారుదల ప్రాజెక్టులకు తామందించిన ఆర్థికసహకారం నూటికి నూరుపాళ్లు సద్వినియోగం అయిందంటూ సంతోషం వ్యక్తంచేశారు. తెలంగాణ అభివృద్ధిలో పీఎఫ్‌సీ భాగస్వామికావటం తమకెంతో గౌరవంగా, గర్వంగా ఉన్నదని అన్నారు. 'మూడున్నరేండ్ల కింద హైదరాబాద్‌కు వచ్చినప్పుడు కేసీఆర్ మాకు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చెప్పారు. ప్రాజెక్టు ఎలా ఉండబోతున్నదో స్క్రీన్‌పై చూపించారు. అది విన్న నేను ఆశ్చర్యపోయాను. ఇది సాధ్యమేనా అనుకున్నాను. కానీ నేను నిన్న కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించాను. బరాజ్‌లు, పంపుహౌస్‌లు కండ్లారా చూశాను. గోదావరి నీటిని పంప్‌చేసే విధానం చూశాను. నిజంగా అద్భుతం. మూడున్నరేండ్ల కింద కేసీఆర్ నాకు ఏది చెప్పారో అది కండ్లముందు కనిపించింది. ఇలాంటి ప్రాజెక్టును ఇంత త్వరగా నిర్మించడం మాటలు చెప్పినంత తేలికకాదు. కేసీఆర్ కృషి ఫలించింది. కల నెరవేరింది. ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టు గురించి యావత్‌దేశం గొప్పగా చెప్పుకొంటున్నది. అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో కూడా కాళేశ్వరం ప్రాజెక్టు విజయగాథను ప్రదర్శిస్తున్నారు' అని రాజీవ్‌శర్మ సీఎం కేసీఆర్‌ను అభినందించారు.

### విద్యుత్‌రంగం విజయాల వెనుక ప్రభాకర్‌రావు కృషి

రాష్ట్రంలో విద్యుత్‌రంగం సాధించిన విజయాల వెనుక జెన్‌కో- ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు కృషి ఉన్నదని సీఎం కేసీఆర్, పీఎఫ్‌సీ సీఎండీ రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి ప్రశంసించారు. విద్యుత్‌రంగంలో ఎంతో అనుభవం ఉన్న ప్రభాకర్‌రావు తమకు ఆదర్శమని, ఆయన నాయకత్వంలో తెలంగాణ విద్యుత్‌రంగం ఎంతో ప్రగతి సాధించిందని రాజీవ్‌శర్మ కొనియాడారు. పవర్‌ప్లాంట్లు శరవేగంగా నిర్మితమవుతున్నాయని, ప్లాంట్లలో పీఎల్‌ఎఫ్ పెరిగిందని, తనపై పెట్టిన బాధ్యతలను ప్రభాకర్‌రావు పూర్తిగా నెరవేర్చారని సీఎం కేసీఆర్ అన్నారు. విద్యుత్‌రంగంలో ప్రభాకర్‌రావు 50 ఏండ్ల సర్వీసు పూర్తిచేసుకున్నారని చెప్తూ.. ఆయనను ఈ రంగంలో భీష్మాచార్యుడిగా సీఎస్ ఎస్కేజోషి అభివర్ణించారు. విద్యుత్‌రంగంపై పూర్తి అవగాహన కలిగిన సీఎం కేసీఆర్ నాయకత్వంలో, మార్గదర్శకత్వంలో పనిచేయడం వల్లనే మంచి ఫలితాలు వచ్చాయని ప్రభాకర్‌రావు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. విద్యుత్‌సంక్షోభ పరిష్కారం ఘనత అంతా ముఖ్యమంత్రిదేనన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌శర్మ దంపతులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఈ చర్చల్లో జెన్‌కో ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, కార్యదర్శులు స్మితా సభర్వాల్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో రెండు కోట్ల బెంచ్ మార్కు మొక్కను నాటి రెండోవిడుత గ్రీన్‌చాలెంజ్‌ను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్

## గ్రీన్ చాలెంజ్ @ 2 కోట్లు

- మొదటివిడుతలో రెండుకోట్ల బెంచ్‌మార్క్ మొక్క నాటిన ఎంపీ సంతోష్‌కుమార్
- రెండోవిడుతకు శ్రీకారం.. మరో నలుగురి నామినేట్

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి మద్దతుగా ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ చేపట్టిన గ్రీన్ చాలెంజ్‌లో నాటిన మొక్కల సంఖ్య రెండుకోట్లకు చేరింది. రాజ్యసభ సభ్యుడు ఎంపీ సంతోష్ కుమార్ ఆదివారం తన నివాసంలో గ్రీన్ చాలెంజ్ మొదటివిడుతలో రెండు కోట్ల బెంచ్ మార్కు మొక్క నాటారు. రెండోవిడుత గ్రీన్ చాలెంజ్‌కు శ్రీకారం చుట్టారు. ఒకరు మొక్క నాటి మరో ముగ్గురిని నామినేట్‌చేస్తే.. వారు మొక్కలునాటి మరో ముగ్గురికి చాలెంజ్ విసరాలనే ఉద్దేశంతో ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ చేపట్టిన గ్రీన్ చాలెంజ్ కార్యక్రమాన్ని ఎంపీ సంతోష్‌కుమార్ గత ఏడాది జూలై 17న ప్రారంభించారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, గవర్నర్ నరసింహన్, నటుడు అక్కినేని నాగార్జునకు గ్రీన్ చాలెంజ్ విసిరారు. అలా ప్రారంభమైన ఈ కార్యక్రమం జాతీయస్థాయిలోనూ నడిచింది. చాలామంది ప్రముఖులు ఇందులో భాగస్వాములయ్యారు. మొక్కలునాటి సెల్ఫీ దిగడం ద్వారా ఈ కార్యక్రమం ప్రాచుర్యం పొందింది. తొలివిడుతలో కోటి బెంచ్‌మార్కు మొక్కను టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు నాటి.. ముగ్గురికి గ్రీన్ చాలెంజ్ విసిరారు. తాజాగా ఆదివారం మూడు మొక్కలు నాటిన ఎంపీ సంతోష్‌కుమార్.. మరో నలుగురిని నామినేట్ చేశారు. జీఎమ్మార్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, వైఎస్సార్సీపీ నేత విజయసాయిరెడ్డి, లోక్‌సభలో ఆ పార్టీ పక్ష నేత మిథున్‌రెడ్డి, సినీనటుడు అఖిల్ అక్కినేనికి గ్రీన్ చాలెంజ్ విసిరారు. చాలెంజ్‌ను స్వీకరిస్తున్నట్టు అఖిల్ ట్వీట్ చేశారు. గ్రీన్ చాలెంజ్‌లో నాటిన మొక్కల సంఖ్య రెండుకోట్లకు చేరిందని ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, రాఘవ ప్రకటించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు సంస్థ ప్రతినిధులను ఎంపీ సంతోష్‌కుమార్ అభినందించారు.

# రుణమాఫీపై కసరత్తు ముమ్మరం

### మార్గదర్శకాల రూపకల్పనపై అధికారుల దృష్టి

- 2018 డిసెంబర్ 11 వరకు వర్తింపు.. 48 లక్షల మంది అర్హులు?
- బడ్జెట్ సమావేశాల అనంతరం స్పష్టత
- వ్యవసాయశాఖ, ఆర్థికశాఖ, బ్యాంకర్ల కమిటీ సమాలోచనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రుణమాఫీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. రూ.లక్షలోపు ఉన్న పంట రుణాల మాఫీకి సంబంధించి మార్గదర్శకాల రూపకల్పనపై వ్యవసాయశాఖ, ఆర్థికశాఖ, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ దృష్టి సారించాయి. బడ్జెట్ సమావేశాల తర్వాత దీనిపై పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. రైతుల రుణాల మాఫీ కోసం బడ్జెట్‌లో ఏ మేరకు కేటాయింపులు చేయాలి? ఎప్పటినుంచి ఉన్న రుణాలను పరిగణనలోకి తీసుకోవాలి? ఎంతమంది రైతులకు వర్తిస్తుంది? అనే దానిపై వ్యవసాయ శాఖతోపాటు ఆర్థికశాఖ, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. మాఫీపై ఆశతో పంట రుణాలను రెన్యువల్ చేసుకొనేందుకు రైతులు ముందుకురావడం లేదని గమనించిన ప్రభుత్వం వీలైనంత త్వరగా మొదటి విడుత సొమ్ము కింద బడ్జెట్‌నుంచి కొంత మొత్తంలో విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. వాస్తవానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనే రుణమాఫీ కోసం రూ.6 వేల కోట్లు కేటాయించారు. 2018 డిసెంబర్ 11 వరకు ఉన్న పంటరుణాలను మాఫీ చేయనున్నట్టు ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయితే ఎప్పటినుంచి.. ఎలా అనే దానిపై మాత్రం మార్గదర్శకాలు విడుదలచేయలేదు. వీటన్నింటిపై బడ్జెట్ సమావేశాల తర్వాతే స్పష్టత రానున్నది. ఇప్పటికే రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో సంప్రదించిన ఆర్థికశాఖ.. ఏయే సీజన్లలో ఎక్కువ పంట రుణాలు తీసుకున్నారు, రూ.లక్షలోపు ఉన్న రుణాల మొత్తంఎంత, ఎంతమంది రైతులు ఉన్నారు అనేదానిపై ప్రాథమిక వివరాలు తెప్పించుకున్నట్టు సమాచారం. ఇందుకనుగుణంగా అమలు మార్గదర్శకాలు, విధివిధానాలు రూపొందిస్తున్నారు. మార్గదర్శకాల విడుదల అనంతరం గ్రామాలవారీగా లబ్ధిదారుల జాబితాను క్రోడీకరించనున్నారు. కుటుంబంలో ఎంతమంది పేరు మీద అప్పు ఉన్నప్పటికీ రూ.1 లక్ష వరకు మాఫీ అవుతుంది. బ్యాంకులు డేటా షేరింగ్ ద్వారా డూప్లికేట్స్ లేకుండా నియంత్రించే అవకాశం ఉంటుంది.

**రుణమాఫీపై లోతైన చర్చ**

కుటుంబంలో ఒక్కరైతుకే వర్తింపచేయడం, బంగారం తాకట్టుపెట్టి రుణం తీసుకుంటే మాఫీ ఇవ్వాలా? వద్దా? అనే విషయాలపై లోతుగా చర్చిస్తున్నారు. నాలుగు విడుతలుగా రుణమాఫీని చేపట్టగా.. 2017 సెప్టెంబర్‌ను పూర్తిగా చెల్లించిన నెలగా వ్యవసాయశాఖవర్గాలు చెప్తున్నాయి. అప్పటినుంచి 2018 డిసెంబర్ 11 వరకు లెక్కలోకి తీసుకోనున్నట్టు సమాచారం. ఆ ప్రకారమే రుణమాఫీ అర్హులు, చెల్లించాల్సిన సొమ్మును అంచనా వేసినట్టు ఆ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రాథమిక లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 48 లక్షల మంది రైతులు రుణాలు పొందినవారున్నారు. ఇందులో రూ. ఒకలక్ష లోపు రుణాలు రూ.31,824 కోట్లు ఉన్నట్టు ఎస్సెల్బీసీ వర్గాలు వెల్లడించాయి. 2014లో రుణమాఫీ పథకం అమలు చేసినప్పుడు రూ.17 వేల కోట్లు బకాయిలు ఉండగా.. ప్రభుత్వం వాటిని నాలుగు విడుతలుగా మాఫీ చేసింది. ఇప్పుడు అదే పద్ధతిలో రుణమాఫీ చేయనున్నది.

# శార్వరిలో పండుగల తేదీలు ఖరారు



హైదరాబాద్‌లోని శృంగేరి శంకరమఠంలో ఆదివారం నిర్వహించిన తృతీయ వార్షిక విద్వత్సమ్మేళనంలో మాట్లాడుతున్న జ్యోతిష పండితుడు పాలెపు రాజేశ్వరశర్మ

- తెలంగాణ విద్వత్సమ్మేళనంలో ఏకాభిప్రాయం
- హాజరైన 30 మంది సిద్ధాంతులు, పంచాంగకర్తలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శార్వరి నామ సంవత్సరంలో వచ్చే పండుగల తేదీలను తెలంగాణ విద్వత్సభ ఖరారుచేసింది. హైదరాబాద్ నల్లకుంటలోని శృంగేరి శంకరమఠంలో ఆదివారం నిర్వహించిన తృతీయ వార్షిక విద్వత్సమ్మేళనంలో 30 మంది సిద్ధాంతులు, పంచాంగకర్తలు ఏకాభిప్రాయానికి వచ్చి ఈ తేదీలను ఖరారు చేశారు. తేదీల జాబితాను సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు కేవీ రమణాచారికి అందజేశారు. పండుగల తేదీల్లో ఎలాంటి గందరగోళం లేకుండా, ప్రభుత్వానికి, ప్రజలకు పూర్తి స్పష్టత ఇచ్చేందుకు విద్వత్సభ కృషి చేస్తున్నదని సిద్ధాంతులు తెలిపారు. సమ్మేళనంలో సిద్ధాంతులు మాయవరం చంద్రశేఖర, తూండ్ల కమలాకరశర్మ, దివ్యజ్ఞాన, ఆకెళ్ల జయకృష్ణశర్మ, గాడిచర్ల నాగేశ్వరశర్మ, చికిలి లక్ష్మీవెంకటశాస్త్రి, ఓరుగంటి మనోహరశర్మ, రాంభట్ల రాజేశ్వరశర్మ, కొదుమగళ్ల వేణుగోపాలాచార్య, యతీంద్ర ప్రవణాచార్య, ఓరుగంటి రామారావు, గౌరీభట్ల రామకృష్ణశర్మ, జోషి ప్రాశాంతశర్మ, గొడవర్తి అప్పలాచార్య, ఎదునోజు నర్సింహాచార్య, బుర్రా వెంకటేశ్వరశర్మ, శాస్త్రుల కృష్ణమూర్తిశర్మ, గుడి సోమనాథశర్మతదితరులు పాల్గొన్నారు. పండుగల నిర్ణయాల ఆచరణలో ప్రధానపాత్రధారులు అంశంపై జ్యోతిష పండితుడు పాలెపు రాజేశ్వరశర్మ ప్రసంగించారు.

**శార్వరి నామ సంవత్సరంలో పండుగల తేదీలు**

| | | |
|---|---|---|
| 25-03-2020 | - | ఉగాది |
| 02-04-2020 | - | శ్రీరామనవమి |
| 22-08-2020 | - | వినాయక చతుర్థి |
| 24-10-2020 | - | దుర్గాష్టమి, బతుకమ్మ పండుగ |
| 25-10-2020 | - | మహర్నవమి, దసరా |
| 14-11-2020 | - | దీపావళి |
| 20-11-2020 | - | కార్తీక శుక్రవారం సార్ధత్రికోటి సహిత తుంగభద్ర నదీ పుష్కరారంభం |
| 21-06-2020 | - | ఆదివారం, సూర్యగ్రహణం |

**తెలంగాణలో సాంస్కృతిక పీఠం**

తెలంగాణలో సాంస్కృతికపీఠం ఏర్పాటుకు కృషిచేస్తున్నట్టు ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కేవీ రమణాచారి తెలిపారు. దీనిపై సీఎం కేసీఆర్ సమక్షంలో ఇప్పటికే చర్చలు జరిగాయని వివరించారు. సభలో అష్టావధానం చేసిన అమెరికాలో నివసిస్తున్న 18 ఏండ్ల గన్నవరం లలిత్ ఆదిత్యను సన్మానించారు.

# స్వచ్ఛ తెలంగాణ

- 21 జిల్లాల్లో 100 శాతం ఓడీఎఫ్
- మిగిలిన జిల్లాల్లో 90 శాతం పైనే పురోగతి
- అక్టోబర్ 2 నాటికి రాష్ట్రమంతా పూర్తి
- కేంద్ర జాబితాలో 94.59 శాతంతో ముందంజ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వచ్ఛ తెలంగాణ సాకారమవుతున్నది. అక్టోబర్ 2 గాంధీజయంతి నాటికి వందశాతం బహిరంగ మలవిసర్జన రహిత (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ-ఓడీఎఫ్) రాష్ట్రంగా మారనున్నది. ఇప్పటికే 21 జిల్లాలు 100 శాతం ఓడీఎఫ్ సాధించగా.. మిగిలిన జిల్లాలు 90 శాతానికి పైగా సాధించి పురోగతిలో ఉన్నాయి. పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్న రాష్ట్రప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నది. పంచాయతీ ఎన్నికలు ముగిసిన తొలినాళ్లలోనే 90 రోజుల ప్రణాళిక రూపొందించి పాలకవర్గాలకు పరిశుభ్రత లక్ష్యాన్ని నిర్దేశించిన విషయం తెలిసిందే. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించి, బహిరంగ మలవిసర్జన లేకుండా చేయాలని రాష్ట్రప్రభుత్వం 2014లోనే నిర్ణయించింది. ఇందుకోసం ఉపాధి హామీ నిధులను వినియోగించుకొనేందుకు కూడా వెసులుబాటు కల్పించింది. గ్రామాలు, పట్టణాలు అనే తేడాలేకుండా ప్రతిఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని నిబంధనలు విధించింది. ఓడీఎఫ్‌పై ఏటేటా లక్ష్యాన్ని నిర్దేశించుకుంటూ దానిని సాధిస్తూ వస్తున్నది. 2014 అక్టోబర్ 2 నాటికి 38.7 శాతంగా ఉన్న ఓడీఎఫ్.. 2015-16 వరకు 50.58కి చేరింది. 2016-17లో 64.59శాతం, 2017-18లో 83.93 శాతం వృద్ధి సాధించింది. ప్రస్తుతం కేంద్రస్థాయిలో 94.59 శాతం ఓడీఎఫ్ సాధించిన తెలంగాణ.. వచ్చే రెండునెలల్లో 100 శాతం దిశగా పరుగులు తీస్తున్నది.

### అగ్రస్థానంలో ఆరుజిల్లాలు

స్వచ్ఛతదర్పణ్‌లో తెలంగాణ ముందువరుసలో ఉన్నది. ఇప్పటికే జాతీయస్థాయిలో ఆరుజిల్లాలు అగ్రస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. వరంగల్ అర్బన్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలు జాతీయస్థాయిలో అగ్రస్థానంలో ఉండగా.. మహబూబ్‌నగర్ 23, వనపర్తి 26, ఖమ్మం 69, మేడ్చల్ మల్కాజిగిరి 75, జోగుళాంబ గద్వాల 87, జనగామ 88, మంచిర్యాల జిల్లా 95వ స్థానంలో నిలిచాయి. ప్రస్తుత లెక్కల ప్రకారం రాష్ట్రంలో 21 జిల్లాలు మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగంలో 100 శాతాన్ని సాధించాయి. వీటిల్లో కొన్ని జిల్లాలు కమ్యూనిటీ సోక్‌పిట్స్, కంపోస్ట్ పిట్స్, జియోట్యాగింగ్ చేయడంలో ఒక ట్రెండు శాతం వెనుకబడటంతో జాతీయస్థాయిలో 100కు పైగా ర్యాంకుల జాబితాలో ఉన్నాయి. వందశాతం ఓడీఎఫ్ సాధించిన జిల్లాల జాబితాలో జగిత్యాల, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం,పెద్దపల్లి, మంచిర్యాల, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం ప్రతి ఇంటికి ఉన్నట్లు పరిశీలనలో తేలింది.



### అక్టోబర్ నాటికి రాష్ట్రమంతా..

వచ్చే అక్టోబర్ నాటికి రాష్ట్రమంతా పరిశుభ్రమైన ప్రాంతంగా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. 21 జిల్లాల్లో వందశాతం ఓడీఎఫ్ పూర్తికాగా.. హైదరాబాద్ మినహా మిగిలిన జిల్లాలు 90 శాతంపైనే పురోగతిలో ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం గుర్తించిన ఇండ్లన్నింటికీ మరుగుదొడ్లు మంజూరు చేసినట్టు అధికారులు వెల్లడించారు. వీటి నిర్మాణాలన్నీ పూర్తికావచ్చాయని తెలిపారు. కేంద్రం పరిగణనలోకి తీసుకునే ఓడీఎఫ్, పచ్చదనం, పరిశుభ్రత, తాగునీటి అంశాలను వచ్చే 45 రోజుల్లో వందకు వందశాతం పూర్తిచేసి జాతీయస్థాయిలో అన్నింటా ముందుస్థానంలో నిలువాలనే దృఢసంకల్పంతో అధికారులు పనిచేస్తున్నారు. అక్టోబర్ 2 నాటికి గాంధీజీ కలలుగన్న స్వచ్ఛత గ్రామాలు తెలంగాణలో ఆవిష్కరణ కానున్నాయి.


## 27న బీబీనగర్ ఎయిమ్స్ కాలేజీ ప్రారంభం

- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ కృషి
- 50 మందికి బోధన, వసతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలించింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రయత్నానికి, టీఆర్‌ఎస్ ఎంపీల పోరాటానికి, వైద్యారోగ్యశాఖ కృషికి ఫలితం దక్కింది. తెలంగాణలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కళాశాల ఈ విద్యాసంవత్సరమే ప్రారంభానికి సిద్ధమైంది. బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలను ఈ నెల 27న ప్రారంభించనున్నారు. ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం మొదటిబ్యాచ్ 50 మంది విద్యార్థులకు ఈ ఏడాది నుంచి బోధన, వసతి కల్పించనున్నారు. 2019-20 విద్యా సంవత్సరంలోనే బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ కోర్సులు నిర్వహించేందుకు కౌన్సెలింగ్ ద్వారా 50 సీట్లను భర్తీచేశారు. ప్రస్తుతం నిమ్స్ భవనాల్లో వైద్య కళాశాలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వచ్చే సంవత్సరం నాటికి ఎయిమ్స్ భవనాల నిర్మాణం పూర్తికానుంది. వసతులు పూర్తయ్యేవరకు తెలంగాణ ఎయిమ్స్ పర్యవేక్షణ బాధ్యతను కేంద్రం ప్రస్తుతానికి భోపాల్ ఎయిమ్స్‌కు అప్పగించింది. ఈ నెల 27న బీబీనగర్ ఎయిమ్స్ వైద్యకళాశాల ప్రారంభించాల్సి ఉన్నందున నిర్మాణ పనులను, సదుపాయాలను ఎయిమ్స్ చీఫ్ డైరెక్టర్ శర్మణ్‌సింగ్ ఆదివారం పరిశీలించారు. కళాశాలకు అవసరమయ్యే వైద్యులు, బోధనా సిబ్బంది నియామకాలు పూర్తయ్యాయని ఆయన చెప్పారు.



ఆదివారం బీబీనగర్ ఎయిమ్స్ వైద్యకళాశాలలో మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎయిమ్స్ చీఫ్ డైరెక్టర్ శర్మణ్‌సింగ్



# జనసాగరం!

ఇరవై ఆరు గేట్ల నుంచి కృష్ణమ్మ కిందికి దుంకుతున్న అరుదైన దృశ్యం.. అందునా ఆదివారం! ఇంకేం.. నాగార్జుసాగర్‌కు సందర్శకులు పోటెత్తారు. నాగార్జున సాగర్ జలదృశ్యాన్ని వీక్షించేందుకు తెలంగాణతోపాటు ఏపీలోని వివిధ ప్రాంతాలనుంచి దాదాపు ఆరు లక్షలమంది డ్యాంను సందర్శించినట్టు అంచనా. డ్యాం కిందిభాగం, కొత్త బ్రిడ్జి, విద్యుత్‌ఉత్పత్తి కేంద్రం పరిసరాలు పూర్తిగా పర్యాటకులతో నిండిపోయాయి. పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకపోయినా సాగర్‌కు వచ్చే దారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలిపివేసి.. కాలినడకన, ఇతర ప్రైవేటు వాహనాలపై నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం పరిసరాల వద్దకు పర్యాటకులను తరలిస్తున్నారు. పర్యాటకులు ఉదయం నుంచే రావడంతో నాగార్జున సాగర్ హిల్‌కాలనీ నుంచి పైలాన్ వరకు రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. పైలాన్ కాలనీలోని పిల్లర్ సెంటర్, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, కొత్త వంతెన పర్యాటకులతో కిటకిటలాడాయి.

- నల్లగొండ, ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ

## మిడ్ మా'నీరు'.. సాగు జోరు



రాజన్న సిరిసిల్ల జిల్లా మిడ్‌మానేరు డ్యాంకు క్రమంగా నీటి ప్రవాహం పెరుగుతుండటంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. నీటి రాకతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.



# శాంతిస్తున్న కృష్ణమ్మ

### ఆల్మట్టికి క్రమంగా పడిపోతున్న ఇన్‌ఫ్లోలు

### నారాయణపుర, జూరాలలోనూ అదే తీరు

- శ్రీశైలం, సాగర్‌కు నేడు మరింత తగ్గనున్న వరద
- నీటినిల్వలు పెంచుతున్న ప్రాజెక్టుల అధికారులు

**హైదరాబాద్/నల్లగొండ, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూలు ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:** కొన్నిరోజులుగా లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ.. మెల్లగా శాంతిస్తున్నది. బేసిన్‌లో ఎగువన ఆల్మట్టికి ఇన్‌ఫ్లో గణనీయంగా తగ్గుముఖం పట్టింది. దీంతో దిగువన నారాయణపుర, జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు కూడా వరద తగ్గుతుండటంతో నీటినిల్వల పెంపుదలపై అధికారులు దృష్టిసారించారు. ఆల్మట్టి పూర్తిస్థాయి నిల్వకు ఇంకా 15 టీఎంసీలకు పైగా అవసరం ఉండటంతో అవుట్‌ఫ్లో భారీగా తగ్గించారు. నారాయణపురలోనూ నీటిమట్టాన్ని పెంచుతున్నారు. ఉజ్జయిని నుంచి వరద భారీగా తగ్గింది. దీంతో జూరాల జలాశయానికి వరద 3.25 లక్షల క్యూసెక్కులకు పడిపోయింది. తుంగభద్ర డ్యాంకు 78వేల పైచిలుకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది.

**శ్రీశైలానికి లక్ష క్యూసెక్కులకు పైగా తగ్గుదల**

శ్రీశైలం జలాశయానికి ఆదివారం ఉదయం ఏడు లక్షల క్యూసెక్కులకు పైగా ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రానికి ఆరు లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో శ్రీశైలం అధికారులు అవుట్‌ఫ్లోను కూడా తగ్గించారు. నాగార్జునసాగర్‌కు కూడా క్రమంగా ఇన్‌ఫ్లో పడిపోతున్నది. ఉదయం ఆరు లక్షల క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో.. రాత్రి పదిగంటలకు 2.80 లక్షలకు పడిపోయింది. పులిచింతలకు 4.67 లక్షలకు పైగా క్యూసెక్కుల వరద వస్తుండగా.. 4.73 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రకాశం బరాజ్ నుంచి ఆదివారం ఉదయానికి 218.78 టీఎంసీల కృష్ణాజలాలు సముద్రంలో కలిసినట్లుగా రికార్డుల్లో నమోదైంది.



ఆదివారం నిండుకుండలా తుంగభద్ర జలాశయం

**శ్రీశైలం వద్ద జనసందడి**

శ్రీశైలం జలాశయం ఆదివారం సందర్శకులతో కిక్కిరిసింది. ప్రాజెక్టు నుంచి నురగలు కక్కుతూ దూకే జలపాతాన్ని తిలకించేందుకు వేలమంది బారులు తీరడంతో పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొన్నది.

**కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులలో ఆదివారంనాటి నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1702.36 | 129.72 | 115.57 | 2,40,000 | 1,50,000 |
| నారాయణపుర | 1615.00 | 1611.91 | 37.64 | 33.42 | 2,00,000 | 1,48,992 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 12,351 | 15,590 |
| జూరాల | 1045.00 | 1042.85 | 9.66 | 8.51 | 3,25,000 | 3,08,313 |
| తుంగభద్ర | 1633.00 | 1633.00 | 100.86 | 100.85 | 78,724 | 78,436 |
| శ్రీశైలం | 885.00 | 882.20 | 215.81 | 200.20 | 5,98,513 | 4,73,187 |
| నాగార్జునసాగర్ | 590.00 | 586.20 | 312.052 | 301.87 | 2,80,206 | 4,24,233 |
| పులిచింతల | 175.00 | 168.30 | 45.77 | 36.00 | 4,67,492 | 4,73,573 |

# గోదావరిలో తగ్గిన వరద

- మధ్యమానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోత
- నేడు ఒకటో బాహుబలి వెట్ ట్రయల్‌రన్!



ఆదివారం పెద్దపల్లి జిల్లా నంది పంప్ హౌస్‌లోని 2, 4 మోటర్ల నుంచి ఎత్తిపోసిన నీరు డెలివరీ సిస్టర్న్ నుంచి ఎగిసిపడుతున్న దృశ్యం

**హైదరాబాద్/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరిలో వరద ఉధృతి తగ్గుతున్నది. ఇంద్రావతి కలిసిన తర్వాత పేరూరు వద్ద గోదావరిలో ప్రవాహం 4.76 లక్షల క్యూసెక్కులు ఉన్నది. భద్రాచలంలో గోదావరి నెమ్మదిగా తగ్గుముఖం పడుతున్నది. శనివారం సాయంత్రం 4 గంటలకు 25.1 అడుగులకు చేరి నిలకడగా ప్రవహిస్తున్నది. ధవళేశ్వరం దగ్గర దాదాపు 4.76 లక్షల క్యూసెక్కుల వరద నమోదైంది. దీంతో బరాజ్ నుంచి సముద్రంలోకి 4.88 లక్షల క్యూసెక్కులు వదిలిపెడుతున్నారు. ఎగువన ప్రాజెక్టులకు కూడా ఇన్‌ఫ్లోలు భారీగా పడిపోయాయి. శ్రీరాంసాగర్‌కు ఇప్పటికీ చుక్క ఇన్‌ఫ్లో లేదు. కడెంకు మాత్రమే 888 క్యూసెక్కుల వరద వస్తున్నది. ఇదిలా ఉంటే.. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో మోటర్లు నిరంతరాయంగా నడుస్తున్నాయి. ఆదివారం పెద్దపల్లి జిల్లా నంది పంప్‌హౌస్‌లోని 2, 4 మోటర్ల ద్వారా నంది రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోశారు. ఇక్కడినుంచి వచ్చేనీరు నంది రిజర్వాయర్‌కు చేరుతుండగా, ఆరుగేట్లు ఎత్తి ఎప్పటికప్పుడు కరీంనగర్ జిల్లా రామడుగులోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. గాయత్రి పంప్‌హౌస్‌లో ఆదివారం కూడా 4, 5 మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోసి.. మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. గాయత్రి పంప్‌హౌస్‌లో సోమవారం ఒకటో మోటర్ వెట్ ట్రయల్‌రన్ చేపట్టే అవకాశం ఉన్నదని అధికారులు చెప్పారు.

**గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులలో ఆదివారంనాటి నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| సింగూరు | 1717.93 | 1670.45 | 29.91 | 0.45 | 0 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.37 | 17.18 | 0.14 | 0 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1062.90 | 90.31 | 17.18 | 0 | 389 |
| లోయర్‌మానేరు | 920.00 | 882.90 | 24.07 | 3.55 | 0 | 206 |
| మిడ్‌మానేరు | 1043.31 | 997.77 | 25.873 | 5.25 | 6,365 | 83 |
| కడెం | 700.00 | 697.15 | 7.60 | 6.88 | 888 | 818 |
| ఎల్లంపల్లి | 485.56 | 483.79 | 20.18 | 18.67 | 0 | 0 |



ఆదివారం సూర్యాపేట మండలం కేటీ అన్నారంలోని ఎన్‌క్లేవ్‌లో మొక్క నాటుతున్న విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



రంగారెడ్డి జిల్లా కిస్మత్‌పురలోని పౌరసరఫరాల సంస్థ గోదాంలో హరితహారంలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వికారాబాద్ జిల్లా నవాబుపేటలో మొక్క నాటుతున్న మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య ఉన్నారు



ఆదివారం నిర్మల్ జిల్లా సోన్ మండలం నీలాయిపేట్ గ్రామంలో మొక్క నాటుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

# హరితహారం ఒక కర్తవ్యం!

### పౌరసరఫరాల సంస్థ గోదాంలో మొక్కలు నాటిన మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/బండ్లగూడ:** హరితహారం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు తమ కర్తవ్యంగా భావించి విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధితోపాటు పర్యావరణ అభివృద్ధి కూడా అవసరమని ముందుగానే గుర్తించిన సీఎం కేసీఆర్ ఆదర్శవంతమైన హరితహారం కార్యక్రమాన్ని మొదలుపెట్టారని చెప్పారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కిస్మత్‌పురలోని పౌరసరఫరాల సంస్థ గోదాంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. హరితహారం అనేది నిరంతరం కొనసాగే కార్యక్రమమని, సంవత్సరం పొడుగునా అవకాశమున్న ప్రతిచోట ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. రెండు, మూడేండ్లలోనే కాళేశ్వరం వంటి బృహత్తర ప్రాజెక్టును పూర్తిచేసి చరిత్ర సృష్టించిన తెలంగాణ ప్రభుత్వానికి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కష్టమేమి కాదన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను భుజాలకెత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్‌సభ్యుడు డాక్టర్ జీ రంజిత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ హరీశ్‌కుమార్ తదితరులు పాల్గొని గోదాం ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు.




**అత్తాపూర్‌లో హరితహారం**

రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ రావుల విజయ జంగయ్య హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంక్యూ అపార్టుమెంట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు బాలపోచయ్య, రమాదేవి, బంగి శ్రీనివాస్, రవీందర్, మధు, అపార్టుమెంట్‌వాసులు తదితరులు పాల్గొన్నారు.

**సంరక్షణ అందరి బాధ్యత: మంత్రి అల్లోల**

**నిర్మల్ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యతని పేర్కొన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని నీలాయిపేట్‌లో ఐదోవిడుత హరితహారంలో భాగంగా గ్రామస్థులతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు.



రంగారెడ్డి జిల్లా చిలుకూరు అటవీభూమిలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎస్ ఎస్కే జోషి

**స్వచ్ఛందంగా నాటాలి: మంత్రి జగదీశ్‌రెడ్డి**

**సూర్యాపేట రూరల్:** ప్రతిఒక్కరూ హరితహారంలో స్వచ్ఛందంగా పాల్గొని మొక్కలు నాటాలని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట మండలం కేటీ అన్నారం రోడ్డులోని వీవీ ఎన్‌క్లేవ్‌లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడుతూ.. చెట్లు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**10 వేల మొక్కలు నాటిన ఫీనిక్స్ గ్రూప్**

**మొయినాబాద్:** ఆదివారం ఫీనిక్స్ గ్రూప్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ సౌజన్యంతో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామ రెవెన్యూలోని రిజర్వ్‌డ్ ఫారెస్ట్ భూమిలో ఫీనిక్స్‌గ్రూప్ నిర్వహించిన హరితహారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఫీనిక్స్ ఉద్యోగులతో కలిసి 10 వేల మొక్కలు నాటారు. ముందుగా కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి , చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హరితహారంలో పాల్గొని మొక్కలు నాటారు. శంకర్‌పల్లి మండలం లక్కారెడ్డిగూడలోని హరితహారంలోనూ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## హరిత తెలంగాణకు పాటుపడండి

### కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పిలుపు

**వికారాబాద్, నమస్తే తెలంగాణ:** భవిష్యత్ తరాలకు కాలుష్యరహిత వాతావరణం అందించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపడుతున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పెద్దఎత్తున మొక్కలు నాటి హరిత తెలంగాణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదివారం వికారాబాద్ జిల్లాలోని నవాబుపేట మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మల్లారెడ్డి.. అనంతరం హరితహారంలో భాగంగా నవాబుపేటలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్త విమానాశ్రయాలపై అధ్యయనం తుదిదశకు

### 21 నుంచి ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి, బసంత్‌నగర్‌లో పర్యటించనున్న ఏఏఐ బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న కొత్త విమానాశ్రయాలపై అధ్యయనం జరిపి నివేదికను అందజేసే కసరత్తు తుదిదశకు చేరింది. వరంగల్, కొత్తగూడెం, ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి (నిజామాబాద్), బసంత్‌నగర్ (రామగుండం), మహబూబ్‌నగర్‌లో విమానాశ్రయాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. వీటి అధ్యయన బాధ్యతలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కి అప్పగించడంతోపాటు అధ్యయనం కోసం ఇప్పటికే రూ.4.50 కోట్లను మంజూరు చేసింది. ఈ అధ్యయనం కోసం ఇప్పటికే వరంగల్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్‌లో పర్యటించిన ఏఏఐ అధికారులు.. ఈ నెల 21 నుంచి ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి, బసంత్‌నగర్‌లో పర్యటించనున్నారు. ప్రాథమిక నివేదికను తయారుచేసేందుకు ఏఏఐ కేటాయించిన ముగ్గురు అధికారులు అమిత్‌కుమార్, నీరజ్ గుప్తా, కుమార్‌వైభవ్ ఢిల్లీ నుంచి నాగ్‌పూర్ మీదుగా 21న ఆదిలాబాద్‌కు రానున్నారు. 22న జక్రాన్‌పల్లి, బసంత్‌నగర్‌లో పర్యటించి 23న హైదరాబాద్‌కు చేరుకుంటారు. అధ్యయనం పూర్తయ్యాక వివిధ అంశాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. భూమి లభ్యత, వాతావరణ పరిస్థితులు, వాణిజ్య, సైనిక అవసరాలు, విమాన ప్రయాణికుల సంఖ్యకు సంబంధించిన అంచనాలు తదితర వివరాలను ఈ నివేదికలో పొందుపర్చే అవకాశమున్నది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.



ఆదివారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో తనను కలిసిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను అభినందిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి







ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన బీ వినోద్‌కుమార్‌ను ఆదివారం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలుపుతున్న టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు, ఎంపీలు వెంకటేశ్ నేతకాని, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాలోతు కవిత, బీబీ పాటిల్

## వినోద్‌కుమార్‌కు అభినందనల వెల్లువ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన బోయినపల్లి వినోద్‌కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామానాగేశ్వర్‌రావు, ఎంపీలు వెంకటేశ్ నేతకాని, బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాలోతు కవిత, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు, ఎమ్మెల్యేలు విద్యాసాగర్ రావు, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఆర్థికసంఘం చైర్మన్ రాజేశం గౌడ్, మాజీ ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్ రెడ్డి, సీహెచ్ సుధాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, టీఆర్ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, మహిళావిభాగం నేతలు నల్లా భారతి, శారద తదితరులు వినోద్‌కుమార్‌ను అభినందించినవారిలో ఉన్నారు.





## అచింత్యం

సెరువంతా అమ్మగల్లాడి
ఒడ్డు ఒడిలో నిద్రబోతే
పున్నమి ఈని రేలగంధం రాసింది!
నీటి మీన అల
నీలి సవరించుకుంటున్న వోణి
కార్తి కాకపోయిన కోనేటి మూలన
ఆమె కోసం పూసిన చెట్లు..
చెరువు మీన వల ఇసిరితే
నాత్రి నామీద కల ఇసిరింది

చెరువ నాత్రి రెండు చెరువులే

ఆదమరిచి నిద్రబోయిన
పూర్వపు నీడల్ని
పలకరిస్తున్న నా నీడను జూసి
లేశి కుసున్నా
గుండ్లు తెంపుకొని నాను నమిలి
కాళ్ళ కడియాలని కరిగించుకొని
కాలం తప్పించుకుంటే
గోపమ్మ అవ్వ గోలకు
పెద్దబోయి నీడ లేచి కూసుంది!
చెరువు కరువు మధ్య
పరువు నీడలయ్యింది

ఎన్ని నాత్రులను దుస్సినా
ముచ్చట బంతియో ఇది!

ఏడుగడ్డల కులం ఎత్తికడితే
పేనుకున్న మనో పోసలకూ
ఉరిపడ్డ అంతరం
ఎన్ని కొలువులో ఎన్ని శిగాలో
లోన పగిలిన ఎక్కిల్ల పుట్ట!

బూడిద ఎత్తిపోసుకున్న దరిమీన
ఎవడి బొమ్మ ముగ్గో
యదచీల్చి నవ్వుతుంది..!

ఏ రెక్కల పక్క నుంచో

ఏ అడుగుల కింది నుంచో
మట్టి నీళ్లు మళ్లిపోయినవో కాని
బోరబోరకు నాటుకుంటిమి!

యెద చెమ్మలే పారి పారి
మళ్ళీ చెరువయింది కదా బోయ
ఎన్ని కనులు పరిచిన
గడియగడియ సీకటిజనే..

కాటిలో కాలు కలిసి
కాలం సాటున
దాగుడు మూతలాడుతున్న ఊపిరికి
ఉయ్యాల కట్టిన దుఃఖాల యజమానిని

ఎంతకని ఇంకెంతకని చెప్పు దేవా
అలుగెల్లుతున్న అలజడిలో..
కర్మల మర్మపు చర్మము వలిచే
నా మార్మిక లోకంలోకి పోతున్నా

బుడ్డ పరకలేదు
గడ్డిపరక లేదు
పాలుకొచ్చిన పాలోడు లేడు
ఏలుబడి నాదే/ ఏలికను నేనే
చితిని చిత్తరువును జేసే నిశ్శబ్దకారుడను

– మునాసు వెంకట్
99481 58163

'క్రీడాభిరామం' కావ్యంలో ఆనాటి ప్రజల విశ్వాసాలకు సంబంధించిన అంశాలు మన దృష్టిలోకి వస్తాయి అవి. ఏకవీరాదేవిస్తుతి, ఏకవీరాదేవి ఎదుట పరశురాముని కథను పాడటం, ఒక మాలెత ఏకవీరను కీర్తించటం, అక్కల ఆరాధనం, జక్కుల పురంధ్రికామవల్లీస్తుతి, మైలార దేవస్తుతి, భైరవస్తుతి మొదలైనవి. ఇవేగాక నగరమునందలి నానావిధ దేవాలయాలను వర్ణించిన ఈ పద్యం ఆనాటి ప్రజల దెవ్వారాధనాతాత్పరతను వెల్లడిస్తుంది.

# క్రీడాభిరామం-సాంఘిక జీవనం

ఒక వినోదాత్మకమైన క్రియా విశేషం క్రీడ. అలాంటి క్రీడ జీవితానికి ఆనందాన్ని సౌందర్యాన్ని చేకూరుస్తుంది. ఏ క్రీడ లక్షైనా పరమార్థం ఆనందమే. కాబట్టి మానవులు ప్రతి క్రియా విశేషమైన క్రీడల్లో సౌందర్యాన్ని అన్వేషిస్తూ ఉంటారు. ఆ అన్వేషణ ఫలితమే వినుకొండ వల్లభరాయని '**క్రీడాభిరామం**'. ఇది వీధి అనే ఏకాంకరూపక విశేషం. సంస్కృతంలోని ప్రేమాభిరామాన్ని అనుసరించి రాయబడిందే అయినా ఈ కావ్యం సర్వస్వతంత్రంగా కనిపిస్తుంది.

'**క్రీడాభిరామం**' మిగిలిన కావ్యాల వంటిది కాదు. 295 పద్యాలతో కూడినది. తెలుగు సాహిత్యంలో గొప్ప కావ్యంగా ప్రసిద్ధి చెందడానికి కారణం సమకాలిక ప్రజల జీవన విధానాలను ప్రతిఫలింపజేయడమే. ఈ లక్షణం ఈ కావ్యానికి ఒప్పినంతగా తెలుగులో మరే కావ్యానికి ఒప్పదు. 15వ శతాబ్ది ప్రారంభంలో సంస్కృతపురాణ గాథానువాదమే సర్వకవితా విధానంగా సాగుతున్న ఆ కాలంలో ఆధునిక కవితా లక్షణాన్ని సంతరించుకొన్న అభినవ కావ్యం క్రీడాభిరామం. ఈ కావ్యంలో 14వ శతాబ్దం నాటి ఓరుగల్లు పట్టణం, అందులోని వివిధ వర్గాల ప్రజల విశ్వాసాలు, ఆచారాలు, దురాచారాలు, భోగాలు, క్రీడలు, వినోదాలు వాస్తవికంగా చిత్రించబడినవి. ఆనాటి శిష్ట దుష్టసంప్రదాయాలను కవి సమయాలను నేర్పుతో అవహేళన చేయడం ఈ కావ్యంలో విశేషంగా కనిపించే అంశం.

ఈ కావ్యంలో సామాన్య వ్యక్తులు ప్రధానపాత్రలు కావడం విశేషం. గోవిందమంచన శర్మ, టిట్టిభశెట్టి అను ఇరువురు ఓరుగల్లు నగరంలోకి పోతూ దారిలో వారి చూపులను ఆకట్టుకొనే దృశ్యాలను వర్ణిస్తారు. వారికి ఎదురైన వివిధ సన్నివేశాల వర్ణన, వేశ్యల వర్ణన, పల్నాటి వీరుల కథాగానము, వాద్య విశేషము వివిధ కులాలు, వృత్తులు, కళలు, ఆచార వ్యవహారాలు మొదలైన ఆనాటి సాంఘిక జీవనంలోని ప్రధానాంశాలను వినుకొండ వల్లభరాయుడు ఈ క్రీడాభిరామకావ్యంలో అత్యంత సుందరంగా మనోహరంగా వర్ణించాడు. నాటి ఓరుగల్లు నగరంలో వున్నటువంటి వేషాలంకరణ గోవిందమంచన శర్మ వర్ణనలో కవి ఇట్లు వ్యక్తం చేస్తాడు..

**'గన్నెరుపూజాయ కరమొప్పు నీర్కావి**
**మడుగుదోవతి పింజెవిడిచి కట్టి**
**గొజ్జంగిపూనీరు గులికిమేదించిన**
**గంగమట్టిలలాటకమునదీర్చి**
**వలచేత బంగారు జలపోసనముతోడఁ**
**బ్రన్ననిపట్టుతోరముధరించి**
**జటిగొన్న వెలిపట్టు జన్నిదంబుల లుంగ**
**యంటులు వాయంగ నటుతవైచి**
**తళుకు చెంగావి కోకయు వలుదశిఖము**
**జిగురు బొమ్మంచు పెదవులు చిన్న నగవు**
**నందమొందంగవచ్చె గోవిందశర్మ**
**మాధవుని పట్టి, యొనపరిమన్మథుండు**
**కాసల్నాటి శ్రేష్ఠుండు,**
**మసాలప్పయ్యగారి మేనల్లుడు ధా**
**త్రీ సురతిలకుడు, కుసుమ శ**
**రాసనసముడంధ్రనగర యాత్రోన్ముఖుడై..'**

ఈ విధంగా ఆ కాసల్నాటి బ్రాహ్మణశ్రేష్ఠుడు గోవిందశర్మ ఎలా ఉన్నాడంటే.. గన్నేరు పూజాయ నీర్కావి దోవతి కట్టి గొజ్జంగి పూలరసంతో మేదించిన గంగమట్టితో లలాట ప్రదేశంలో నీటుగా బొట్టుపెట్టి, జరీపట్టుకండువా వల్లెవాటువేసి, తెల్లగామెరుస్తున్న జన్నిదంతో, ఇంత ముచ్చటముడితో, చిగురుపెదవులు మీద చిరునవ్వు చిందులాడుతూ ఉండగా సాక్షాత్తు మన్మథుడిలాగా ప్రకాశిస్తూ నగర ప్రవేశం చేస్తున్నాడు గోవిందశర్మ. ఇది నాటి ఒక విలాసవంతుడివేషం.

కార్యార్థియైనవాడు వేకువ జామునే ప్రయాణం చెయ్యడం శుభసూచకమని ఆనాటి నుండి ఈనాటి వరకు ఉన్న ప్రజల జీవన విధానంలోని ఒక విశ్వాసం. ఈవిశ్వాసాన్ని గురించి క్రీడాభిరామ కర్త ఇలా వర్ణిస్తాడు.

'గోధూళిలగ్నంబునంబురంబు ప్రవేశింపవలయు విశేషించి యుషఃకాలము సర్వప్రయోజనారంభములకు బ్రశస్తంబు. ప్రశస్తమైన ఈ విశ్వాసము గార్గుడు బృహస్పతి, వ్యాసా ది ప్రముఖులచేత ప్రమాణీకరింపబడినది' అంటారు.


> పాటల విషయంలోనే కాదు, ఆటల విషయంలో కూడా ఆనాటి ఓరుగల్లు ప్రజలు ఆరితేరినవారు. పొట్టేళ్ళ పం దెములు, కోడిపందెములు, పాములాటలు, బాలల బంగారు బంతులాటలు మొదలైనవి నాటి ప్రజల సాంఘిక జీవన విధానంలో ప్రధానాంశాలుగా ఉండేవని వినుకొండ వల్లభరాయని 'క్రీడాభిరామం' వల్ల మనం తెలుసుకోగలుగుతున్నాం.


**'గార్గ్య సిద్ధాంత మత ముషఃకాలకలన**
**శకున మూనుట యది బృహస్పతి మతంబు**
**వ్యాస మతమమునః ప్రసాదాతిశయము**
**విప్రజనవాక్యమఱయంగవిష్ణు మతము..'** అని వర్ణించాడు కవి.

ఆనాడు ప్రజలకు శకునశాస్త్రంపై గల విశ్వాసాన్ని క్రీడాభిరామంలోని ఈ పద్యం వల్ల కూడా తెలుసుకోవచ్చు.

**'చుక్కయొకింత నిక్కి బలసూదను దిక్కున రాయుచుండుటన్**
**జక్కగ వేగదిప్పుడు, నిశాసమయంబిది ప్రస్ఫుటంబుగా,**
**ఘుక్కున మాటిమాటికిని గోటఁడు వల్కెడు వామదిక్కునన్,**
**జొక్కటమై ఫలించు మనశోభన కార్యములెల్లఁ డిట్టిభా !'**

శకున శాస్త్రవేత్తల మత ప్రకారంగా ప్రయాణం చేసే సమయంలో ఎడమ వైపు నుంచి గుడ్లగూబ కూయడం, పూలకొమ్మ మీది నుండి నెమలి కేరింతలు పెట్టడం, కోడి, ఏట్రింత (భరద్వాజపక్షి), గుంటనక్క ఇవి ఎదురైతే ప్రయాణికులకు అది కొంగుబంగారం అని అంటే సులభసాధ్యమని పై పద్యాలలోని తాత్పర్యం. అలాగే.. ఆనాటి ఓరుగల్లు నగరవైభవం క్రీడాభిరామంలో ఏవిధంగా వర్ణింపబడిందో చూడండి.

**'ఓరుగంటి పురంబు సౌధములపై నొప్పారెడిన్ జూచితే**
**యీరెండల్? మణిహేమ కుంభములతోనేకాంతములు సేయుచున్**
**స్వారాజ్య ప్రమదా ఘనస్తన భరస్థానంబులంబాసి, కా**
**శ్మీర క్షోదము, ప్రాణవల్లభ దృఢాశ్లేషంబులన్ రాలెనాన్..'**

అంటూ.. వేకువజామున ప్రసరించే లేతనైన అరుణ కిరణకాంతులతో మెరిసే ఎత్తయిన సౌధాలు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తూ ఆనాడు ఓరుగల్లు మహానగర సౌందర్యానికి సంస్కృతికీ ప్రతిరూపాలుగా నిలిచినాయంటాడు క్రీడాభిరామ కవి.

వినుకొండ వల్లభరాయుడు అలనాటి ఓరుగల్లు నగర స్వరూపాన్ని వర్ణిస్తూ..

**'సప్తపాతాళ విష్టప మహా ప్రస్థాన**
**ఘంటా పథంబైన గనప పరిఖ**
**తారకామండలస్తబ కావతంసమై**
**కనుచూపు గొనని ప్రాకారరేఖ**
**పుంజీ భవించిన భువనగోళము భంగి**
**సంకులాంగణమైన వంకదార,**
**మెఱుగు ఱెక్కలతోడి మేరు శైలముబోలు**
**పైన బైడి తలుపుల పెద్దగవని**
**చూచె, జేరె ప్రవేశించె, జొచ్చె బ్రీతి**
**సఖుడు దానును రథ ఘోట శకట కరటి**
**యూధ సంబాధములు కయ్య నోసరిలుచు**
**మందగతి నోరుగల్లు గోవింద శర్మ..'**

ఇది ఓరుగల్లు స్వరూపాన్ని తెలిపే పద్యం. గవని అంటే ద్వారం. ఆకాశ మండలంలో నక్షత్రాలనంటుకొను నంతటి ఎత్తైన ప్రాకారములు వాటి వెంట సప్త పాతాళములంతటిలోతైన పరిఖలు, గుండ్రని వంకరదారులు వాటితో పాటు మేరు పర్వతంవలె తళతళమెరిసే తలుపులతో కూడి ఉన్న పెద్ద ద్వారము. ద్వారము నుండి వస్తూపోతూ వున్న ఏనుగులు రథాలు గుఱ్ఱాలతో జనసమ్మర్ధంగా ఉంది. అందువల్ల జనసమ్మర్ధాన్ని తప్పించుకోవడానికి క్రంతత్రోవలు (సన్నటిదారులు) కూడా ఉన్నాయి. ఆ త్రోవలవెంట వేశ్యవాటికలూ ఉన్నాయి. అవి దాటుకుంటూపోతే అక్కలవాడ ఒకటి వస్తుంది. అక్కడ వేడుకలు ప్రదర్శించబడుతూ ఉంటాయి.

ఓరుగల్లు నగరంలో వేశ్యవాటికలను దాటుకుంటూ పోతే మరొక విలక్షణమైన వాడ కనిపిస్తుంది. అది అక్కలవాడ. ఆ పేరు దానికి ఎందుకొచ్చింది? ఆ అక్కలు ఎవ్వరు? క్రీడాభిరామం కావ్యంలో ఈ అక్కలవాడకు ఒక విశిష్టత ఉంది. బాటసారులైన బ్రాహ్మణులకు నిత్యాకృత్యములు తీర్చుకొనుటకు యోగ్యమైన స్థలం అక్కలవాడ. మంచన మాచల్దేవుల సంభాషణలో ఇది తెలుస్తుంది..

**'నైన విచ్చేసి కూర్చుండ నవధరింపు**
**వార్చి వచ్చెదమటువోయి వనరుహాక్షి !**
**యెచ్చటికి వార్వఁబోయెద రెఱుఁగఁజెప్పుఁ?**
**డక్కవాడకు మేము బ్రాహ్మణులమగుట..'**

అందుకేనేమో బాటసారులైన బ్రాహ్మణులు అవసరాలను తీర్చడం వలన ఆ వాడకు గౌరవప్రదంగా 'అక్కలవాడ' అని పేరు వచ్చి ఉంటుంది.

క్రీడాభిరామంలో వివిధ కులాలకు సంబంధించిన స్త్రీలను గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది. వివిధ వృత్తులను ఆశ్రయించి బతుకుతున్న ఈ స్త్రీలు అందరూ బహు సౌందర్యవతులు, శ్రమైకజీవులు. కాపుకాంతలు, కరణకాంతలు, మేదర, మాలెతలు, కిరాటకాంతలు, బ్రాహ్మణ వితంతువులు, వేశ్యకాంతలు మొదలైన స్త్రీలతో పాటు 'మాహురమ్మ'వంటి యోగినులు కూడా ఓరుగల్లు నగరంలోని సాంఘిక జీవనానికి నిదర్శనంగా కనిపిస్తారు.

ఆహార విహారములకు ఆటపట్టువుగా వర్ణింపబడిన ఆనాటి ఓరుగల్లు నగరంలో మంచనశర్మ వంటి విలాస పురుషులకు వితంతువులను విహారస్థానములుగా చూపటం స్త్రీలను కించపరచడమేనని అనిపిస్తుంది. ముఖ్యంగా '**పూవుంబోడులు లేరె విప్రవిధవల్ భూమండలిన్?**' అంటూ వర్ణించడం కవికి ఒక జాతి స్త్రీలపై ఉన్న ప్రత్యేక దృష్టిని వెల్లడిస్తున్నది.

ఇంకా ఈ 'క్రీడాభిరామం' కావ్యంలో ఆనాటి ప్రజల విశ్వాసాలకు సంబంధించిన అంశాలు మన దృష్టిలోకి వస్తాయి అవి. ఏకవీరాదేవిస్తుతి, ఏకవీరాదేవి ఎదుట పరశురాముని కథను పాడటం, ఒక మాలెత ఏకవీరను కీర్తించటం, అక్కల ఆరాధనం, జక్కుల పురంధ్రికామవల్లీస్తుతి, మైలార దేవస్తుతి, భైరవస్తుతి మొదలైనవి. ఇవేగాక నగరమునందలి నానావిధ దేవాలయాలను వర్ణించిన ఈ పద్యం ఆనాటి ప్రజల దెవ్వారాధనాతాత్పరతను వెల్లడిస్తుంది. ఆ పద్యం చూడండి

**ఆదె భైరవ స్థాన! మట మీద నల్లదె**
**చమడేశ్వరీ మహాశక్తి నగరు!**
**వీరభద్రేశ్వరాగారమండపమదె!**
**యదె బౌద్ధదేవు విహారభూమి!**
**అదె ముద్దరాల్ ముసానమ్మ నివాసంబు!**
**నల్లదె కీమర సామయ్య నగరు**
**అదె పాండవుల గుడి ! యట దక్షిణంబున**
**గర్తారు దుండు తుర్కల మసీదు**
**కొంత దవ్వుల నదె మహాగోపురముల**
**పైడికుండలు రవి దీప్తి బ్రజ్వలించి**
**కాననయ్యెను మేరు శృంగములబోలెఁ**
**కేశవ శ్రీ స్వయంభూ నికేతనములు**

ఈ పద్యములు ఓరుగల్లు నగరంలోని వివిధ దేవాలయాలను వెల్లడించడమే గాక చారిత్రకంగా నగర స్వరూపాన్ని కూడా వ్యాఖ్యానిస్తున్నది. పాటల విషయంలోనే కాదు, ఆటల విషయంలో కూడా ఆనాటి ఓరుగల్లు ప్రజలు ఆరితేరినవారు. పొట్టేళ్ళ పందెములు, కోడిపందెములు, పాములాటలు, బాలల బంగారు బంతులాటలు మొదలైనవి నాటి ప్రజల సాంఘిక జీవన విధానంలో ప్రధానాంశాలుగా ఉండేవని వినుకొండ వల్లభరాయని 'క్రీడాభిరామం' వల్ల మనం తెలుసుకోగలుగుతున్నాం.

**– ప్రొఫెసర్ కె.యాదగిరి, 93901 13169**



## చినుకు కథ

**ఆకాశం** మబ్బుల చీర కట్టుకుంది
భూమికి మొదటి ముద్దు ఇవ్వాలని..
అంతలోనే గాలి విసురుగా వచ్చి
మబ్బుకి రూపం లేకుండా చేసింది
ఒక్కో బిందువు ఆవిరితో
తనను తను మళ్ళీ నిర్మించుకుంటోంది ఆకాశం!

భూమిని తడపాలని తపన ఆకాశానికి
చినుకులను కానుకిచ్చి మచ్చిక చేసుకోవాలని ఆరాటం !
భూమి ఏమి తక్కువ తినలేదు..
ఆకుపచ్చ సిగ్గులను వాగ్దానం చేస్తుంది

రైతులు గింజలు తీసుకుని బయల్దేరారు
భూమికి రంగులద్దడానికి !
ఇంతకంటే అద్భుత దృశ్యం ఏముంటుంది లోకంలో?

తనలో ఆవిరిగా లేస్తున్న విరహాన్ని లేఖ రాసింది భూమి!
ఆకాశం చదివి నవ్వుకుని..
మబ్బులతో ఉపశమింప చేసింది..!
వాన చినుకులతో నిమిరి ఓదార్చింది!

ఆకాశం, భూమి అలా తరతరాలుగా
ప్రేమించుకుంటూనే ఉన్నయ్.. ఉంటయ్..

ఇన్ని కోట్లమందికి జీవం పోస్తున్న ఆ ప్రేమ
ఎంత అద్భుతమైంది కదా!

విత్తనం కఠినంగా ఉంది
బయట పొడిగా ఉంది
అందరికీ ఆకలిగా ఉంది
ఆకాశానికి కోపమొచ్చి విత్తనాన్ని మార్చాలని
అదేపనిగా వర్షించింది..
విత్తనం పొరలు పొరలుగా మెత్తబడి..
సిగ్గుపడి భూమిలో తల పెట్టుకుంది

అప్పుడు భూమి..
భయపడవద్దని మొలకెత్తమని
తలెత్తుకు బతకమనీ
తనలాగా అందరికీ సాయపడమనీ చెప్పింది..!

అంతే...
ఈ ప్రపంచానికి ఆకుపచ్చగా సలాం చేసింది విత్తనం!

వాన ఎంత గొప్పది..
చీకటైనా, వెలుతురైనా
గుడ్డిగా భూమిని ప్రేమించేస్తుంది!
నల్ల తెల్ల చామన...
ప్రతీ ఛాయను హత్తుకుంటుంది!
నేలైనా, నీరైనా..
నగరమైనా, పల్లైనా..
అడవైనా, మైదానమైనా
వాన కురుస్తూనే ఉంటుంది..
సమానత్వాన్ని చాటుతూనే ఉంటుంది..!

ఎంత అద్భుతమైన సందేశం!
వానొస్తుంటే అందరూ
వేడిగా బజ్జీలు, ఐస్ క్రీమ్ తినాలనో..
కాఫీలు, సూప్ లు తాగాలనో..
తడవాలనో పలవరిస్తుంటరు..

నాకేమో
ఊర్లో రైతు కలలోకి తొంగి చూడాలనిపిస్తుంది
అక్కడ ప్రవహించే జలధారలను తడమాలనిపిస్తుంది

అక్కడే కదా..
కోట్లమంది ఆకలికి సమాధానం దొరుకుతుంది!

– డాక్టర్ షాజహానా

## ప్రకటనలు

### పరిచయ సభ

డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ విమర్శ గ్రంథం 'మూడుపదులు ముప్పై కావ్యాలు' పరిచయ సభ 2019 ఆగస్టు 24న సాయంత్రం 6 గంటలకు కరీంనగర్ ఫిలింభవన్‌లో జరుగుతుంది. కందుకూరి అంజయ్య అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా డాక్టర్ లంకా శివరామప్రసాద్, నగునూరి శేఖర్, గాజోజు నాగభూషణం, అన్వర్, డాక్టర్ తైదల అంజయ్య, అన్నవరం దేవేందర్ హాజరవుతారు. సి.వి.కుమార్ పుస్తక పరిచయం చేస్తారు.

**- కూకట్ల తిరుపతి, సమన్వయకర్త**

### ధ్వని-7 'కవిత్వ విశ్లేషణ'

ధ్వని-7 కార్యక్రమంలో భాగంగా.. 2019 ఆగస్టు 24న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, హెరిటేజ్ బిల్డింగ్‌లో 'కవిత్వ విశ్లేషణ' ఉంటుంది. ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరుగు సభలో గీతాంజలి, పొన్నాల బాలయ్య, వడ్డెబోయిన శ్రీనివాస్ కవిత్వ పఠనం చేస్తారు. డాక్టర్ చింతకింది కాశీం 'కవిత్వ విశ్లేషణ'పై ప్రసంగిస్తారు. ఆత్మీయ అతిథిగా అయాచితం శ్రీధర్, సమావేశకర్తగా సీహెచ్ ఉషారాణి పాల్గొంటారు. .

**- డాక్టర్ చెమన్, తెలంగాణ చైతన్య సాహితి, హైదరాబాద్**

### ఆవిష్కరణ సభ

ఝాన్సీ కొప్పిశెట్టి నవల 'అనాచ్ఛాదిత కథ' ఆవిష్కరణ సభ 2019 ఆగస్టు 24న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాలులో జరగుతుంది. ఎ. జగన్నాథశర్మ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా కె.శివారెడ్డి, మామిడి హరికృష్ణ, కె.పి.అశోక్‌కుమార్, జ్యోతి హాజరవుతారు. ఓల్గా పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. స్వాతి రౌతు వందన సమర్పణ చేస్తారు.

**- పాలపిట్ట, కవిసంగమం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ**

### సాహిత్య-సాంస్కృతిక సమ్మోహనం

శ్రీశారద సత్యనారాయణ అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'సాహిత్య-సాంస్కృతిక సమ్మోహనం-2019' కార్యక్రమం ఆగస్టు 23న సాయం త్రం 4 గంటలకు, హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలోని కళామందిరంలో జరుగుతుంది. గౌరవ అతిథులుగా డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, డాక్టర్ కె.వి.రమణాచారి, డాక్టర్ వోలేటి పార్వతీశం, డాక్టర్ అమృతలత, డాక్టర్ తెన్నేటి సుధాదేవి, డాక్టర్ వంశీ రామరాజు, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ తదితరులు హాజరవుతారు. .

**- కోసూరి ఉమాభారతి, అర్చన ఫైన్ఆర్ట్స్ అకాడమీ**

# ఆటల క్రీనీడల కథలు

**ఈ** మధ్యకాలంలో ఒకే కథాంశం ఆధారంగా వచ్చిన కథా సంకలనాలు ఆసక్తిని కలిగిస్తున్నాయి. రచయిత సంపాదకులు కస్తూరి మురళీకృష్ణ, కోడిహళ్ళి మురళీమోహన్ కలిసి మరో సంకలనాన్ని పాఠకులకు అందించారు. అది '**క్రీడా కథ..**' రైలు కథలు, దేశభక్తి కథలు అనంతరం ఇప్పుడొచ్చిన సంకలనం ఇది. ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని అన్వేషించే వారి ప్రయత్నంలో మరో మైలురాయి ఈ క్రీడా కథ.

అయితే ఈసారి కథలను శీర్షికలతో వర్గీకరించారు వారు. శ్రీపాద వారి కథను ఎందుకు ఉపయోగించుకోలేకపోయారో వివరించే ప్రయత్నం చేశారు. కథాస్ఫూర్తిని అనుసరించి నాంది, ప్రస్తావన, క్రీడాస్ఫూర్తి, మానసికం, వినోదం, ఉన్మాదం, నేరం అంటూ మరింతగా విభజించి కథలను క్లాసిఫై చేసే ప్రయత్నం చేశారు. అదొక ప్రయోగంగానే భావించాలి తప్ప తప్పనిసరి అవసరమైతే కాదు.

ఈ విభజన వల్ల కథలను అవి ప్రచురింపబడిన సంవత్సరాల ఆధారంగా చూసే అవకాశం లేకుండాపోయిందేమో. ప్రధానంగా ఈ కథల్లో ఎక్కువగా కనిపించిన క్రీడలు క్రికెట్, చెస్, టెన్నిస్, ఫుట్‌బాల్, హాకీ లాంటివి. ఒకటీ, అరా.. ఆటలను ఏ దశలోనూ ప్రోత్సహించని తెలుగు సమాజంపై చురకతో ఈ సంకలనం మొదలవుతుంది. అది భూపాల్ కథ **'అదీ ఆటే'.** చిన్నపిల్లలకు ఏ అవకాశమూ లేనప్పుడు పెద్దవాళ్ళ చెప్పులేసుకొని అటూ ఇటూ నడుస్తుంటారు దాన్నో ఆటగా భావిస్తూ. అలాచేస్తున్న ఓ చిన్నపిల్లని విసుక్కొని లాక్కెళ్ళిపోతుంది తల్లి. బాల సాహితీవేత్త భూపాల్ '**ఉగ్గుపాలు**' నుంచి తీసుకున్నారు. అలా మొదటి కథే మనలను అద్దంలో చూసుకొమ్మని హెచ్చరిస్తుంది.

ఇక ప్రస్తావన శీర్షికన కవి కొండల వెంకట్రావు కథ '**చెడుగుడు-చెండాట**' అప్పటి గ్రామీణ పరిస్థితులను ప్రతిబింబించే కథ. అనంతరం క్రీడాస్ఫూర్తి శీర్షికతో నాలుగు కథలున్నాయి. అందులో మొదటిది చిలుకూరి దీవెన '**ఆటపట్టు**' కథ. క్రీడారంగంలోను దళితులకు అన్యాయం జరిగిందన్న పాయింట్‌ను ఎంచుకుంటారు రచయిత్రి. యువ కథకురాలు అయాచితం స్పందన కథ '**ఆమె గెలిచింది**' కాస్త సినిమాటిక్‌గా ఉన్నా ఒక ఆడపిల్ల ధైర్యంగా అమ్మానాన్నలను ఎదిరించి క్రీడల్లో పాల్గొనటం అన్న అంశం తీసుకున్నందుకు అభినందించాలి. హార్దిక గారి కథ '**తాయ్ చి మాస్టర్**' సమాజంలోని అన్యాయాలను ప్రశ్నించటానికి తాయ్ చి అనే క్రీడను ఆలంబన చేసుకున్న ఓ వ్యక్తి కథ. నిడివి ఎక్కువున్నా బౌద్ధ చైనీస్ సంప్రదాయాలను కలబోసుకున్న ఈ కథలో చదివించే గుణం మనలను పరిగెత్తిస్తుంది. ఒక క్రీడకు ఉండే లోతైన శక్తిని వివరించే ప్రయత్నం చేస్తుంది. చెడుపై మంచి పోరాటం సినిమాటిక్‌గా సాగి పాఠకులను అలరిస్తుంది.


ఎక్కువ శాతం క్రీడా కథలన్నీ క్రీడలకు మనిషి మనసత్వానికి ఉండే సంబంధాన్ని పోల్చిచూపేవే. కొన్ని కథలు ఉత్తమస్థాయిలో ఉండి పాఠకుడిని వెంటాడుతాయి. చెస్ ఆటపై వచ్చిన శ్యామల గారి చదరంగం, సి.రామచంద్రరావు గారి టెన్నిస్ టోర్నమెంట్ కథలు ఆ కోవకు చెందుతాయి. క్రీడలోక obsessionగా మారిన వారిని చూపుతాయీ కథలు. చదరంగం ఆట మోజులో ఇల్లాలిని పట్టించుకోని భర్తను ఆ ఇల్లాలు ఎలా వదిలించుకొని తనదారి తను వెతుక్కుందో చెప్పే కథ. శ్యామల గారి రచన కథాకాలం 1977. అదే సి. రామచంద్రరావుగారి టెన్నిస్ టోర్నమెంట్ కథలో కూడా ఇలాంటి లక్షణాలున్న భర్త పాత్రను చూస్తాం.

యామిజాల పద్మనాభస్వామి గారి 'తోసిరాజు' పాఠకుడికి కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇది కూడా చెస్ నేపథ్యంలో నడిచే కథే. కానీ ఇక్కడ కూడా కథ నడిచిన తీరు పాఠకుడిని కథ నుంచి దృష్టిని మరల్చనివ్వదు. విజయనగరం రాజా వారు కూరెళ్ళ శాస్త్రులు గారు మధ్య నడిచిన చదరంగపు ఎత్తులు, పై ఎత్తులను శిల్పాసౌందర్యంతో నింపే కథ. 'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా?' అనేది ఎలా జరుగుతుందో సుతిమెత్తగా చెబుతుందీ కథ.

ఇక యండమూరి వీరేంద్రనాథ్ గారి 'టాస్' కథ. క్రికెట్ నేపథ్యంగా వచ్చిన కథ. సునీల్ గవాస్కర్‌తో ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా దిగిన ఒక తెలుగువాడిని పాత్రచేసిన కథ. ఎనభైల నాటి ప్లేయర్లు గవాస్కర్, విశ్వనాథ్, ఆండీ రాబర్ట్స్, హోల్డింగ్ వంటి వారిమధ్య ఒక కొత్తప్లేయర్ ఆడినప్పుడు చెలరేగే భావోద్వేగాలను చెబుతుంది. దానికో లవ్ యాంగిల్ చేర్చటంతో కథ క్రికెట్ మ్యాచ్‌లా ఉద్వేగంగా సాగుతుంది. ఇది 1981లో వచ్చిన కథ. 1980లో భారత్‌లో పర్యటించిన వెస్టిండీస్ జట్టు కథా నేపథ్యమైంది.

పెద్దిరాజు జంపన కథ కూడా మనలోని ఉద్వేగాలను కలియబెట్టి తిప్పుతుంది. కథ పేరు 'ఫాల్ ఫాల్'. టెన్నిస్ ప్లేయర్‌కు నీరాజనాలు పట్టే నగరం టెన్నిస్ కోర్టును తయారుచేసే కూలీ అనారోగ్యంతో మరణిస్తే నిర్దయపూరిత నగరాన్ని తట్టుకోలేని క్రీడాకారిణి వ్యథ. మనపై రచయిత తన కోపాన్ని చాలా దుఃఖ భరితంగా ప్రకటిస్తాడు. మొత్తం వ్యవస్థను పరిహసిస్తాడు.

ఫేడవుట్ అయిపోయే క్రీడాకారులు అంత తొందరగా ఆ విషయాన్ని గుర్తించరు. అది తెలిసినప్పుడు వేదాంతిలా మారిపోతారు. ఒంటరితనం ఆవరించి బేలగా మారిపోతారు. అలాంటి కథ యర్రంశెట్టి సాయి 'అవుట్'కథ. ఈకథను నిర్మించిన తీరుకు పాఠకుడు కథలో లీనం అవకతప్పదు.




> క్రీడల్లో ఉండే నేరపూరిత స్వభావం చూపే కథలు మూడున్నాయి. ఒకటి మల్లాది వెంకటకృష్ణమూర్తి గారిది చదరంగంలో హత్య. ఆయన శైలి, ధోరణి అందిపుచ్చుకున్న కథ. 1972లో అపరాధ పరిశోధనలో వచ్చింది. అలాంటిదే మరో కథ కస్తూరి మురళీకృష్ణ గారి 'మర్డర్ కాని మర్డర్'. సాంకేతికంగా ఉన్నతంగా ఉన్న కథ.


ఇక క్రీడల్లో ఉండే నేరపూరిత స్వభావం చూపే కథలు మూడున్నాయి. ఒకటి మల్లాది వెంకటకృష్ణమూర్తి గారిది చదరంగంలో హత్య. ఆయన శైలి, ధోరణి అందిపుచ్చుకున్న కథ. 1972లో అపరాధ పరిశోధనలో వచ్చింది. అలాంటిదే మరో కథ కస్తూరి మురళీకృష్ణ గారి 'మర్డర్ కాని మర్డర్'. సాంకేతికంగా ఉన్నతంగా ఉన్న కథ.

చివరిగా ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన కథ దామా గోవిందరావు గారి 'నా ఒలింపిక్ కల'. ఫుట్‌బాల్ నేపథ్యంలో సాగే కథ. చివరికి హిట్లర్‌తో వాదించే యువ బృందం కలను కథగా తెలియజెప్పే కథ. హాస్యభరితంగా సాగే ఈ కథ 1935లో వచ్చింది.

ఈ కథాసంకలనంలో చాగంటి తులసి, వసుంధర, ఎన్.ఆర్.చందూర్ వంటి లబ్ధ ప్రతిష్ఠుల కథలు కూడా ఉన్నాయి. అలాగే సంపాదకులు కస్తూరి మురళీకృష్ణ, కోడీహళ్ళి మురళీమోహన్‌ల కృషి అభినందించదగినది.

**– సి.యస్.రాంబాబు, 94904 01005**

## కొత్త పుస్తకాలు

### తెలంగాణ విజయగాథ



రాష్ట్ర అవతరణ తర్వాత స్వీయ పాలనలో తెలంగాణ ఆత్మగౌరవంతో సాధికారికంగా అభివృద్ధి పథాన నడుస్తున్న తీరుకు ఈ పుస్తకం అద్దం పడుతుంది. ఈ పుస్తకం ప్రభుత్వం చేసిన ఐదేండ్ల ప్రగతికి సంబందించిన సమాచారం మాత్రమే కాదు, ఒక మహత్తర సంకల్పంతో తెలంగాణ సమాజం కదిలిన, కదులుతున్న తీరుకు దర్పణం.

**సంపాదకుడు: జూలూరు గౌరీశంకర్ వెల: రూ.175**
**ప్రతులకు:అడుగుజాడలు పబ్లికేషన్స్, 410, ఎంఎస్‌కే టవర్స్, స్ట్రీట్ నెం:11, హిమాయత్‌నగర్, హైదరాబాద్**

### తెలంగాణ గ్రామాయణం



కీ.శే. ఆచార్య మారంరాజు సత్యనారాయణ రావు ఏడు దశాబ్దాల జ్ఞాపకాల్ని పదిలంగా కాపాడుకున్న మానవీయ వ్యక్తి. తన జ్ఞాపకాల శకలాలను క్రమంగా పేర్చటం ద్వారా 20 శతాబ్దపు గ్రామ పాలనను, మానవీయ సంబంధాలను కండ్లకు కట్టారు. గ్రామ చరిత్ర గమనాన్ని తెలుసుకోవటానికి చదివి తీరవలసిన పుస్తకం ఇది.

**రచన: మారంరాజు సత్యనారాయణరావు వెల:రూ. 50**
**ప్రతులకు: అస్తిత్వ ప్రచురణలు, ఎమ్ఎస్‌కే టవర్స్, ప్లాట్ నెం: 410, స్ట్రీట్ నెం:11, హిమాయత్‌నగర్, హైదరాబాద్-26.**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

## ఆధార్ సేకరణకు అధికారం ఇవ్వండి!

### కేంద్రాన్ని కోరిన ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ:** ఓటర్ గుర్తింపు కార్డు కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారుల ఆధార్ నంబర్లతో పాటు ఇప్పటికే ఓటర్ గుర్తింపు కార్డులు కలిగిన వాళ్ల ఆధార్ నంబర్లను కూడా సేకరించడానికి చట్టబద్ధమైన అధికారం ఇవ్వాల్సిందిగా కేంద్రాన్ని ఎన్నికల సంఘం(ఈసీ) కోరింది. ఇందుకోసం ప్రజా ప్రాతినిధ్య చట్టం–1950కి మార్పులు చేయాలని ప్రతిపాదించింది. ఈ అంశంపై న్యాయశాఖకు ఓ లేఖ రాసింది. సేకరించిన సమాచారంతో ఓటరు జాబితాలో ఒకటి కంటే ఎక్కువ ఓటు హక్కు కలిగిన వ్యక్తులను ఏరివేయవచ్చని పేర్కొన్నది. ఓటర్ గుర్తింపు కార్డులను ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయాలని కోరుతూ న్యాయశాఖకు ఈసీ ఇటీవలే ఓ లేఖ రాయడం తెలిసిందే. కాగా ఆధార్‌తో ఓటరుకార్డు అనుసంధానాన్ని నిలిపివేయాలంటూ గతంలో సుప్రీంకోర్టు ఈసీని ఆదేశించింది.


## బెంగళూరులో త్వరలో రోబో రెస్టారెంట్లు ప్రారంభం

**బెంగళూరు, ఆగస్టు18:** బెంగళూరులో త్వరలో రోబో రెస్టారెంట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే చెన్నై, కోయంబత్తూరులో రోబో రెస్టారెంట్లు విజయవంతం కావడంతో త్వరలో బెంగళూరులోనూ ప్రారంభించనున్నారు. ఇక్కడ వినియోగదారులకు రోబోలే ఆహారపదార్థాలను వడ్డించనున్నాయి. బెంగళూరులోని ఇంద్రానగర్ హైస్ట్రీట్‌లో ఈ రెస్టారెంట్‌ను ఏర్పాటుచేయనున్నారు. మెనూలో ఎక్కువగా ఇండియా – ఆసియా వంటకాలు అందుబాటులో ఉండనున్నాయి. రెస్టారెంట్‌లో ఆరుగురు రోబోల బృందం ఉంటుంది. వినియోగదారులు తమ టేబుల్ మీద ఉంచిన ట్యాబ్‌ల ద్వారా రోబోలను పిలిచి సేవలు చేయించుకోవచ్చు. ప్రత్యేక సందర్భాలు, పుట్టినరోజు వేడుకల్లో రోబోలు వినియోగదారులకు శుభాకాంక్షలు తెలిపేలా వాటిలో ప్రోగ్రామ్‌ను అమర్చారు. బెంగళూరు ప్రజలు రోబోట్ రెస్టారెంట్లను ఆదరిస్తారన్న నమ్మకం తమకు ఉన్నదని రోబో రెస్టారెంట్ల వ్యవస్థాపకుడు వెంకటేశ్ రాజేంద్రన్ తెలిపారు.



## ఆర్టికల్ 370 రద్దుకు భూపిందర్ హుడా మద్దతు

### కాంగ్రెస్ దారితప్పిందన్న మాజీ సీఎం



**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, హరియాణా మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా కేంద్రం నిర్ణయానికి మద్దతు తెలిపారు. ఈ అంశంలో కాంగ్రెస్ దారి తప్పిందని విమర్శించారు. ఆదివారం రోహ్‌తక్‌లో నిర్వహించిన మహాపరివర్తన్ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. 'ఆర్టికల్ 370 రద్దు విషయంలో మా పార్టీ దారి తప్పింది. ఇది గతంలో ఉన్న కాంగ్రెస్ కాదు' అని వ్యాఖ్యానించారు. దేశభక్తి, ఆత్మగౌరవ విషయంలో తాను రాజీపడబోనని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలోని బీజేపీ సర్కారుపై ఆయన విమర్శలు గుప్పించారు. ఐదేండ్లలో సాధించిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం తీసుకు వస్తామని హామీ ఇచ్చారు.

- వినూత్న పరిష్కారాలతో సవాళ్లను అధిగమించవచ్చు
- అంతరిక్ష పరిశోధనలో భూటాన్‌కు భారత్ సహకారం
- ఉమ్మడి సంస్కృతీ సంప్రదాయాలతో ఇరు దేశాల మధ్య ధృఢ అనుబంధం
- రాయల్ యూనివర్సిటీ ఆఫ్ భూటాన్ విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోదీ



రాయల్ యూనివర్సిటీ ఆఫ్ భూటాన్ విద్యార్థులతో మోదీ

# యువతపైనే భవిష్యత్

**థింపూ, ఆగస్టు 18:**

భావి తరాన్ని ప్రభావితం చేయగల శక్తి సామర్థ్యాలు భూటాన్ విద్యార్థులకు ఉన్నాయని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ప్రతిభావంతులైన భూటాన్ యువత కష్టపడి పనిచేసి దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఉద్బోధించారు. జీవన గమనంలో ఎదురయ్యే సవాళ్లను వినూత్న పరిష్కార మార్గాలతో అధిగమించవచ్చునని, అందుకు పరిమితుల్లేవని పేర్కొన్నారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం శనివారం భూటాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీ ఆదివారం భూటాన్ రాయల్ విశ్వవిద్యాలయం విద్యార్థులతో మాట్లాడుతూ 'యువతరానికి ప్రస్తుతం ప్రపంచంలో పుష్కల అవకాశాలు ఉన్నాయి. అభిరుచి, ఆకాంక్షలకు అనుగుణంగా సరైన మార్గాన్ని ఎంచుకోవడమే ముఖ్యం. భూటాన్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే క్రమంలో మీతోపాటు 130 కోట్ల మంది భారతీయులు భాగస్వాములవుతారు. భారత్ ప్రస్తుతం వివిధ రంగాల్లో చరిత్రాత్మక పరివర్తన చెందుతున్నది. పాఠశాలల నుంచి అంతరిక్షం వరకు, డిజిటల్ చెల్లింపుల నుంచి విపత్తు నివారణ వరకు నూతన రంగాల్లో సహకారాన్ని అందించేందుకు భారత్ ఆసక్తి చూపుతున్నది. ఈ రంగాల్లో మా సహకారం మీ మాదిరిగానే యువ స్నేహితులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది' అని అన్నారు. భారత జాతీయ నాలెడ్జ్ నెట్‌వర్క్, భూటాన్ డ్రక్రెన్ మధ్య సహకారాన్ని అందుకు ఉదాహరణగా చూపారు. 'అంతరిక్ష పరిశోధనారంగంలో సహకారం ద్వారా టెలి మెడిసిన్, దూరవిద్య, మారుమూల ప్రాంతాల్లో విపత్తుల నివారణకు హెచ్చరికల వ్యవస్థ, వాతావరణ అంచనాలు చేపట్టవచ్చు' అని అన్నారు. భారత్ మాదిరిగానే సొంత ఉపగ్రహం ప్రయోగించే దిశగా భూటాన్ ప్రయాణిస్తున్నదని చెప్పారు. 'సొంతంగా చిన్న ఉపగ్రహాల నిర్మాణం, ప్రయోగాల కోసం భవిష్యత్‌లో యువ భూటాన్ శాస్త్రవేత్తలు భారత్‌కు రానుండటం గొప్ప సంతోషాన్నిస్తుంది. మీలో చాలా మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తలు అవుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను' అని చెప్పారు. జల విద్యుత్, ఇంధన రంగాల్లో భారత్, భూటాన్ మధ్య సహకారం రెండు దేశాల మధ్య సంబంధాలకు కేంద్రంగా మారుతుందని మోదీ అన్నారు. రెండు దేశాల మధ్య దశాబ్దాల స్నేహం ఉన్నదని గుర్తుచేసిన మోదీ.. ఉమ్మడి ఆధ్యాత్మిక సంప్రదాయాలు, చరిత్ర, సంస్కృతి ఇరుదేశాలు, ప్రజల మధ్య ధృఢ అనుబంధానికి కారణమని పేర్కొన్నారు. పరీక్షల వేళ విద్యార్థుల ఒత్తిళ్లను అధిగమించేందుకు తాను రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకం పూర్తిగా బౌద్ధుడి బోధనల ప్రభావం ఉన్నదని చెప్పారు. 'నిన్న (శనివారం) నాకు స్వాగతం పలికేందుకు బారులు తీరిన బాలల మోముల్లో చిరునవ్వు ఏనాటికి మర్చిపోలేను' అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో భూటాన్ ప్రధాని లోటేయ్ షెరింగ్ కూడా పాల్గొన్నారు.

### భారత్‌కు చేరుకున్న మోదీ

భూటాన్‌లో రెండు రోజుల అధికారిక పర్యటన ముగించుకున్న ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. భూటాన్ నుంచి బయలుదేరడానికి ముందు ఆయన స్పందిస్తూ 'భూటాన్‌కు ధన్యవాదాలు. చిరస్మరణీయ పర్యటన. భూటాన్ ప్రజల నుంచి అందుకున్న ఆప్యాయతానురాగాలను ఎప్పటికీ మరిచిపోలేను. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది' అని వ్యాఖ్యానించారు. గత మే నెలలో దేశ ప్రధానిగా రెండోసారి ఎన్నికైన తర్వాత మోదీ పర్యటించిన రెండో దేశం భూటాన్. థింపూలో భూటాన్ ప్రధాని లోటేయ్ షెరింగ్‌తో రెండుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై మోదీ చర్చించారు. అంతరిక్ష పరిశోధన, విమానయానం, ఐటీ, విద్యుత్, విద్య సహా పది రంగాల్లో సహకారానికి ఇరు దేశాలు 10 అంశాల్లో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి.

### పాక్‌తో చర్చలన్నవి జరిగితే..

# పీవోకేపైనే

### ఉగ్రవాదులకు సహకారాన్ని విడనాడితేనే సంప్రదింపులు

### కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు



హర్యానాలోని కల్కాలో జరిగిన జన్ ఆశీర్వాద్ ర్యాలీలో రాజ్‌నాథ్

**కాల్కా, ఆగస్టు 18:** కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై పాకిస్థాన్‌తో చర్చలన్నవి జరిగితే.. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) అంశంపైనేనని అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న హరియాణాలో ఆదివారం నిర్వహించిన ఎలక్షన్ ర్యాలీలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని ప్రభుత్వం రద్దు చేయడంతో పాక్‌లో భయంపట్టుకున్నది. అందుకే ఆయా దేశాల తలుపు తడుతున్నది. మనమేమైనా నేరం చేశామా? ప్రపంచంలోనే బలమైన అమెరికా కూడా పాక్ మాటలను నమ్మడం లేదు. భారత్‌తో చర్చలు జరుపాలని ఆ దేశానికి చెప్పింది. ఏ అంశంపై మనం చర్చలు జరుపాలి? పాక్‌తో అసలు ఎందుకు చర్చలు జరుపాలి? తమ భూభాగంలో ఉగ్రవాదులకు సహాయాన్ని నిలిపివేస్తేనే పాక్‌తో చర్చలన్నవి జరుగుతాయి. అది కూడా పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) అంశంపైనే' అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. ఎన్నికల కోసం తాము రాజకీయాలు చేయబోమని, మేనిఫెస్టోలో ఏది చెప్పామో అదే చేస్తామన్నారు. ఆ విధంగానే ఆర్టికల్ 370ని రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. దేశ భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడబోమన్నారు. పుల్వామా ఘటనకు ప్రతీకారంగానే పీవోకే బాలాకోట్‌లోని ఉగ్రశిబిరాలపై భారత వాయుసేన మెరుపుదాడులు చేసిందని రాజ్‌నాథ్ చెప్పారు. దీనిపై నాడు బుకాయించిన పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేడు బహిరంగంగా ఒప్పుకున్నారని, బాలాకోట్ వంటి దాడులకు భారత్ సన్నద్ధమవుతుందన్న ఆయన వ్యాఖ్యలు దీనికి నిదర్శనమన్నారు. మనవద్ద రఫేల్ యుద్ధ విమానాలు ఉండి ఉంటే బాలాకోట్‌లోకి వెళ్లకుండానే మన గగనతలం నుంచే అక్కడి ఉగ్ర శిబిరాలను ధ్వంసంచేసి ఉండేవాళ్లమని అన్నారు. అణ్వాయుధాలను తొలుత వినియోగించబోమన్న భారత విధాన నిర్ణయం భవిష్యత్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని ఇటీవల పాక్‌ను రాజ్‌నాథ్ ఘాటుగా హెచ్చరించడం తెలిసిందే.


### 14-1తో పాక్‌కు చావుదెబ్బ!

#### భద్రతామండలిలో భారత్‌కు దౌత్యవిజయం

**వాషింగ్టన్:** జమ్ముకశ్మీర్‌పై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో గత శుక్రవారం జరిగిన రహస్య చర్చల్లో భారత్, పాకిస్థాన్‌కు ప్రవేశం లేకపోయినప్పటికీ దౌత్యపరంగా రెండు దేశాలు పరోక్షంగా పెద్ద పోరాటమే చేశాయి. భద్రతామండలిలోని 15 సభ్యదేశాల్లో ఒక్క చైనా మినహా, దాదాపు అన్ని దేశాలు భారత్‌కు అండగా నిలిచాయి. కశ్మీర్ అంశాన్ని భద్రతా మండలి దృష్టికి తీసుకెళ్లడమే గొప్ప విజయంగా పాక్ చెప్పుకుంటున్నది. అయితే అధికారిక సమావేశం నిర్వహించాలన్న పాకిస్థాన్, చైనా డిమాండ్‌కు ఒక్క సభ్య దేశమూ మద్దతునివ్వలేదని భారత్ స్పష్టం చేస్తున్నది. పైగా ఈ అంశంపై భేటీ అనంతరం ఒక్క చైనా తప్ప, మిగిలిన 14 దేశాల్లో ఒక్క దేశం కూడా మాట్లాడలేదని దౌత్య నిపుణులు గుర్తు చేస్తున్నారు. చైనా కూడా ద్వైపాక్షిక చర్చలు జరుపాలనే తన ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకిగా మిగిలిందని భద్రతామండలి ఎపిసోడ్‌తో తేటతెల్లమైంది. భద్రతామండలి సమావేశం అనంతరం అధికారిక ప్రకటన చేయాలని పాక్, చైనా డిమాండ్ చేసినప్పటికీ, పలు దేశాలు నిరాకరించాయి.

### శ్రీనగర్‌లో మళ్లీ ఆంక్షలు..

- జమ్ములోని ఐదు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలు మళ్లీ రద్దు
- హింసాత్మక ఘటనలు, సోషల్ మీడియాలో దుష్ప్రచారమే కారణం..



శ్రీనగర్‌లో భద్రతా బలగాల పహారా

**శ్రీనగర్/జమ్ము:** శ్రీనగర్‌లోని పలు ప్రాంతాల్లో అధికారులు ఆదివారం మళ్లీ ఆంక్షలు విధించారు. శనివారం జరిగిన హింసాత్మక ఘటనలు, హజ్ యాత్రికులు ఆదివారం శ్రీనగర్‌కు చేరుకున్న నేపథ్యంలో అధికారులు ఈ ఆంక్షలను విధించారు. శ్రీనగర్‌లోని డజనుకు పైగా ప్రాంతాల్లో నిరసనకారులు శనివారం ఆందోళనలు చేపట్టారని, ఈ ఘటనల్లో పలువురికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం శ్రీనగర్ విమానాశ్రయానికి 300 మందికిపైగా హజ్ యాత్రికులు చేరుకున్నారని, వాళ్ళను గమ్యస్థానాలకు చేరవేసే క్రమంలో కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలు విధించినట్టు తెలిపారు. కశ్మీర్ లోయలో ఆదివారం కూడా ఆంక్షలు కొనసాగాయని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, జమ్ములోని ఐదు జిల్లాల్లో 2జీ మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని అధికారులు నిలిపివేశారు. సోషల్‌మీడియాలో తప్పుడు సందేశాలు, వీడియోలతో దుష్ప్రచారం జరుగుతుందన్న సమాచారంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. తప్పుడు ప్రచారం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



సిమ్లాలో కొండచరియలు విరిగిపడటంతో రోడ్డుపై నుంచి కింద ఇండ్లపైకి జారిపడిన వాహనాలు

# ఉత్తరాది విలవిల



హిమాచల్‌లోని మండి జిల్లాలో బియాస్ నది వరద నీటిలో మునిగిన పంచవక్త్ర మహాదేవాలయం

కుండపోత వర్షాలతో పలు రాష్ట్రాలు అతలాకుతలం

- హిమాచల్‌లో 22 మంది మృతి
- ఉత్తరాఖండ్‌లో 8 మంది గల్లంతు
- పంజాబ్‌లో ముగ్గురు దుర్మరణం
- కేరళలో 121, కర్ణాటకలో 76కు చేరిన మృతుల సంఖ్య

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కుండపోత వర్షాలతో ఉత్తరాది రాష్ట్రాలు విలవిల్లాడుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌ల్లో 25 మంది ప్రాణాలు కోల్పోగా, ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టితో 8 మంది గల్లంతయ్యారు. యుమున, ఇతర నదులు పోటెత్తడంతో ఢిల్లీ, హర్యానా, పంజాబ్‌లకు వరద హెచ్చరికలు జారీచేశారు. హర్యానా ప్రభుత్వం సైన్యం సాయం కోరింది. మరోవైపు వరదలతో అతలాకుతలమైన కేరళలో మృతుల సంఖ్య 121కు పెరిగింది. భారీ కొండచరియలు విరిగిపడిన కవలప్పారా (మలప్పురం), పుతుమల (వయనాడ్)లో మృతదేహాలను గుర్తించేందుకు సహాయ సిబ్బంది గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్లను (జీపీఆర్) వినియోగిస్తున్నారు. హైదరాబాద్ నిపుణుల బృందం జీపీఆర్‌ల సాయంతో మృతదేహాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నది. కర్ణాటకలో వరద మృతుల సంఖ్య 76కు పెరిగింది. యమునానది ఉగ్రరూపం దాల్చడంతో ఢిల్లీ ప్రభుత్వం వరద హెచ్చరికలు జారీ చేసింది. లోతట్టు ప్రాంత ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. హర్యానాలోని హతినికుండ్ బ్యారేజీ నుంచి 8.28 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో యమునలో వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**హిమాచల్ అతలాకుతలం..**

భారీ వర్షాలతో హిమాచల్‌లో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 9 మంది గాయపడ్డారు. సిమ్లాలో 9 మంది, సోలన్‌లో ఐదుగురు, కులు, సిర్మౌర్, చంబాలో ఇద్దరు చొప్పున, ఉనా, లాహౌల్–స్పిటి జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. సిమ్లాలోని నార్ఖండ్ ప్రాంతంలో చెట్టువిరిగి ఇంటిపై పడడంతో ఇద్దరు నేపాలీలు ప్రాణాలు కోల్పోయారని, సట్లెజ్, బియాస్ నదుల్లో నీటిమట్టం భారీగా పెరుగడంతో పండోహ్, నత్పా ఝాక్రి డ్యామ్‌ల గేట్లను ఎత్తారు. భారీ వర్షాల నేపథ్యంలో సిమ్లా, కులు జిల్లాల్లో అన్ని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు.

**హర్యానా, పంజాబ్‌లలో భారీ వర్షాలు**

హర్యానా, పంజాబ్‌లలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో వరదలు రావడంతో అధికారులు రెడ్‌అలర్ట్ జారీ చేశారు. పంజాబ్‌లో ఇంటి పైకప్పు కూలడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. గురుదాస్‌పూర్ జిల్లాల్లో బియాస్ వరద నీటిలో చిక్కుకున్న 110 మంది సహాయ సిబ్బంది రక్షించారు. రాజస్థాన్‌లో పరిస్థితి క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నది. రాష్ట్రంలో జూన్ 15 నుంచి ఇప్పటివరకు 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజులుగా భారీ వర్షాలతో అతలాకుతలమైన దక్షిణ బెంగాల్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. పశ్చిమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనావేసింది. బంకురా, పురులియా, వెస్ట్ మిడ్నాపోర్, ఝార్‌గ్రామ్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిసింది. దక్షిణ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు నమోదుకావొచ్చని వివరించింది. కాగా, ఒడిశాలో వచ్చే రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.



ఉత్తరాఖండ్‌లో మట్టిపెళ్లల కింద పడిన వ్యక్తిని వెలికితీసి దవాఖానకు తరలిస్తున్న సిబ్బంది

### 8 మంది గల్లంతు

ఉత్తరాఖండ్‌లో కురిసిన భారీ వర్షాలకు 8 మంది గల్లంతయ్యారు. పలువురు గాయపడ్డారు. ఉత్తరకాశీ జిల్లాలో కుంభవృష్టి కురిసింది. అరాకోట్, మకురి, టికోచి గ్రామాల్లో పలు ఇండ్లు ధ్వంసమయ్యాయి. డెహ్రాడూన్‌లో కారు నదిలో పడిపోయి, ఒక మహిళ ప్రాణాలు కోల్పోయారు. వచ్చే 3 రోజులూ ఉత్తరకాశీతోపాటు చమోలీ, పితోర్‌గఢ్, డెహ్రాడూన్, నైనితాల్, పౌరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని 'ఐఎండీ' తెలిపింది. కొండచరియలు విరిగిపడడంతో పలు చోట్ల చార్‌ధామ్ యాత్రమార్గాలు స్తంభించాయని అధికారులు తెలిపారు. దీంతో యాత్రపై పాక్షిక ప్రభావం పడిందని, యాత్రికులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో 2013లో సంభవించిన భారీ వరదలతో వందల మంది మరణించగా, భారీ స్థాయిలో ఆస్తినష్టం సంభవించిన విషయం తెలిసిందే.

## మంటగలిసిన మానవత్వం

- ఓ విద్యార్థినిని రోడ్డుపై పడుకోబెట్టి తలపై నుంచి బైక్ నడిపిన దుండగులు
- పుర్రె తీవ్రంగా దెబ్బతినడంతో చికిత్సపొందుతూ మృతి
- యూపీలో ఘటన

**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణం జరిగింది. 11వ తరగతి విద్యార్థిని పాఠశాల నుంచి ఇంటికొస్తుండగా కొందరు వ్యక్తులు ఆమెను చిత్రహింసలకు గురిచేశారు. రోడ్డుపై పడుకోబెట్టి బైక్‌ను తలపై నుంచి వేగంగా తీసుకెళ్లడంతో గాయపడిన ఆ బాలిక ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ విషాద ఘటన ఇటీవల సుల్తాన్‌పూర్ జిల్లా పరిధిలో జరిగింది. విద్యార్థిని ఈ నెల 8న సైకిల్‌పై పాఠశాల నుంచి ఇంటికొస్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. దీంతో ఆ బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడికి చేసుకునే సరికి ఆ ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. ఓ చోట దాక్కొని బాలికను గమనించిన దుండగులు మళ్లీ అడ్డుకున్నారు. ఆమె తలమీదుగా అతివేగంగా బైక్‌ను నడిపారు. దీంతో ఆ బాలిక పుర్రె బలంగా దెబ్బతిన్నది. అటుగా వెళ్తున్న వాళ్లు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 14న మరణించింది. మరోవైపు ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులు.. ఆమె తాత ఫిర్యాదును స్వీకరించేందుకు నిరాకరించారు. పోలీసు కేసు లేనందున చికిత్సను అందించలేమని ప్రభుత్వ దవాఖాన డాక్టర్లు చేతులెత్తేశారు. తర్వాత ఓ ప్రైవేట్ దవాఖానలో బాలిక చికిత్స పొందుతూ మరణించింది.

## బావిలో వ్యాను పడి ఎనిమిది మంది మృతి

### తమిళనాడులో దుర్ఘటన

**తిరుచిరాపల్లి:** ఓ మినీ వ్యాను నీళ్లులేని బావిలో పడటంతో ఎనిమిది మంది మరణించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఈ దుర్ఘటన ఆదివారం తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. ఓ పండుగను జరుపుకోవడానికి 22 మంది ఓ మినీ వ్యానులో బయలుదేరారు. ఈ వ్యాను పుత్తూర్ వద్దకు చేసుకునే సరికి డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి 70 అడుగుల లోతైన ఎండిపోయిన బావిలో పడిపోయింది. దీంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన 14 మందిని దవాఖానకు తరలించారు.



బావిలో పడిన వ్యానును వెలికితీస్తున్న పోలీసులు

## గర్భిణిని తన్నిన పోలీస్ సస్పెన్షన్

### ఒడిశా సుందర్‌గఢ్‌లో ఘటన

**భువనేశ్వర్:** ఓ గర్భిణి కడుపుపై తన్ని ఆమె గర్భస్రావానికి కారణమైన మహిళా పోలీస్ అధికారి సస్పెండయ్యారు. ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా కానికా గ్రామంలో గతనెల మూడోతేదీన రోడ్డు ప్రమాదంలో యువకుడు (19) మరణించడంతో ఆగ్రహించిన స్థానికులు పోలీస్ ఔట్‌పోస్టుపై దాడి చేశారు. దాడి చేసిన 14 మందిలో ఉత్తమ్‌డే అనే వ్యక్తి ఉన్నట్లు గుర్తించారు. సుందర్‌గఢ్ ఎస్పీ మిశ్రా అతడి ఇంటికెళ్లారు. ఉత్తమ్ లేనందున భార్య ప్రియాడేను ఎస్పీ కొట్టా రు. ఎస్పీ కొట్టడంతో తనకు గర్భస్రావమైం దని ప్రియాడే కోర్టునాశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఎస్పీ మిశ్రా తదితరులపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది.

## కరెంటు షాక్‌కు ఐదుగురు విద్యార్థులు బలి

### కర్ణాటకలో విషాదం

**బెంగళూరు:** కర్ణాటకలోని జిల్లా కేంద్రం కొప్పల్‌లోని విద్యార్థుల హాస్టల్‌లో విద్యుత్ షాక్‌తో ఐదుగురు విద్యార్థులు ఆదివారం మరణించారు. ఈ నెల 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసేందుకు హాస్టల్‌పై ఇనుప పైపు అమర్చారు. ఆదివారం ఉదయం దాన్ని విద్యార్థులు తొలగిస్తుండగా విద్యుత్ తీగలకు తాకింది. విద్యుత్ సరఫరా కావడంతో ఇద్దరు విద్యార్థులకు షాక్ తగిలింది. మిగతా విద్యార్థులు వారిని రక్షించబోయిఅక్కడికక్కడే మరణించారు. భవనం యజమాని, హాస్టల్ వార్డెన్, స్థానిక విద్యుత్ సరఫరా సంస్థపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు. మరోవైపు, దుర్ఘటనపై సీఎం యెడియూరప్ప విచారణకు ఆదేశిస్తూ, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు.

## మానసిక దవాఖానలో రోగి దాడి

### రొమేనియాలో నలుగురు మృతి

**బుకారెస్ట్:** రొమేనియాలోని ఓ మానసిక దవాఖానలో జరిగిన దాడి ఘటనలో నలుగురు రోగులు మృతిచెందగా, తొమ్మిది మందికి గాయాలయ్యాయి. నిందితుడు ఆ దవాఖానలో మరో రోగి. సపోకా ప్రాంతంలో ఉన్న ఓ మానసిక దవాఖానలోని చికిత్స గదిలోకి వెళ్లిన నిందితుడు సహచర రోగులపై సెలైన్ ఎక్కించే స్టాండ్‌తో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు రోగులు అక్కడికక్కడే మరణించగా, మరొకరు చికిత్స పొందుతూ మృతిచెందారు.

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No. 9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE


# తండ్రి భూమిని కాజేసిన పెద్దకొడుకు

- సహకరించిన ఖమ్మం జిల్లా వేంసూరు రెవెన్యూ అధికారులు
- తమ్ముళ్లకు కాకుండా మొత్తం భూమి పట్టాచేసుకొన్న అన్న
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితుడు అడ్డగట్ల రాములు


బాధితుడు అడ్డగట్ల రాములు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తండ్రి భూమికే ఎసరు పెట్టాడు పెద్దకొడుకు. తప్పుడు పత్రాలు సృష్టించి భూమి తన పేరిట మార్చుకున్నాడు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకరించారు. తండ్రి పేరిట ఉన్న భూమి అతని కుమారులందరికీ చెందాల్సి ఉండగా, పెద్దకొడుకే తప్పుడు పత్రాలు సృష్టించి మొత్తం రాయించేసుకున్నాడు. అధికారులు సైతం రికార్డులను కనీసం పరిశీలించకుండా పట్టాచేసేశారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండల కేంద్రానికి చెందిన అడ్డగట్ల రాములు 1973లో మహ్మద్ శిలార్ మహ్మద్ కుమారుడు మహ్మద్ యాకూబ్ అలీ వద్ద సర్వే నంబర్ 1825/ఇలో 1.20 ఎకరాల భూమి కొన్నారు. అప్పటినుంచి నేటికీ అడ్డగట్ల రాములు ఆ భూమిని సాగుచేసుకొంటున్నారు. రాములుకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సత్యనారాయణ తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని తన పేరిట పట్టాచేసుకొన్నాడు. అడ్డగట్ల రాములు.. 1973లో మహ్మద్ యాకూబ్ అలీ వద్ద కొనుగోలు చేయగా, సత్యనారాయణ మాత్రం యాకుబ్ అలీ (తండ్రి మహ్మద్ హుస్సేన్) వద్ద కొనుగోలు చేసినట్టు తప్పుడు పత్రాలు సృష్టించారు. వాస్తవంగా భూమి పట్టాదారు మహ్మద్ యాకూబ్ తండ్రి పేరు.. మహ్మద్ శిలార్ మహ్మద్. యాకూబ్ అలీ 1998 అక్టోబర్‌లో చనిపోయారు. కానీ సత్యనారాయణ 2011 జూన్‌లో యాకుబ్ అలీ వద్ద భూమి కొన్నట్టు పత్రాలు సృష్టించారు. భూమిని సత్యనారాయణ పేరిట మార్చే సమయంలో రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించాల్సి ఉండగా, ఇవేవి పట్టనట్టుగా వ్యవహరించారు. దీంతో అసలు పట్టాదారు లబోదిబో మంటున్నారు. భూమిని ఎవ్వరికి రాసివ్వలేదని, కానీ తన పేరిట ఉన్న భూమిని.. కొడుకు తప్పుడు పత్రాలు సృష్టించి పట్టాచేసుకొన్నాడని వాపోయారు. దీనిపై రెవెన్యూ అధికారులకు కూడా ఫిర్యాదుచేశానని, ప్రస్తుతం తినడానికి తిండి కూడా లేదని ఆవేదన చెందారు. వయోవృద్ధుడినని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయంచేసేలా చూడాలని బాధితుడు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

## రికార్డులను రద్దుచేస్తాం

అడ్డగట్ల రాములు కుమారుడు సత్యనారాయణ కొన్నేండ్లుగా అనుభవదారుడిగా ఉన్నారు. రాములు తనకు భూమి రాసిచ్చిన పత్రాలను సత్యనారాయణ చూపించారు. దీంతో ఆయన పేరిట రికార్డుల్లో మార్చాం. ఒకవేళ తప్పుడు పత్రాలు సృష్టిస్తే ఆ రికార్డులను రద్దుచేస్తాం.

- వెంకటేశ్వర్‌రావు, వీఆర్వో

## పరిహారం ఇయ్యరు..
# పాస్‌బుక్ అందదు

- కాళేశ్వరం ప్రాజెక్టు కోసం భూమి తీసుకొని పరేషాన్ చేస్తున్నరు
- భూమి దున్నుకోండని చెప్పిన ప్రాజెక్టు అధికారులు
- నష్టపరిహారం ఇచ్చామని దాటవేస్తున్న రెవెన్యూ సిబ్బంది
- సాగుచేసుకొంటున్నా పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వకుండా సతాయింపు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన సిద్దిపేట మండలవాసి సుధాకర్‌రెడ్డి


పాత పాస్‌పుస్తకం చూపుతున్న బాధితుడు సుధాకర్‌రెడ్డి


1967లో సుధాకర్‌రెడ్డికి భూమి కేటాయిస్తూ ఇచ్చిన పత్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లా సిద్దిపేట మండలంలోని ఎన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన పబ్బతి సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం 1967లో సర్వే నంబర్ 730/8లో లావుణీ పట్టా కింద ఐదెకరాల భూమిని కేటాయించింది. అప్పటి రెవెన్యూ అధికారులు సుధాకర్‌రెడ్డి పేరిట పాస్‌పుస్తకం కూడా మంజూరుచేశారు. పహాణీలో, ఆర్వోఆర్‌లోనూ అతని పేరిట భూరికార్డులు నమోదుచేశారు. అప్పటి నుంచి సుధాకర్‌రెడ్డి ఆ భూమిని సాగుచేసుకొంటున్నారు. అయితే కొన్నేండ్ల కింద ఇక్కడ ఈ ఐదెకరాలతోపాటు మరికొంత భూమిని ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సేకరించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా టన్నెల్ నిర్మిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పరిహారాన్ని కూడా ప్రభుత్వం మంజూరుచేసింది. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం బాధిత రైతుకు పరిహారం ఇవ్వలేదు. ఈ విషయమై బాధిత రైతు రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తే.. ఎంజాయ్‌మెంట్ సర్వేచేసి కాస్తులో ఉన్నవారికి పరిహారం ఎప్పుడో ఇచ్చామని చెప్పారు. సుధాకర్‌రెడ్డితోపాటు మరికొంత మందికి మినహా ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చినవారందరికీ పరిహారం అందజేశారు. పరిహారం కోసం బాధితుడు సుధాకర్‌రెడ్డి రెవెన్యూ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో చేసేదేమీ లేక.. ప్రాజెక్టు అధికారులకు ఫిర్యాదుచేశారు. వారు 'మీ భూమిని ప్రాజెక్టు కోసం తీసుకొన్నది వాస్తవమే. కానీ దానిని ప్రాజెక్టు కోసం వాడుకోలేదు. ప్రాజెక్టు కోసం తీసుకొన్న భూమిలో ఇంకా 16 ఎకరాలు ఖాళీగానే ఉన్నది. దానిని మీరు తిరిగి స్వాధీనంచేసుకొని సాగుచేసుకోండి' అని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆర్డర్‌ను తాసిల్దార్‌కు పంపించామని తెలిపారు. ఇదే విషయాన్ని బాధితుడు తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లగా.. ప్రాజెక్టు అధికారుల నుంచి తమకు ఎలాంటి ఆర్డర్ అందలేదని దాటవేస్తున్నారు. అలాగని నష్టపరిహారం కూడా ఇవ్వలేదని సుధాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రాజెక్టు అధికారుల సూచన మేరకు భూమిని సాగుచేసుకొంటున్నా.. రెవెన్యూ అధికారులు కొత్త పాస్‌పుస్తకం మంజూరు చేయకపోవడంతో ఇప్పటికే రెండు విడుతల రైతుబంధు సాయం కోల్పోయానని బాధితుడు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## ఎలాంటి ఆర్డర్ రాలేదు

కాళేశ్వరం ప్రాజెక్టు కింద పోయింది మొత్తం వంద ఎకరాలు. ఆ భూమిని రికార్డులో కూడా కొట్టేశారు. పరిహారం అందనివారికి, ఉపయోగించని భూమిని బాధితులకు తిరిగివ్వాలని.. ప్రాజెక్టు అధికారుల నుంచి మాకేమీ ఆర్డర్లు రాలేదు. ప్రాజెక్టు కార్యాలయం నుంచి రాతపూర్వకమైన ఆర్డర్ వస్తే సమస్యను పరిష్కరిస్తాం. ఇటీవల తాసిల్దార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో సర్వేచేశాం. నేను వచ్చి ఐదు నెలలే అవుతున్నది. అంతకుముందే ఆ భూమిని రికార్డుల్లో కొట్టేశారు. వారికి పాస్‌బుక్ రాకుండా మేం ఆపిందేమీ లేదు.

- బాలనర్సయ్య, వీఆర్వో

## ప్రాజెక్టు కోసం భూమి తీసుకోకుంటే పాస్‌బుక్ ఇస్తాం

సుధాకర్‌రెడ్డి ఫిర్యాదుచేస్తున్న భూమికి పరిహారం చెల్లించాం. కానీ కాస్తులో ఇతరులు ఉన్నారట. ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం అప్పుడు కాస్తులో ఉన్నవారికి పరిహారం ఇచ్చారు. ఎంజాయ్‌మెంట్ సర్వే రికార్డులు తెప్పించుకొని, పరిహారం ఇచ్చే సమయంలో కాస్తులో ఎవరున్నారో పరిశీలిస్తాం. అప్పుడు సుధాకర్‌రెడ్డే కాస్తులో ఉంటే పరిహారం ఇప్పిస్తాం. సుధాకర్‌రెడ్డికి సంబంధించిన ఎంత భూమికి పరిహారం వచ్చిందో తెలియదు. రికార్డులు పరిశీలించిన తర్వాతే వారికి ఏమైనా చేయగలుతాం. ఆ భూమి వాస్తవానికి సుధాకర్‌రెడ్డిదే అయితే, ఆ భూమి ప్రాజెక్టు కింద పోకపోతే పాస్‌పుస్తకం మంజూరుచేస్తాం. ప్రాజెక్టు అధికారుల నుంచి పరిహారం చెల్లింపులకు సంబంధించిన రికార్డులు ఇంకా మా వద్దకు రాలేదు.

- విజయ్‌సాగర్, సిద్దిపేట తాసిల్దార్

# మా మాట!


## రైతుల సమస్యలు తీరుతున్నాయి



'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట'తో రాష్ట్రవ్యాప్తంగా పేద రైతుల భూసమస్యలు తీరుతున్నాయి. పత్రికలో ప్రచురితమవుతున్న కథనాలపై సంబంధితశాఖ ఉన్నతాధికారులు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారు. దీంతో పేద రైతులకు న్యాయం జరుగుతున్నది.

- మొండికత్తి లింగయ్య, దురాజ్‌పల్లి, చివ్వెంల మండలం, సూర్యాపేట జిల్లా

## రెవెన్యూశాఖ ప్రక్షాళన అవసరం




దశాబ్దాలుగా అవినీతిలో కూరుకుపోయిన రెవెన్యూశాఖను ప్రక్షాళన చేయాల్సిందే. ఈ విషయంలో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సరైనదే. కొన్ని నెలలుగా రైతుల భూసమస్యల పరిష్కారానికి 'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట' చాలావరకు మేలు చేస్తున్నది. స్వయంగా తాసిల్దార్ బాధిత రైతులకు సమాచారం అందించి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

- తొనుకునూరి అశోక్‌గౌడ్, గోరెంట్ల, మద్దిరాల మండలం, సూర్యాపేట జిల్లా


# రికార్డులో తగ్గిన 13 గుంటలు

- సరిచేయాలని అధికారుల చుట్టూ రైతు ప్రదక్షిణ
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన కరీంనగర్ జిల్లావాసి దాసి శేఖర్



**కమలాపూర్:** కాస్తులో ఎకరం ఉండగా, కొత్త పాస్‌పుస్తకంలో మాత్రం 27 గుంటలే నమోదు కావడంతో రైతు ఆందోళన చెందుతున్నారు. రికార్డులో తప్పును సరిచేయాలని బాధిత రైతు ఏడాదిగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించడం లేదు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన దాసి మల్లయ్య.. వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ శివారులో సర్వే నంబర్ 770లో 3.10 ఎకరాల భూమి ఉండేది. కుటుంబ అవసరాల కోసం కొంత భూమి విక్రయించగా, 1.20 ఎకరాలు మిగిలింది. మల్లయ్య తన ముగ్గురు కొడుకులకు 20 గుంటల చొప్పున పంచారు. చిన్న కొడుకు తన వాటాను పెద్ద కొడుకు దాసి శేఖర్‌కు విక్రయించారు. అప్పటి నుంచి శేఖర్ తన వాటాతోపాటు తమ్ముడి వద్ద కొన్న భూమి కలిపి ఎకరంలో సాగుచేసుకొంటున్నారు. కొన్నేండ్లకు శేఖర్ ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. భూరికార్డుల ప్రక్షాళనలో కొత్త పాస్‌పుస్తకంలో ఎకరం భూమికి బదులుగా 27 గుంటలు మాత్రమే నమోదైంది. మిగతా 13 గుంటలు మాయమవడంతో బాధితుడు రెవెన్యూ అధికారులను కలిశారు. తాసిల్దార్, వీఆర్వో సూచన మేరకు ఎంజాయ్‌మెంట్ సర్వే కోసం ఈ ఏడాది మే నెలలో దరఖాస్తు చేసుకొన్నారు. పరిశీలించిన సర్వేయర్ సర్వే నంబర్ 770కి సంబంధించి టిప్పన్ లేదని, సర్వే కోసం ఏడీకి దరఖాస్తు చేసుకోవాలని చెప్పగా, గత నెలలో మీసేవలో రూ.300 చెల్లించారు. ఏడీని కలిసేందుకు హన్మకొండలోని ఆర్డీవో కార్యాలయానికి నెల రోజులుగా తిరుగుతున్నా కలువడంలేదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై తాసిల్దార్ రాఘవేంద్రరావును వివరణ కోరగా.. రైతు తన వద్ద ఉన్న ఆధారాలను తీసుకొని కార్యాలయానికి వస్తే పరిశీలించి, పాస్‌బుక్‌ను సరిచేస్తామని చెప్పారు.

## ఇంటికే వస్తున్నారు



'ధర్మగంట'లో కథనం ప్రచురితమైతే అధికారులు బాధితుడి ఇంటికే వచ్చి సమస్యను తెలుసుకొంటున్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తున్నారు. 'నమస్తే తెలంగాణ' రైతులకు ఎంతో మేలు చేస్తున్నది. భూసమస్యలు అధికారులకు చెప్పుకున్నా ఫలితం ఉండేది కాదు. కానీ పత్రికలో కథనం రాగానే అధికారులు వెంటనే స్పందిస్తున్నారు.

- రామయ్య, లక్ష్మీపురం, మిర్యాలగూడ మండలం, నల్లగొండ జిల్లా

## చట్టాలపై సరైన అవగాహనలేకే..
# ప్రజలు హక్కులు కోల్పోతున్నారు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్


మహారాష్ట్ర జాతీయ లా వర్సిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గొగొయ్

**నాగ్‌పూర్:** చట్టాలపై సరైన అవగాహనలేకనే ప్రజలు తమ హక్కులను కోల్పోతున్నారని.. దీంతో మోసాలు, దోపిడీకి గురవుతున్నారని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్ తెలిపారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో జరుగుతున్న రాష్ట్ర న్యాయసేవల సంస్థ 17వ అఖిల భారత సదస్సులో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడమన్నది సమాజ, ఆర్థిక అభివృద్ధికి శక్తిమంతమైన సాధనమని అన్నారు. అందరికీ సమ న్యాయం, సంక్షేమ ఫలాలు సక్రమంగా అమలు, సామాజిక వివక్ష లేకుండా చూడటం వంటి అంశాలపై న్యాయసేవల సంస్థ దృష్టిసారించాలని సూచించారు. చట్టాలపై అవగాహనతోపాటు సాంకేతిక వినియోగం.. నాణ్యమైన న్యాయ సేవలను ప్రభావితం చేయడంతోపాటు జవాబుదారీతనాన్ని పెంచుతాయని జస్టిస్ గొగొయ్ చెప్పారు. రాజ్యాంగం కల్పించిన అందరికీ సమ న్యాయం అమలుకు జాతీయ న్యాయ సేవల సంస్థ, రాష్ట్ర న్యాయ సేవల సంస్థ పాత్ర ఎంతో కీలకమన్నారు. దేశంలోని మూరుమూల ప్రాంతాలు, ప్రజలకు న్యాయ సేవల సంస్థ చేరువకావాలని ఆయన పిలుపునిచ్చారు. నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర జాతీయ న్యాయ వర్సిటీ శాశ్వత ప్రాంగణం నిర్మాణ పనులకు జస్టిస్ రంజన్ గొగోయ్ శంకుస్థాపన చేశారు.

## ములాయం చేతికి
# 'ఎస్పీ' పగ్గాలు?


- బీజేపీలోకి ఎస్పీ నేతల వలసలపై ఆందోళన
- అఖిలేశ్‌కు పార్టీ నడిపే రాజకీయ చతురత లేదని భావిస్తున్న నేతాజీ
- ములాయం, శివపాల్ విధేయుల ఉద్వాసనే ధ్యేయంగా అఖిలేశ్ చర్యలు



**లక్నో, ఆగస్టు 18:** సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సారథ్య బాధ్యతలను ఆ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ చేపట్టనున్నారా? బీజేపీలోకి ఎస్పీ సీనియర్ నేతల వలసలపై ములాయం ఆందోళన చెందుతున్నారా? పార్టీ నేతలందరినీ కలుపుకుని పోగల రాజకీయ చతురత తనయుడు అఖిలేశ్ యాదవ్‌కు లేదని భావిస్తున్నారా? అంటే పార్టీలో జరుగుతున్న పరిణామాలు అవుననే చెబుతున్నాయి. మూడేండ్ల క్రితం కొడుకుకు వదిలేసిన పార్టీ సారథ్య బాధ్యతలను తిరిగి చేపట్టాలని ములాయం భావిస్తున్నారని తెలుస్తున్నది. ఈ విషయమై పార్టీ ప్రధాన కార్యదర్శి, సోదరుడు రాంగోపాల్ యాదవ్‌ను ములాయం.. లక్నోలోని పార్టీ కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడినట్లు వార్తలొచ్చాయి. పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌తో మాట్లాడటంతోపాటు అధినేత మార్పు కోసం జాతీయ కార్యవర్గ సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలియవచ్చింది. అయితే, తండ్రి ఆకాంక్షపై అఖిలేశ్ సానుకూలంగా స్పందించలేదని వినికిడి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బహుజన్ పార్టీ (బీఎస్పీ)తో పొత్తు పెట్టుకోవడం వల్ల రాష్ట్రంలో ఎస్పీ పునాదులు శరవేగంగా కదులుతున్నాయని, బీజేపీలోకి పార్టీ రాజ్యసభ సభ్యుల వలసలు పెరిగిపోయాయని ములాయం ఆందోళన చెందుతున్నారని ఆయన సన్నిహిత వర్గాల కథనం. ఎస్పీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ.. 'పార్టీ వ్యవహారాలు నడిపే రాజకీయ చతురత అఖిలేశ్‌కు లేదని నేతాజీ (ములాయం) ఒప్పుకున్నారు. పార్టీని కాపాడుకునేందుకు సారథ్య బాధ్యతలు చేపట్టాలని భావిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు నీరజ్ శేఖర్ రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో ములాయం ఆందోళనకు గురయ్యారు' అని చెప్పారు. మరో ఎస్పీ నేత మాట్లాడుతూ 'పార్టీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి అఖిలేశ్ తన తండ్రి ములాయం, బాబాయి శివపాల్ యాదవ్ విధేయులను తప్పిస్తూ ముందుకు వెళ్లారు' అని చెప్పారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సంజయ్ సింగ్, ఎస్పీ మాజీ ఎంపీలు సంజయ్ సేథ్, సురేంద్రసింగ్‌లు ఆదివారం బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు.

# బుజ్జగింపు రాజకీయాల వల్లే


- పాపిష్టి ట్రిపుల్ తలాక్ ఇంతకాలం కొనసాగింది
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** పాపిష్టి పద్ధతి ట్రిపుల్ తలాక్ సుదీర్ఘ కాలం దేశంలో కొనసాగడానికి బుజ్జగింపు రాజకీయాలే కారణమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలో శ్యామప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్‌ను నేరపూరితం చేస్తూ చట్టం రూపొందించడాన్ని సమర్థించుకున్నారు. ఇది లింగ సమానత్వాన్ని తీసుకొస్తుందన్నారు. భారత ప్రజాస్వామ్యానికి బుజ్జగింపు రాజకీయాలతోపాటు కుల, వారసత్వ రాజకీయాలు ముప్పుగా పరిణమించాయని అమిత్‌షా చెప్పారు. అన్ని రంగాల్లో ప్రగతి సాధన ద్వారా మోదీ సర్కార్ ఈ మూడు సమస్యలకు చరమగీతం పాడుతుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. కోట్ల మంది ముస్లిం మహిళలకు పీడకలగా మారిన ట్రిపుల్ తలాక్ పద్ధతిని నేరంగా చేయడం వల్ల కేవలం ముస్లింలే లబ్ధి పొందుతారని చెప్పారు. 92.1 శాతం మంది ముస్లిం మహిళలు ట్రిపుల్ తలాక్‌ను నేరమయం చేయడానికి మద్దతునిస్తున్నారన్నారు. కొన్ని దశాబ్దాలుగా బుజ్జగింపు రాజకీయాలకు కేంద్రమైన కాంగ్రెస్ పార్టీ వల్లే ఇప్పటివరకు పాపిష్టి ట్రిపుల్ తలాక్ సంప్రదాయం కొనసాగిందని, అయినా నిస్సిగ్గుగా ఆ పార్టీ ట్రిపుల్ తలాక్ చట్టాన్ని వ్యతిరేకించిందని ధ్వజమెత్తారు. షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును తారుమారుచేసేందుకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసిందని, అది దేశ చరిత్రలో ఒక 'చీకటి రోజు' కాగలదన్నారు. దేశంలో అభివృద్ధి లక్ష్యాల సాధనకు, సామాజిక ఐకమత్యానికి బుజ్జగింపు రాజకీయాలు అవరోధంగా మారాయని తెలిపారు. ట్రిపుల్ తలాక్ ఇస్లామిక్ సంప్రదాయం అయితే పలు ముస్లిం దేశాల్లో ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. 1922-63 మధ్య 19 దేశాలు ట్రిపుల్ తలాక్ విధానాన్ని ఎత్తేశాయన్నారు.

# ఈ-సిగరెట్, నికోటిన్‌లపై నిషేధం!

ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశంపై కేంద్రం పరిశీలన



**న్యూఢిల్లీ:** దేశంలో చాప కింద నీరులా విస్తరిస్తున్న ఈ-సిగరెట్, నికోటిన్, హుక్కా తదితర ఎలక్ట్రానిక్ నికోటిన్ ఉత్పత్తుల(ఈఎన్‌డీఎస్) తయారీ, అమ్మకాలు, దిగుమతులపై నిషేధం విధించేందుకు కేంద్రం పలు మార్గాల్ని పరిశీలిస్తున్నది. ఓ ఆర్డినెన్స్‌ను తెచ్చే యోచనలోనూ ఉన్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఆర్డినెన్స్ తెచ్చాక చట్టపరమైన అంశాలను పరిగణలోకి తీసుకొని, వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఈ-సిగరెట్లు, ఈ-హుక్కాలతో పాటు విరివిగా దొరుకుతున్న వేప్ వంటి ఉత్పత్తులను నిషేధించాలన్న అంశం బీజేపీ ఎజెండాలో ప్రత్యేకంగా పొందుపరిచారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా ఈ నిషేధాన్ని అమలు చేయాలని బీజేపీ నిర్ణయించింది. ఈఎన్‌డీఎస్ ఉత్పత్తులు మాదక ద్రవ్యాలు కాదని, వాటిని నిషేధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఈ ఏడాది మార్చిలో తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.

# అధికారిక భవనాలు ఖాళీచేయని మాజీ ఎంపీలు

గెస్ట్‌హౌస్‌ల్లోనే నూతన ఎంపీల బస

**న్యూఢిల్లీ:** తమకు కేటాయించిన ప్రభుత్వ బంగళాలను ఖాళీచేసేందుకు మాజీ ఎంపీలు మొండికేస్తున్నారు. దీంతో 260 మందికి పైగా నూతన ఎంపీలు ప్రభుత్వ అతిథిగృహాల్లోనే బసచేయాల్సి వస్తున్నది. 16వ లోక్‌సభ రద్దై రెండునెలలైనా 200మందికి పైగా మాజీ ఎంపీలు ఢిల్లీలోని లూట్యెన్స్‌లో తమకు కేటాయించిన అధికారిక ప్రభుత్వభవనాలను ఖాళీ చేయలేదు. నిబంధనల ప్రకారం లోక్‌సభ రద్దైన నెలరోజుల తర్వాత మాజీ ఎంపీలు ప్రభుత్వ బంగళాలు ఖాళీ చేయాలి. మోదీ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక మే 25న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 16వ లోక్‌సభను రద్దుచేశారు. మాజీ ఎంపీలు ప్రభుత్వ భవనాలను ఖాళీ చేయకపోవడంతో కొత్త ఎంపీలు వెస్టర్న్‌కోర్టు, అతిథిగృహాల్లో తాత్కాలికంగా బస చేస్తున్నారు. గతం లో కొత్తగా ఎన్నికైన ఎంపీలకు అధికారిక భవనాలు కేటాయించే వరకు వారు ప్రభుత్వఖర్చుతో ఫైవ్ స్టార్ హోటళ్లలో బసచేసేవారు. కానీ ప్రస్తుతం ఖర్చు తగ్గించేందుకు వారికి ప్రభుత్వ అతిథి గృహాలు కేటాయించారు.

# కాంగ్రెస్ హయాంలో పూర్తి నిర్లక్ష్యం

- బుజ్జగింపు విధానాలతో లడఖ్‌కు భారీ నష్టం
- బీజేపీ లడఖ్ ఎంపీ నామ్‌గ్యాల్



**లేహ్:** కేంద్రంలో 55 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని లడఖ్ బీజేపీ ఎంపీ జామ్యాంగ్ ట్సెరింగ్ నామ్‌గ్యాల్ ఆరోపించారు. లడఖ్ ప్రాంతంలో రక్షణ విధానానికి గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వనందువల్లే 'డెమ్ చౌక్ సెక్టార్'ను చైనా ఆక్రమించుకోగలిగిందన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో కశ్మీర్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించిన బుజ్జగింపు విధానాలు వ్యర్థమయ్యాయని, లడఖ్ దాయాదుల చేతిలో నష్టపోయిందన్నారు. 370వ అధికరణం రద్దు తర్వాత కేంద్రంపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన విమర్శలను కొట్టిపారేశారు. ఆయన తన 'సీటును కాపాడుకునేందుకు' ఏమైనా మాట్లాడతారంటూ ఎద్దేవా చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల వల్లే 'అక్సాయ్‌చిన్ చైనా నియంత్రణలోకి వెళ్లిందన్నారు. లడఖ్ భూములపై స్థానికులు ఆందోళన చెందొద్దన్నారు.

# మందిర్‌కు బంగారు ఇటుక ఇస్తా

- బాబ్రీ స్థలాన్ని ఇస్తే రామమందిరానికి మొదటి ఇటుక నాదే
- మొఘల్ వంశస్థుడు హబీబుద్దీన్ టసీ పునరుద్ఘాటన



**హైదరాబాద్:** బాబ్రీ మసీదు-రామజన్మభూమి స్థలాన్ని తనకు ఇస్తే అయోధ్యలో రామాలయాన్ని నిర్మించేందుకు మొదటి ఇటుకను తానే ఇస్తానని, అది కూడా బంగారు ఇటుకను ఇస్తానని గతంలో చేసిన ప్రతిపాదనను హైదరాబాద్‌లో నివసిస్తున్న మొఘల్ వంశస్థుడు హబీబుద్దీన్ టసీ (50) పునరుద్ఘాటించారు. అలాగే ఆ మొత్తం స్థలాన్ని ఆలయ నిర్మాణం కోసం అప్పగిస్తానని టసీ శనివారం ఓ ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మొఘల్ చక్రవర్తుల్లో చివరివాడైన బహదూర్‌షా జఫర్‌కు ఆరో తరం వారసుడైన టసీ గతేడాది సెప్టెంబర్‌లోనే ఈ ప్రతిపాదన చేశారు. బాబ్రీ మసీదు వివాదంలో తనను కూడా కక్షిదారుగా చేర్చాలని కోరుతూ ఫిబ్రవరి 8న ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను కోర్టు ఇంకా అంగీకరించలేదు.

## రిజర్వేషన్లపై సంప్రదింపులు అవసరం

ఆరెస్సెస్ అధినేత మోహన్‌భగవత్

**న్యూఢిల్లీ:** రిజర్వేషన్ల అనుకూలురు, వ్యతిరేకుల మధ్య సామరస్య పూర్వక వాతావరణం నెలకొల్పేందుకు సంప్రదింపులు అవసరం అని ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ పేర్కొన్నారు. ఢిల్లీలోని ఇగ్నోలో నిర్వహించిన 'జ్ఞాన్ ఉత్సవ్' కార్యక్రమంలో భగవత్ మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై గతంలో తాను మాట్లాడినప్పుడు పలు విమర్శలు వచ్చాయని గుర్తుచేశారు. అసలు విషయం పక్కదోవ పట్టిందన్నారు. అయితే ఆరెస్సెస్, బీజేపీ, బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వం వేర్వేరని, బాధ్యతలు కూడా విభిన్నమని అన్నారు.

## ఫోన్ల ట్యాంపరింగ్‌పై సీబీఐ విచారణ: కర్ణాటక సీఎం

**బెంగళూరు:** గత జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రముఖుల ఫోన్లు ట్యాంపరింగ్‌కు గురయ్యాయన్న ఆరోపణలపై సోమవారం సీబీఐ విచారణను కోరనున్నానని కర్ణాటక సీఎం యెడియూరప్ప చెప్పారు. దీనిపై నిజనిజాలు బయటపడేందుకు విచారణ జరుగాలని సీఎల్పీ నేత సిద్దరామయ్య కూడా డిమాండ్ చేస్తున్నారని, ఈ నేపథ్యంలో సీబీఐ విచారణను కోరాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. సీఎం కుమారస్వామి ప్రభుత్వం ఫోన్లు ట్యాపరింగ్ చేస్తున్నదని అనర్హత వేటు పడిన జేడీఎస్ ఎమ్మెల్యే ఏహెచ్ విశ్వనాథ్ ఇటీవల ఆరోపించారు. కాగా, ఈ ఆరోపణలపై కుమారస్వామి స్పందిస్తూ 'ఫోన్ల ట్యాంపరింగ్‌కు పాల్పడి అధికారాన్ని అంటిపెట్టుకోవాలని ఎన్నడూ అనుకోలేదు. ఈ ఆరోపణలు అవాస్తవం' అని పేర్కొన్నారు.

## కమల్‌నాథ్ మేనల్లుడిపై కేసు

**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ మేనల్లుడు, ఆప్టికల్ స్టోరేజ్ సంస్థ మోసర్ బేర్ మాజీ డైరెక్టర్ రతుల్ పురిపై ఆదివారం సీబీఐ కేసు నమోదు చేసింది. రూ. 354 కోట్ల విషయంలో బ్యాంకును మోసగించినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు ఈ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సంస్థ కార్యాలయాలు, డైరెక్టర్ల ఇండ్లతో కలిపి మొత్తం ఆరు ప్రాంతాల్లో సీబీఐ ఆదివారం సోదాలు నిర్వహించింది.

# జేఎన్‌యూకు మోదీ పేరు పెట్టాలి

- బీజేపీ ఎంపీ హన్స్ రాజ్ హన్స్ డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) పేరును మోదీ నరేంద్ర యూనివర్సిటీ (ఎంఎన్‌యూ)గా మార్చాలని వాయవ్య ఢిల్లీ ఎంపీ హన్స్ రాజ్ హన్స్ కోరారు. జేఎన్‌యూ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మన నేతల తప్పులకు మనం శిక్షలనుభవిస్తున్నామని, ఇందుకు జమ్ముకశ్మీర్ ఘటన ఉదాహరణ అని చెప్పారు. జమ్ముకశ్మీర్‌పై నెహ్రూ అనేక తప్పిదాలు చేశారని తెలిపారు. బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ మాట్లాడుతూ జేఎన్‌యూలో గతంలో దేశవ్యతిరేక నినాదాలు వినిపించేవని, కానీ ప్రస్తుతం వందేమాతరం, భారత్ మాతాకీ జై లాంటి నినాదాలు వినిపిస్తున్నాయన్నారు.



భక్తజనులతో ఆదివారం యాదాద్రి కిక్కిరిసిపోయింది. సెలవు రోజు కావడంతో కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు నారసింహుడిని దర్శనానికి గంటల పాటు నిరీక్షించారు. దాదాపు రూ.25 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయాధి కారులు తెలిపారు.
- యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ

## టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు
# దరఖాస్తుల ఆహ్వానం

**కాచిగూడ:** రాష్ట్రంలో టీ-సేవ ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తిగల నిరుద్యోగ యువత నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్టు టీ-సేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వినియోగదారులకు మైక్రో ఏటీఎం సేవలు అందించడంతోపాటు ఇతర సేవలను ప్రజల వద్దకు తీసుకెళ్తున్నట్టు పేర్కొన్నారు. యువతీ, యువకులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 81799 55744 ఫోన్ నంబర్‌లో లేదా www.tsevacentre.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.




## బొగత.. పర్యాటకులు ఫిదా..!

తెలంగాణ నయాగరా బొగత జలపాత అందాలకు పర్యాటకులు ఫిదా అవుతున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఈ జలపాతాన్ని చూసేందుకు జనం భారీగా తరలివస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఇక్కడికి వచ్చిన పర్యాటకులు ఉల్లాసంగా గడిపారు.
- వాజేడు






మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఎస్వీఎన్ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ శివాలయంలోని గర్భగుడిలోకి చేరిన నీరు



పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలోని ఓ ఇంట్లోకి చేరిన వరద

# మూడు జిల్లాల్లో భారీ వర్షం

## ఏడు జిల్లాల్లో ఓ మోస్తరు..

- ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం
- అత్యధికంగా అనుములలో 7.29 సెం.మీ. నమోదు
- రాగల 48 గంటల్లో రాష్ట్రంలో వర్ష సూచన

**హైదరాబాద్ నమస్తే తెలంగాణ/సిటీబ్యూరో/నెట్‌వర్క్:** పలు జిల్లాల్లో ఆదివారం వర్షం కురిసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, నల్లగొండ జిల్లాల్లో భారీగా, కరీంనగర్, జనగామ, మహబూబాబాద్, వరంగల్ అర్బన్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది. ఆసిఫాబాద్ జిల్లాలో పలుచోట్ల పిడుగులు పడి ఇద్దరు వ్యక్తులు గాయపడగా, ఓ ఆవు మృత్యువాతపడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా అనుముల మండలంలో 7.29 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా రాగల 48గంటల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల, బెజ్జూర్ మండలాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండుగంటలపాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం బీభత్సాన్ని సృష్టించింది. పిడుగుపాటుకు కౌటాల మండల కేంద్రంలో ఓ ఆవు మృత్యువాతపడింది. గురుడుపేట్‌లో వెంకటేశ్ అనే రైతు పొలం పనులకు వెళ్లి వస్తుండగా, బెజ్జూర్ మండలం మర్థిడి గ్రామంలో గొల్లపల్లి రాజేశ్ పిడుగుపాటుకు అస్వస్థతకు గురయ్యారు. కౌటాల మండలంలోని పలు గ్రామాల్లో పంటచేండ్లు నీట మునిగాయి. తలోడి గ్రామంలో ఇండ్లల్లోకి వరద చేరింది. రవీంద్రనగర్-చింతపల్లి గ్రామాల మధ్య వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అత్యధికంగా కౌటాల మండలంలో 8.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్-టి మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

### కరీంనగర్ జిల్లాలో..

కరీంనగర్ జిల్లా శంకరపట్నం, మానకొండూర్, హుజూరాబాద్, వీణవంక, సైదాపూర్, జమ్మికుంట మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల చెరువులు మత్తడిపోయగా, మరికొన్ని చెరువులు పూర్తిగా నిండాయి. శంకరపట్నం మండలంలో 40.6 మి.మీ.వర్షపాతం నమోదైంది.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల-రవీంద్రనగర్ రహదారి పైనుంచి పారుతున్న చింతలపాటి వాగు

### పెద్దపల్లి జిల్లాలో..

పెద్దపల్లి జిల్లాలో ఆదివారం భారీ వర్షం పడింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కుండపోతగా కురిసింది. భారీగా వరద నీరు చేరడంతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పెద్దపల్లితోపాటు గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరింది. పంట పొలాలు సైతం నీట మునిగాయి. నల్లగొండ జిల్లాలో ఆదివారం వర్షం కురిసింది. అనుముల, పీఏపల్లి, తిర్మలగిరి సాగర్ మండలాల్లో భారీగా మరికొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరుగా కురిసింది. అత్యధికంగా అనుముల మండలంలో 72.9 మి.మీ. వర్షపాతం నమోదైంది.

### జనగామ జిల్లాలో..

జనగామ జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. జనగామ పట్టణంలో ఉదయం అరగంటపాటు భారీ వర్షం కురవగా, మధ్యాహ్నం 3గంటల వరకు ఎడతెరిపి లేకుండా ముసురు పడింది. దీంతో జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, గూడూరు, గంగారం మండలాల్లో వర్షం కురిసింది. తొర్రూరు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వర్షం దంచికొట్టింది. గంటపాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో పలు వాగులు, కాల్వల్లోకి నీరు చేరింది. వరంగల్ అర్బన్ జిల్లాలో ఓ మోస్తరు వాన పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురుపట్టింది. మధ్యాహ్నం జల్లులు కురిశాయి. ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, కమలాపూర్, హసన్‌పర్తి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా, వరంగల్ నగరంలో చిరుజల్లులు పడ్డాయి. ములుగు జిల్లా కేంద్రంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంతోపాటు పలుచోట్ల ఆదివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, మణుగూరు, దుమ్ముగూడెం, ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

### గ్రేటర్ హైదరాబాద్‌లో జల్లులు..

గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. యాచారం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, నాగోల్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. యాచారంలో 1.8 సెం.మీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది.

### సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని సింగరేణి మణుగూరు ఏరియాలో ఆదివారం కురిసిన వర్షానికి పీకేఓసీ-2, పీకేఓసీ-4, మణుగూరు ఓసీ గనుల్లోని క్వారీల్లోకి భారీగా వరద నీరు చేరింది. సెకండ్ షిఫ్టులో ఓవర్‌బర్డెన్(ఓబీ), కోల్ ఉత్పత్తికి పూర్తిగా ఆటంకం ఏర్పడింది. మణుగూరు ఏరియా నుంచి రోజూ సుమారు 30 వేల టన్నుల బొగ్గు తీయాల్సి ఉండగా ఆదివారం బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది.

### 48 గంటల్లో రాష్ట్రంలో తేలికపాటి వానలు

తెలంగాణలో రుతుపవనాలు మందగమనంలో సాగుతున్నాయి. రాగల 48 గంటల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కోస్తాంధ్రలో మాత్రం రుతుపవనాలు బలంగా ఉన్నాయని, అక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో మరో మూడు రోజుల తర్వాత రుతుపవనాలు పుంజుకోవచ్చన్నారు. 24గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురియవచ్చని తెలిపారు.

## అక్టోబర్‌లో భారీ తుఫాన్!

- ఆ నెల రెండోవారం వరకూ రుతుపవనాలు
- మూడోవారంలో ఉపసంహరణ.. అదే సమయంలో తుఫాన్!
- పీఐకే శాస్త్రవేత్తల వెల్లడి


**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** అక్టోబర్ రెండోవారం వరకూ నైరుతి రుతుపవనాల ప్రభావం ఉంటుందనీ, అక్టోబర్ 14 నుంచి 24వ తేదీల మధ్య రుతుపవనాల ఉపసంహరణ ఉంటుందని ఇండో-జర్మన్ వాతావరణ ప్రాజెక్ట్, పొట్స్ డామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లైమెట్ ఇంపాక్ట్ రీసెర్చ్(పీఐకే) శాస్త్రవేత్తలు వెల్లడించారు. రుతుపవనాల ఉపసంహరణ సమయంలో గతేడాది తిత్లీ తుఫాన్ మాదిరిగా ఈసారి భారీ తుఫాన్ ఏర్పడే అవకాశమున్నదని వారు తెలిపారు. టిప్పింగ్ ఎలిమెంట్ విధానం ద్వారా ఈ సంస్థ గత నాలుగేండ్లుగా వేస్తున్న వాతావరణ అంచనాలు దాదాపుగా నిజమవుతున్నాయి. 2018 అక్టోబర్ 18న రుతుపవనాలు మధ్య భారతం నుంచి ఉపసంహరణ ఉంటుందని ఆ సంస్థ అంతకుముందే 2018 జూలై 30న వెల్లడించగా, అంచనా ప్రకారమే ఉపసంహరణ జరిగింది. 2016, 2017లోనూ రుతుపవనాల ఆగమనం, ఉపసంహరణకు సంబంధించి ఆ సంస్థ వెల్లడించిన ముందస్తు అంచనాలు నిజమయ్యాయి. వేములవాడ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్‌బాబు నాయకత్వంలోని ఇండో-జర్మన్ పీఐకే సంస్థ విజయవంతంగా వాతావరణ పరిశోధనలను నిర్వహిస్తున్నది.

### ఉపసంహరణ సమయంలో భారీ తుఫాన్

అక్టోబర్ రెండు లేదా మూడో వారంలో రుతుపవనాల ఉపసంహరణ సమయంలో భారీ తుఫాన్ వచ్చే అవకాశమున్నది. గతేడాది ఇదే సమయంలో తిత్లీ తుఫాన్ ఏర్పడింది. భూతాపం పెరిగిపోతున్న క్రమంలో వాతావరణంలో అనూహ్యమైన మార్పులు సంభవిస్తున్నాయి. ముంబై, కర్ణాటక, కేరళతోపాటు ఉత్తర భారతదేశంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఒకేచోట కురవడం వంటి పరిణామాల పట్ల ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలి.

– చెన్నమనేని రమేశ్‌బాబు, వేములవాడ ఎమ్మెల్యే, పీఐకే అనుసంధానకర్త.


## రెండు బైకులు ఢీ.. ఒకరు మృతి



అరీఫొద్దీన్ మృతదేహం

**సుల్తానాబాద్:** ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొన్న ఘటనలో పెద్దపల్లికి జిల్లా కేంద్రానికి చెందిన ఒకరు మృతి చెందగా, మరొకరి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణానికి చెందిన మహ్మద్ ఆరీఫొద్దీన్ అతని కొడుకు యూసుఫ్‌బాబాతో కలిసి సుల్తానాబాద్‌లో శుభకార్యానికి వెళ్తున్నాడు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కందునూరి విద్యాసాగర్ బైక్‌పై ఎదురెదురుగా వస్తున్నాడు. వీరి బైక్‌లు పట్టణంలోని చెరువు వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఆరీఫొద్దీన్ అక్కడికక్కడే మృతి చెందగా, అతని కొడుకు యూ సుఫ్‌బాబాకు గాయాలయ్యాయి. చికిత్స కోసం కరీంనగర్ దవాఖానకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆరీఫొద్దీన్ పెద్దపల్లిలో ఖాజీ గా పనిచేస్తుంటాడు. ముస్లింలకు సంబంధించి వివాహ కార్యక్రమాలు చేస్తుంటాడని తెలిపారు.


## విద్యుత్ షాక్‌తో కూలీ..



సహదేవామాజీ మృతదేహం

**గంగాధర:** విద్యుత్ షాక్‌తో కూలీ మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వివేక్ కథనం మేరకు ఒరిస్సాకు చెందిన యువకుడు సహదేవామాజీ(23) మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామ పరిధిలోని హెచ్‌ఎం గ్రానైట్ క్వారీలో కూలీగా పని చేస్తున్నాడు. పని చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి పడిపోయాడు. క్వారీ నిర్వాహకులు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడిని తీసుకువచ్చి చూపించగా పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే రాజా సోంభూపాల్ కన్నుమూత



రాజా సోంభూపాల్ (ఫైల్)

**చిన్నచింతకుంట:** మాజీ ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్‌జిల్లా కురుమూర్తి దేవస్థానం సంస్థానాధీశుడు, ముక్కెర వంశీయులు రాజా సోంభూపాల్ (102) కన్నుమూశారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. 1962 కాంగ్రెస్ పార్టీ తరపున, 1967లో జనతాదళ్ నుంచి అమరచింత నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 1972లో టీడీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన స్వగ్రామమైన చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌లో సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.


## బీజేపీ నేతలవి చౌకబారు విమర్శలు

- ప్రధాని మోదీ మెచ్చిన కాళేశ్వరంపైన ఆరోపణలా?
- ఎమ్మెల్యే దివాకర్‌రావు ధ్వజం

**మంచిర్యాలటౌన్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ నాయకులు చేస్తున్న చౌకబారు విమర్శలు మానుకోవాలనీ, లేకుంటే ప్రజలే బుద్ధిచెబుతారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఆదివారం మంచిర్యాలలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ వివేక్ కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు, మిషన్ భగీరథపై విమర్శలు చేయడంపై ఎమ్మెల్యే దివాకర్‌రావు మండి పడ్డారు. స్వయంగా ప్రధాని మోదీనే కాళేశ్వరం ప్రాజెక్టును మెచ్చుకున్నారనీ, ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు హాజరయ్యారని గుర్తుచేశారు. ఒకవేళ కమీషన్ల ప్రాజెక్టులైతే వారు ఇక్కడకు వచ్చేవారు కాదన్నారు. బీజేపీ నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## గోదారిని చూసె.. రైతన్నలు మురిసె

- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపుతో కాళేశ్వరం సందర్శన
- చెన్నూర్ ఎమ్మెల్యే సుమన్ ఆధ్వర్యంలో పర్యటన



రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులు, నాయకులకు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న ఇంజినీర్, పక్కన చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

**సిరిసిల్ల, నమస్తే తెలంగాణ/ గంభీరావుపేట :** 'కాళేశ్వరం ప్రాజెక్టు మహాద్భుతం. కలలో కూడా నిండు గోదారిని చూస్తామనుకోలె. కేసీఆర్ సార్ వల్లే సాధ్యమైంది. ఇక కరువన్న మాటుండదు. సాగు నీటికి రంది లేదు. నిజంగా సీఎం కేసీఆర్ అపర భగీరథుడు' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట రైతులు అభిప్రాయపడ్డారు. 'రైతులకు కాళేశ్వరం చూపిద్దాం' అంటూ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ గులాబీ శ్రేణులకు ఇచ్చిన పిలుపుమేరకు గంభీరావుపేట మండలం నుంచి 25 బస్సుల్లో వెయ్యి మందికి పైగా రైతులు ఆదివారం కాళేశ్వరానికి పయనమయ్యారు. మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్ వద్ద చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ వీరికి ఘన స్వాగతం పలికారు. ప్రాజెక్టుల్లో పరవళ్లు తొక్కుతున్న గంగను చూసిన రైతులు పులకించిపోయారు. లక్ష్మి బరాజ్ ప్రాధాన్యతను ఎమ్మెల్యే బాల్క సుమన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం లక్ష్మి పంప్‌హౌస్‌ను చూపించి, అక్కడి నుంచి కాళేశ్వరం ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకొని, రైతులతో కలిసి భోజనం చేశారు. తర్వాత సరస్వతి, పార్వతి బరాజ్‌లను సందర్శించి తిరుగుపయనమయ్యారు. తమకు కాళేశ్వరం చూసే అవకాశం కల్పించిన కేటీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. గంభీరావుపేట ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి లక్ష్మి, మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు దయాకర్‌రావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక ఎలక్ట్రానిక్ స్టాంపులు


- అక్రమాలకు, కృత్రిమ కొరతకు చెక్‌పెట్టడమే లక్ష్యం
- స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్‌తో ఒప్పందానికి తెలంగాణ రిజిస్ట్రేషన్లశాఖ సన్నాహాలు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ**

స్టాంప్‌పేపర్ల విక్రయాల్లో అక్రమాలకు, కృత్రిమ కొరతకు ఆస్కారం లేకుండా చూసేందుకు రిజిస్ట్రేషన్లశాఖ పటిష్ట చర్యలు చేపడుతున్నది. స్టాంప్‌పేపర్లను కూడా ఎలక్ట్రానిక్ పద్ధతిలో విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఈ విక్రయాలను కేంద్రప్రభుత్వ ఆధీనంలోని స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. దీనికి అనుమతినివ్వాల్సిందిగా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ టీ చిరంజీవులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్టు తెలిసింది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు, ఒప్పందాలు, బ్యాంకుల రుణ ఒప్పందాలకు రిజిస్ట్రేషన్లశాఖ ప్రత్యేకంగా స్టాంప్‌పేపర్లను విక్రయిస్తున్నది. ప్రస్తుతం రాష్ట్రానికి అవసరమైన స్టాంప్‌పేపర్ల ముద్రణ మహారాష్ట్రలోని నాసిక్‌లో జరుగుతున్నది. అక్కడి నుంచి రాష్ట్ర రిజిస్ట్రేషన్లశాఖ 20, 50, 100 రూపాయల విలువచేసే స్టాంపులను కొనుగోలు చేసి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా స్టాంప్‌వెండర్లకు విక్రయిస్తున్నది. ఈ స్టాంపులను ప్రభుత్వ అనుమతి పొందిన వెండర్లు ప్రజలకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో కొందరు వెండర్లు కుమ్మక్కై తరుచూ స్టాంపుల కొరతను సృష్టిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు స్టాంపుల అమ్మకాల సమయంలో కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నగదు దుర్వినియోగమైనట్టు ఇటీవల వెలుగులోకి రావడంతో నగదు లావాదేవీలపై ఆంక్షలు విధించారు. రెండేండ్ల క్రితం అమల్లోకి తెచ్చిన ఈ-స్టాంపుల విధానంతో చలానాల అక్రమాలకు పూర్తిగా కళ్లెం వేయగలిగారు. ఇదే విధంగా స్టాంపుల విక్రయాల్లో అక్రమాలను నిరోధించేందుకు ఎలక్ట్రానిక్ స్టాంపుల విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని కమిషనర్ చిరంజీవులు నిర్ణయించారు. ఈ విధానంపై అధ్యయనం చేసేందుకు జిల్లా రిజిస్ట్రార్ హోదాలో ఉన్న సంతోష్ నేతృత్వంలో ఓ బృందాన్ని ఢిల్లీకి పంపారు. ఈ-స్టాంపుల విధానం మంచి ఫలితాన్నిస్తున్నదని ఆ బృందం నివేదిక ఇచ్చింది. ఢిల్లీతోపాటు పలు రాష్ట్రాలు ఈ-స్టాంపుల విధానాన్ని అమలుచేస్తున్నాయి. ఈ విధానంలో స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ లిమిటెడ్.. బ్యాంకర్లకు, స్టాంప్ వెండర్లకు లాగిన్ ఐడీ ఇచ్చి ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ స్టాంపులను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పిస్తుండటంతో ఏ స్టాంప్‌వెండర్ ఎవరి పేరిట ఎన్ని స్టాంపులు తీసుకుంటున్నదీ స్పష్టంగా తెలుస్తున్నది. దీనిపై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిఘా ఉంటుంది. ప్రస్తుతం 20 రూపాయల విలువచేసే ఒక్కో స్టాంపుపేపర్ ముద్రణ కోసమే రిజిస్ట్రేషన్లశాఖ రెండు రూపాయల చొప్పున వెచ్చిస్తున్నది. దీంతో ముద్రణకు భారీగా ఖర్చవుతున్నది. ఎలక్ట్రానిక్ పద్ధతిలో అయితే స్టాక్‌హోల్డింగ్ కార్పొరేషన్‌కు నామమాత్రపు ఫీజు చెల్లిస్తే సరిపోతుందని, దీనివల్ల కోట్ల రూపాయల ఖర్చు తగ్గుతుందని అధికారులంటున్నారు.

## విలువల వైతాళికుడు జైపాల్‌రెడ్డి

- మంత్రి నిరంజన్‌రెడ్డి



జైపాల్‌రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వెల్దండ:** విలువలు కల్గిన వైతాళికుడు..దేశ రాజకీయాల్లో బలమైన గొంతుక కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో జైపాల్‌రెడ్డి సంతాప సభకు మంత్రి హాజరై నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984 నుంచి జైపాల్‌రెడ్డితో తనకు పరిచయముందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర వహించారని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో జైపాల్‌రెడ్డి చిత్రపటం పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేయాలని మంత్రి అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



60 ఏండ్ల సమైక్య పాలనలో నిర్లక్ష్యాన్ని రూపుమాపుతూ ఐదేండ్లలో తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 160 మంది టీఆర్‌ఎస్‌లో చేరగా, మంత్రి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.
- సూర్యాపేట టౌన్

## భూవివాదంలో రైతు దారుణ హత్య

**గన్నేరువరం :** భూవివాదంలో ఓ రైతు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని చీమలకుంటపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామ పరిధిలోని సర్వేనం. 753లో 36 గుంటలు, 771లో ఎకరం భూమి విషయంలో గ్రామానికి చెందిన వజ్ర మల్లేశం (56), లాసాని పీరయ్య, లాసాని వీరయ్య కుటుంబాల మధ్య గత మూడేండ్లుగా వివాదం జరుగుతున్నది. గతంలో ఈ వివాదం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లగా ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేశారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉన్నది. కాగా, ఆదివారం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లిన మల్లేశంపై లాసాని పీరయ్య దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని మల్లేశం భార్య రాధ, కొడుకు నరేశ్ తెలిపారు. తిమ్మాపూర్ రూరల్ సీఐ కరుణాకర్‌రావు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి ఘటనా స్థలానికి తీసుకురావాలనీ, అప్పటివరకు మృతదేహాన్ని తరలించేది లేదని మృతుడి బంధువులు భీష్మించడంతో పోలీసులు నచ్చజెప్పారు.

# కరీంనగర్‌లో వాకో ఇండియా కిక్ బాక్సింగ్ టోర్నీ

**కరీంనగర్ స్పోర్ట్స్:** జాతీయ వాకో ఇండియా కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ ట్రోఫీని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. కరీంనగర్ వేదికగా సెప్టెంబర్ 17 నుంచి 20 వరకు జరుగనున్న ఈ పోటీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కిక్ బాక్సర్లు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారత కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేడెట్, జాతీయ స్థాయి జూనియర్ పోటీలు మొదటిసారిగా కరీంనగర్‌లో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నీ చైర్మన్ శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజర్ ఆర్. ప్రసన్నకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, తెలంగాణ వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ప్రధాన కార్యదర్శి మహిపాల్, ఉపాధ్యక్షుడు బాలాజీ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో వాకో ఇండియా కిక్‌బాక్సింగ్ కప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

# అనస్, హిమకు స్వర్ణాలు




**న్యూఢిల్లీ:** భారత స్టార్ స్ప్రింటర్లు హిమాదాస్, మొహమ్మద్ అనస్ అంతర్జాతీయ స్థాయిలో మరోసారి మెరిశారు. చెక్ రిపబ్లిక్ వేదికగా జరుగుతున్న అథ్లెటిక్స్ ఈవెంట్‌లో వీరిద్దరూ స్వర్ణాలు సాధించారు. మహిళల 300 మీటర్ల విభాగంలో హిమ, పురుషుల 300 మీటర్ల విభాగంలో అనస్ పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. గత నెలలో ఐదు స్వర్ణాలు సాధించి అదరగొట్టిన మన 'పంచ కల్యాణి' హిమ ఆరోసారి కూడా దుమ్మురేపింది. బుల్లెట్ వేగంతో లక్ష్యాన్ని చేరి అందరికంటే ముందు నిలిచింది. యూరోపియన్ రేసుల్లో భాగంగా జూలై 2 నుంచి ఇప్పటి వరకు హిమ ఆరు బంగారు పతకాలు చేజిక్కించుకోవడం విశేషం. పురుషుల విభాగంలో అనస్ 32.41 సెకన్లలో గమ్యాన్ని చేరి బంగారు పతకం గెలుచుకున్నాడు. కాగా.. వరల్డ్ చాంపియన్‌షిప్ 400 మీటర్ల ఈవెంట్‌కు అనస్ ఇప్పటికే అర్హత పొందగా.. హిమా దాస్ ఇంకా అర్హత సాధించలేదు. సెప్టెంబర్‌లో దోహా వేదికగా జరిగే ఈ టోర్నీ కోసం హిమ కసరత్తులు చేస్తున్నది.

# ఐటీఎఫ్‌తో నేడు సంప్రదింపులు

**న్యూఢిల్లీ:** డేవిస్ కప్ తటస్థ వేదిక కోసం ప్రయత్నిస్తున్న అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) సోమవారం అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్ (ఐటీఎఫ్) భద్రత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం కానుంది. తమ సమస్యను ఐటీఎఫ్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సమావేశాన్ని వినియోగించుకోవాలని ఐటా భావిస్తున్నది. ఇందులో డేవిస్ కప్ నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి కూడా పాల్గొననున్నాడు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఇస్లామాబాద్‌కు వెళ్తే తమ ఆటగాళ్ల భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఐటా ఆందోళన వ్యక్తం చేస్తున్నది. టోర్నీ షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 14-15 తేదీల్లో పాక్‌లో జరిగే డేవిస్‌కప్ ఆసియా, ఓసియానియా గ్రూప్-1 మ్యాచ్‌ల్లో భారత జట్టు ఆ దేశంతో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

# భారత జట్లకు మిశ్రమ ఫలితాలు




**టోక్యో:** ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్‌లో భారత జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌ల్లో నెగ్గి శుభారంభం చేసిన భారత పురుషుల, మహిళల జట్లు మలి మ్యాచ్‌ల్లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. పురుషుల జట్టు 1-2తో న్యూజిలాండ్ చేతిలో ఓటమి పాలవగా.. ప్రపంచ రెండో ర్యాంకర్ ఆస్ట్రేలియాతో మ్యాచ్‌ను మన అమ్మాయిలు 2-2తో 'డ్రా'చేసుకున్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల పోరు ఆరంభంలోనే ఆధిక్యం సాధించిన భారత్ ఆ తర్వాత దాన్ని నిలుపుకోవడంలో విఫలమైంది. రెండో నిమిషంలోనే లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలచడంతో భారత్ 1-0తో ముందంజలో నిలిచింది. అనంతరం న్యూజిలాండ్ తరఫున జాకబ్ స్మిత్ (47వ ని.లో), సామ్ లానె (60వ ని.లో) చెరో గోల్ చేయడంతో ఆ జట్టు గెలుపొందింది. తదుపరి మ్యాచ్‌లో మంగళవారం జపాన్‌తో భారత పురుషుల జట్టు తలపడనుంది. మహిళల పోరులో మ్యాచ్ 'డ్రా'అయినప్పటికీ భారత అమ్మాయిలు ఆటతీరు ఆకట్టుకుంది. వందన కటారియా (36వ ని.లో), గుర్జీత్ కౌర్ (59వ ని.లో) భారత్ తరఫున చెరో గోల్ చేశారు. ఆసీస్ నుంచి కైట్లిన్ నాబ్స్ (14వ ని.లో), గ్రేస్ స్టివర్ట్ (43వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. తొలి మ్యాచ్‌లో జపాన్‌పై నెగ్గిన మన అమ్మాయిలు ఈ మ్యాచ్‌లో రెండు సార్లు వెనుకంజలో ఉండి కూడా తిరిగి పుంజుకొని స్కోర్లు సమం చేయడం విశేషం.

# సమరానికి సై

## నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

### నేరుగా రెండో రౌండ్‌కు సింధు, సైనా.. పురుషుల సింగిల్స్ బరిలో శ్రీకాంత్, ప్రణీత్



**ఈ సీజన్‌లో టైటిళ్ల కరువులో ఉన్న భారత షట్లర్లు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు సిద్ధమయ్యారు. స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో నేడు ఈ మహాపోరుకు తెరలేవనుంది. స్వర్ణ స్వప్నాన్ని సాకారం చేసుకోవాలని ఎంతో కాలంగా సన్నాహకాల్లో తలమునకలై ఉన్న భారత ప్లేయర్లు పక్కా ప్రణాళికతో బరిలోకి దిగుతున్నారు. ముఖ్యంగా పీవీ సింధు, సైనా నెహ్వాల్ స్వర్ణ పతకంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో తెలుగు షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్ టైటిల్ చేజిక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకోవాలంటే ఈ టోర్నీ మన షట్లర్లకు చాలా కీలకం.**

**బాసెల్ (స్విట్జర్లాండ్):** బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు సర్వం సిద్ధమైంది. ఎప్పటి నుంచో అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఈ టోర్నీ స్వర్ణ పతకాన్ని సాధించేందుకు భారత షట్లర్లు పట్టుదలగా ఉన్నారు. ఈ ఏడాది జరిగిన టోర్నీల్లో అంచనాలను అందుకోలేకపోయిన మన వాళ్లు చాంపియన్‌షిప్‌ను చేజిక్కించుకొని టైటిల్ దాహం తీర్చుకోవాలని భావిస్తున్నారు. మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ పీవీ సింధు, స్టార్ ప్లేయర్ సైనా నెహ్వాల్.. చాంపియన్‌షిప్ కోసం ఎప్పటి నుంచో శ్రమిస్తున్నారు. మరోవైపు పరుషుల సింగిల్స్‌లో తెలుగు షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్ సహా హెచ్‌ఎస్ ప్రణయ్, సమీర్ వర్మ సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నారు. ఈ టోర్నీలో అదరగొట్టి గత వైభవాన్ని గుర్తుచేయాలని శ్రీకాంత్ ఆశిస్తున్నాడు.


సాయి ప్రణీత్

## ఈసారైనా స్వర్ణం

ఒలింపిక్ రజత పతక విజేత సింధుకు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మంచి రికార్డు ఉంది. గత రెండు టోర్నీల్లో ఫైనల్ వరకు వెళ్లిన సింధు... తుదిమెట్టుపై తడబడి రజత పతకాలు సాధించింది. 2017 ఫైనల్లో ఒకుహరా(జపాన్)తో 110 నిమిషాల పాటు సాగిన పోరులో అద్భుతంగా పోరాడినా సింధుకు నిరాశ తప్పలేదు. అలాగే 2018 తుదిపోరులో కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో ఓడిన సింధు స్వర్ణాన్ని చేజార్చుకుంది. 2013, 2014 టోర్నీల్లోనూ కాంస్య పతకాలు సాధించింది. ఈసారి ఎలాగైనా పసిడి పతకం పట్టాలని సింధు తీవ్రంగా శ్రమిస్తున్నది. ఫిట్‌నెస్, డిఫెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధపెట్టింది. అయితే, గతేడాది వరల్డ్‌టూర్ టైటిల్ తర్వాత ఈ సీజన్‌లో సింధు ఒక్కటైటిల్ కూడా సాధించలేకపోయింది. ఇండోనేషియా ఓపెన్ ఫైనలే ఆమెకు ఈ సీజన్‌తో అత్యుత్తమ ప్రదర్శన. ఈ నేపథ్యంలో ఇక్కడ స్వర్ణం సాధించి వచ్చే ఏడాది ఒలింపిక్స్ కోసం ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమవ్వాలని భావిస్తున్నది. తొలి రౌండ్‌లో సింధుకు బై లభించగా.. రెండో రౌండ్‌లో పై యుపో(చైనీస్ తైపీ) లేదా లిండా జెట్చిరి(బల్గేరియా)తో తలపడనుంది. 'డ్రా'లో భాగంగా సింధు, సైనా ఒకే పార్శ్వంలో ఉండటంతో.. అంచనాలకు తగ్గట్లు రాణిస్తే సెమీఫైనల్లో వీరిద్దరే తలపడే అవకాశాలు ఉన్నాయి.

## పురుషుల డబుల్స్‌లో మూడు జోడీలు

ఇటీవలే థాయ్‌లాండ్ ఓపెన్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించిన భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్‌సాయి రాజ్-చిరాగ్ శెట్టి గాయాల కారణంగా ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు దూరమైంది. మను అత్రి-సుమీత్ రెడ్డి, ఎంఆర్ అర్జున్-శ్లోక్ రామచంద్రన్, అరుణ్ జార్జ్-శ్యామ్ శుక్లా జోడీలు బరిలో ఉన్నాయి. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-ఎన్.సిక్కిరెడ్డి, జక్కంపూడి మేఘన-పూర్విష, పూజ-సంజనా పోటీలో ఉన్నారు.

## సైనాకూ బై

ఈ ఏడాది మహిళల సింగిల్స్ విభాగంలో టైటిల్ సాధించిన ఏకైక భారత షట్లర్ సైనా నెహ్వాల్. జనవరిలో జరిగిన ఇండోనేషియా మాస్టర్స్‌లో సైనా విజేతగా నిలిచింది. ఇటీవల గాయాల కారణంగా ఇండోనేషియా, జపాన్ ఓపెన్ టోర్నీలకు ఆమె దూరమైంది. థాయ్‌లాండ్ ఓపెన్‌తో పునరాగమనం చేసినా.. క్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. చాంపియన్‌షిప్ కోసం ఎప్పటి నుంచో సిద్ధమవుతున్న సైనాకు తొలి రౌండ్‌లో బై లభించగా.. నేరుగా రెండో రౌండ్‌లో బరిలోకి దిగనుంది. అయితే, సైనాకు క్వార్టర్స్‌లో చెన్ యూ ఫీ (చైనా) రూపంలో బలమైన ప్రత్యర్థి ఎదురయ్యే అవకాశముంది. చెన్ ఈ ఏడాది నాలుగు టైటిళ్లు సాధించి జోరుమీదుంది.

## పూర్వవైభవం కోసం

ఓ వైపు గాయాలు.. మరో వైపు వైఫల్యాలతో నిరాశలో ఉన్న స్టార్ షట్లర్, ఏడో సీడ్ శ్రీకాంత్.. చాంపియన్‌షిప్‌లో సత్తా చాటి గత వైభవాన్ని చాటిచెప్పాలని చూస్తున్నాడు. రెండేళ్ల క్రితం నాలుగు సూపర్ టైటిల్ సిరీస్‌లను గెలిచి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరిన అతడు.. 22 నెలలుగా ఒక్క టైటిల్ కూడా సాధించలేదు. తొలి రౌండ్‌లో నాట్ గుయెన్ (ఐర్లాండ్)తో శ్రీకాంత్ తలపడనున్నాడు. మరో తెలుగు షట్లర్ సాయి ప్రణీత్ ఈ ఏడాది మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. స్విస్ ఓపెన్ ఫైనల్ సహా జపాన్ ఓపెన్ సెమీస్ వరకు వెళ్లాడు. వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు ముందు అర్జున అవార్డుకు ఎంపికైన ప్రణీత్.. తొలి రౌండ్‌లో జేసన్ ఆంటోనీ (కెనడా)ని ఢీకొట్టనున్నాడు. ప్రణయ్ తొలి రౌండ్‌లో ఈటు హీనో(ఫిన్లాండ్)తో తలపడనున్నాడు.


శ్రీకాంత్

# లంక ఘన విజయం


## సెంచరీతో గెలిపించిన కెప్టెన్ కరుణరత్నె


కరుణరత్నె (122)

**గాలె:** సొంతగడ్డపై శ్రీలంక చక్కటి ప్రదర్శనతో చెలరేగింది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో లంక 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో పాయింట్ల ఖాతా తెరిచింది. కెప్టెన్ దిముత్ కరణరత్నే (243 బంతుల్లో 122; 6 ఫోర్లు, 1 సిక్సర్) అద్భుత సెంచరీకి మరో ఓపెనర్ తిరిమన్నె (64) అర్ధశతకం తోడవడంతో లంక రెండో ఇన్నింగ్స్‌లో 86.1 ఓవర్లలో 4 వికెట్లకు 268 పరుగులు చేసి గెలుపొందింది. గాలెలో ఇదే అత్యధిక పరుగుల ఛేదన కాగా.. గతంలో ఇక్కడ నాలుగో ఇన్నింగ్స్ ఆడుతూ ఏ జట్టూ 99 పరుగులకు మించి టార్గెట్‌ను ఛేజ్ చేయక పోవడం గమనార్హం. కరుణరత్నెకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఓవర్‌నైట్ స్కోర్ 133/0తో చివరిదైన ఐదో రోజు ఆట కొనసాగించిన లంక ఒక్కో పరుగు జతచేస్తూ లక్ష్యాన్ని కరిగించుకుంటూ వెళ్లింది. పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తున్నా ఎక్కడా తడబాటుకు గురికాకుండా పట్టుదలతో నిలిచిన కెప్టెన్ కరుణరత్నె సెంచరీతో ఆకట్టుకోవడంతో ఆదివారం తొలి సెషన్‌లోపే ఆట ముగిసింది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 249 పరుగులు చేయగా.. లంక 267 రన్స్‌కు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 285 పరుగులకు పరిమితమవగా.. 268 పరుగుల లక్ష్యాన్ని లంక 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.

# ఇక్కడా కోహ్లీనే..

**న్యూఢిల్లీ:** పరుగుల వరద పారించడంతో పాటు.. రికార్డులు తిరగరాయడంలో ముందువరుసలో ఉండే విరాట్ కోహ్లీ సోషల్ మీడియాలోనూ హవా కొనసాగిస్తున్నాడు. సామాజిక మాధ్యమాల్లో సచిన్ టెండూల్కర్, మాజీ సారథి ధోనీని మించి అత్యధిక ఫాలోవర్లు కలిగిన క్రికెటర్‌గా నిలిచాడు. ట్విట్టర్(3.1 కోట్లు), ఫేస్‌బుక్(3.7 కోట్లు), ఇన్‌స్టాగ్రామ్(3.9 కోట్లు)ల్లో మొత్తంగా 9 కోట్లకు పైగా కోహ్లీని ఫాలో అవుతున్నారు. మరో వైపు కెప్టెన్ విరాట్ కోహ్లీకి అరుదైన గౌరవం దక్కనుంది. ఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్ల మైదానంలోని ఓ స్టాండ్‌కు త్వరలో కోహ్లీ స్టాండ్‌గా డీడీసీఏ నామకరణం చేయనుంది.



# యాషెస్‌లో హై'డ్రా'మా

## ఫలితం తేలకుండానే ముగిసిన రెండో టెస్టు.. స్టోక్స్ సెంచరీ.. రాణించిన ఆర్చర్

**లండన్:** ఇటీవల వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో అద్భుత పోరాటంతో జట్టును విజయపథంలో నిలిపిన ఇంగ్లండ్ ఆటగాళ్లు బెన్‌స్టోక్స్ (115; 11 ఫోర్లు, 3 సిక్సర్లు), జొఫ్రా ఆర్చర్ (3/32) యాషెస్ రెండో టెస్టులోనూ తమ జట్టును గెలిపించేందుకు శతవిధాల కృషిచేశారు. ఒకరు బ్యాటింగ్‌లో సెంచరీతో శివాలెత్తితే.. మరొకరు బౌన్సర్లతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించారు. వర్షం కారణంగా నాలుగు రోజుల ఆటే సాధ్యమైన ఈ మ్యాచ్.. అనూహ్య మలుపులు తిరుగుతూ చివరకు 'డ్రా'గా ముగిసింది. ప్రత్యర్థి ముందు ఊరించే లక్ష్యాన్ని ఉంచి డిక్లేర్ చేసిన ఇంగ్లండ్ అనంతరం బౌలింగ్‌లో విజృంభించింది. 267 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలో దిగిన ఆస్ట్రేలియా ఆదివారం ఆట ముగిసే సమయానికి 47.3 ఓవర్లలో 6 వికెట్లకు 154 పరుగులు చేసింది. కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోదిగిన లబ్‌షేన్ (59) అర్ధశతకంతో చెలరేగగా.. హెడ్ (42 నాటౌట్) రాణించాడు. ఇప్పటికే బౌన్సర్‌తో స్టీవ్ స్మిత్‌ను డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం చేసిన ఆర్చర్.. అతడి స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన లబ్‌షేన్‌కు కూడా దడపుట్టించాడు. అయిదే గ్రిల్ ఉండటంతో బతికిపోయిన లబ్‌షేన్ చక్కటి పోరాటంతో ఇంగ్లిష్ జట్టుకు విజయావకాశాలను దూరం చేశాడు. లీచ్‌కు 3 వికెట్లు దక్కాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 96/4తో చివరిదైన ఐదోరోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్.. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ స్టోక్స్ సెంచరీకి తోడు బట్లర్ (31), బెయిర్‌స్టో (30) వేగంగా ఆడటంతో 258/5 వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.


స్టోక్స్ (115)

**మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 258 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా 250కి ఆలౌటైంది. ఇంగ్లిష్ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 258/5 వద్ద డిక్లేర్ చేస్తే.. కంగారూలు చివరకు 6 వికెట్లకు 154 పరుగులు చేయగలిగారు.**

### తొలిసారి కాంకషన్ సబ్‌స్టిట్యూట్

క్రికెట్ చరిత్రలో తొలి కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా మార్నస్ లబ్‌షేన్ రికార్డులకెక్కాడు. తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేస్తుండగా ఇంగ్లండ్ పేసర్ ఆర్చర్ బౌన్సర్‌కు గాయపడ్డ ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ స్థానంలో అతడు ఈ మ్యాచ్‌లో ఆడాడు. స్మిత్ గాయపడ్డ నేపథ్యంలో ఐసీసీ కొత్త నిబంధనల మేరకు ఆసీస్ సబ్‌స్టిట్యూట్ కావాలని రిఫరీని సంప్రదించగా.. అందుకు అంగీకారం లభించింది. సవరించిన నిబంధనల ప్రకారం కాంకషన్ సబ్‌స్టిట్యూట్ ఆటగాడు ఫీల్డింగ్ మాత్రమే కాకుండా.. బౌలింగ్, బ్యాటింగ్ చేసే అవకాశాన్ని కల్పించింది.

# భారత్ ఎలెవెన్ పైచేయి

## విండీస్-ఏ 181 ఆలౌట్




**అంటిగ్వా:** సంప్రదాయ క్రికెట్‌లో తొలిసారి జెర్సీలపై నంబర్లు, పేర్లతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా ఆటగాళ్లు వెస్టిండీస్-ఏతో జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో అదరగొడుతున్నారు. మ్యాచ్ రెండో రోజు ఆదివారం భారత బౌలర్లు ఇషాంత్ శర్మ(3/21), ఉమేశ్ యాదవ్(3/19), కుల్‌దీప్ యాదవ్(3/35) సమిష్టిగా చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో విండీస్-ఏ జట్టు 181 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ కవెమ్ హాడ్జ్(100 బంతుల్లో 51) ఒక్కడే రాణించాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అంతకు ముందు తొలిరోజు బ్యాటింగ్‌లో చతేశ్వర్ పుజారా(187 బంతుల్లో 100, రిటైర్డ్) సహా రోహిత్ శర్మ(115 బంతుల్లో 68) రాణించడంతో 297/5 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను భారత్ ఎలెవెన్ డిక్లేర్ చేసింది.

# మూడు పతకాలే..

## రెజ్లింగ్ చాంపియన్‌షిప్

**తాల్లిన్ (ఇస్తోనియా):** ప్రపంచ జూనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయారు. పురుషుల జట్టు మూడు పతకాలు సాధిస్తే.. మహిళలు మూడేండ్ల లో తొలిసారిగా రిక్తహస్తాలతో తిరుగుపయనమయ్యారు. ఆదివారం జరిగిన 77 కేజీల పోరులో సజన్ భన్వాల్ కాంస్యం సాధించాడు. అబ్దుర్ రహ్మాన్(టర్కీ)ని ఓడించిన భన్వాల్ పతకం గెలుచుకున్నాడు. అంతకు ముందు ఈ టోర్నీ పురుషుల ఫ్రీస్టైల్ 86 కేజీల విభాగంలో దీపక్ స్వర్ణం గెలుచుకోగా.. 92 కేజీల ఈవెంట్‌లో విక్కీ కాంస్యం చేజిక్కించుకున్నారు.

# బోల్ట్ రికార్డు బ్రేక్ చేస్తా


రామేశ్వర్ గుర్జర్


**భోపాల్:** కనీసం కాళ్లకు బూట్లు కూడా లేకుండా తారు రోడ్డుపై 100 మీటర్ల పరుగును 11 సెకన్లలో పూర్తిచేసి ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన రామేశ్వర్ గుర్జర్.. తనకు సరైన శిక్షణ ఇస్తే జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ రికార్డులను తిరగరాస్తానని అంటున్నాడు. మధ్యప్రదేశ్‌లోని శివ్‌పురి జిల్లా నర్వాల్ గ్రామానికి చెందిన 19 ఏండ్ల రామేశ్వర్‌ది వ్యవసాయ కుటుంబం. ఇటీవల అతడు రోడ్డుపై పరుగులు తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై స్పందించిన ఆ రాష్ట్ర మాజీ సీఎం శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ ఇటువంటి ప్రతిభావంతులకు అవకాశాలు కల్పిస్తే దేశానికి మంచి పేరుతెస్తారంటూ ఆ వీడియోను కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజుకు ట్విట్టర్ ద్వారా ట్యాగ్ చేశారు. వివరాలు తెలియజేస్తే అతడిని అథ్లెటిక్ అకాడమీలో చేరుస్తానని రిజిజు బదులిచ్చారు. ఈ సందర్భంగా రామేశ్వర్ మాట్లాడుతూ.. 'ఉసేన్ బోల్ట్ (9.58 సెకన్లు) పేరిట 100 మీటర్ల ప్రపంచ రికార్డు ఉంది. నా కు సరైన శిక్షణ, సదుపాయాలు కల్పిస్తే ఆ రికార్డును బ్రేక్ చేస్తాననే నమ్మకముంది' అని అన్నాడు.


రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పెంటథ్లాన్ పోటీల్లో సంగారెడ్డికి చెందిన రూపశ్రీ స్వర్ణ పతకం సాధించింది.

# సిద్ధార్థ్ వీరవిహారం

## హర్యానా స్టీలర్స్‌ను చిత్తు చేసిన తెలుగు టైటాన్స్.. ప్రొ కబడ్డీ లీగ్ 7వ సీజన్

**చెన్నై:** కబడ్డీ 'బాహుబలి' సిద్ధార్థ్ దేశాయ్ ఈ సీజన్‌లో తొలిసారి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంతో ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 40-29తో హర్యానా స్టీలర్స్‌ను చిత్తు చేసింది. ఈ పోరులో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన టైటాన్స్ ఎట్టకేలకు లీగ్‌లో రెండో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం 18 పాయింట్లు ఖాతాలో ఉన్న టైటాన్స్ పట్టికలో తొమ్మిదో స్థానానికి చేరింది. నలుపు దుస్తుల్లో బరిలో దిగిన మొదటి మ్యాచ్‌లోనూ గెలిచిన టైటాన్స్ మరోసారి బ్లాక్ డ్రెస్‌లో ఆడి ఆకట్టుకుంది. ప్రత్యర్థి కోర్టులో వీరవిహారం చేసిన సిద్ధార్థ్ (18 పాయింట్లు) టైటాన్స్‌ను ముందుండి నడిపించాడు. అతడికి సూరజ్ దేశాయ్ (6 పాయింట్లు) చక్కటి సహకారం అందించాడు. స్టీలర్స్ తరపు వికాస్ కండోలా 9 పాయింట్లు సాధించాడు. ప్రత్యర్థి రైడర్లు కూడా సత్తాచాటడంతో రైడింగ్‌లో ఇరు జట్లు దాదాపుగా సమానంగానే నిలిచినా.. ట్యాక్లింగ్‌లో టైటాన్స్ దుమ్మురేపడంతో అలవోకగా విజయం సాధించగలిగింది. తమిళ్ తలైవాస్, పుణెరీ పల్టన్ మధ్య జరిగిన మరో మ్యాచ్ 31-31తో 'డ్రా'గా ముగిసింది.




# వాణిజ్య

## ఇక ఏడాదికి మూడుసార్లు చమురుబావుల వేలం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** చమురు బావుల వేలం ఆలస్యమవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏడాది జరిగే వేలం ప్రక్రియను రెండు నుంచి మూడు వరకు పెంచడానికి సిద్ధమవుతున్నది. ఈ విషయాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్(డీజీహెచ్) వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 28 లక్షల చదరపు కిలోమీటర్ల మేర ఉన్న తీర ప్రాంతాల్లో చమురును గుర్తించిన కేంద్రం..వీటిని గడిచిన మూడేళ్లుగా వేలం వేస్తున్నది. ప్రస్తుతానికి ఏడాదిలో ఎప్పుడైన రెండుసార్లు చమురు బావులను వేలం వేస్తుండగా, వచ్చే ఏడాది నుంచి ఇది మూడుకు చేరుకోనున్నది. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి సంస్కరణల ఎజెండాను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు, అలాగే సులభతర వాణిజ్య విధానంలో భారత ర్యాంక్ మెరుగుపడిన నేపథ్యంలో ఈ వేలాన్ని రెండు నుంచి మూడుకు పెంచాలని నిర్ణయించినట్లు డీజీహెచ్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. గతంలో మే 15న మొదటిసారి, నవంబర్ 15న రెండోసారి వేలం వేసేవారు. ఈవోఐ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 1 నుంచి జూలై 31లోగా మొదటిసారి, ఆగస్టు 1 నుంచి నవంబర్ 30లోగా రెండోసారి, డిసెంబర్ 31 నుంచి మార్చి 31లోగా మూడోసారి వేలం వేయనున్నారు. గతంలో నిర్వహించిన వేలంలో 87 బావులు ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలు చేజిక్కించుకున్నాయి. చమురు దిగుమతులను 10 శాతం తగ్గించుకోవాలని చూస్తున్న మోదీ సర్కార్.. 2022 నాటికి 67 శాతానికి, 2030 నాటికి 50 శాతానికి కట్టడి చేయాలనుకుంటున్నది.

# అయ్యయ్యో.. ఆటో రంగం







ఆర్థిక మాంద్యం హాహాకారం

### సంక్షోభంతో అమ్మకాలు డల్.. పెట్టుబడులు నిల్.. కష్టాలు ఫుల్
### ఉత్పాదక కేంద్రాల్లో వర్క్ హాలిడేలు.. లక్షలాది ఉద్యోగాలు మాయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:**

ఆర్థికమాంద్యం దెబ్బకు దేశీయ ఆటో రంగం అతలాకుతలమవుతున్నది. అమ్మకాలు లేక వెలవెలబోతున్న సంస్థలు.. వర్క్ హాలిడేలను ప్రకటిస్తున్నాయి. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఉద్యోగులను తొలగిస్తుండగా, పెట్టుబడులనూ తగ్గించేస్తున్నాయి. దేశీయ ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ ఈ నెల 15 నుంచి 18 వరకు ఉత్పత్తిని నిలిపివేసింది. మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో తయారీ ప్లాంట్లను మూసేసింది. టాటా మోటర్స్ సైతం ఈ నెల 16, 17 తేదీలను వర్క్ హాలిడేలుగా ప్రకటించింది. ఇప్పటికే ఈ నెల 1న, 8 నుంచి 10 వరకు వాహనాల తయారీని సంస్థ ఆపేసింది. దీంతో పుణె, జంషెడ్‌పూర్ ప్లాంట్లు తెరుచుకోలేదు. వాణిజ్య వాహనాల తయారీ దిగ్గజం అశోక్ లేలాండ్ కూడా గడిచిన రెండు నెలల్లో 9 రోజులు ఉత్పత్తిని నిలిపివేసింది. ఈ నెలలో 17, 19 తేదీలను ఉత్పత్తి విరామంగా ప్రకటించింది. ఇదే క్రమంలో టీవీఎస్ మోటర్ 16, 17 తేదీల్లో తయారీని ఆపేయగా, టయోటా 8 రోజులు నిలిపివేసింది. తమిళనాడు, మహారాష్ట్రల్లోని ప్లాంట్లలో 13 రోజులు ఉత్పత్తిని ఆపేస్తున్నట్లు బాష్ ప్రకటించింది. అలాగే వాబ్కో 19, జమ్నా ఆటో 20 రోజుల చొప్పున తయారీని నిలిపేస్తున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా కూడా ప్రస్తుత మార్కెట్ మందగమనం దృష్ట్యా వర్క్ హాలిడేలను ప్రకటించింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా ఉన్న తమ ప్లాంట్లలో 8 నుంచి 14 రోజులు వాహన తయారీని ఆపేస్తున్నట్లు స్పష్టం చేసింది. హ్యూందాయ్ మోటర్ కూడా శ్రీపెరంబుదూర్ ప్లాంట్లో ఉత్పత్తిని ఆపేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెలలో విడుతలవారిగా తయారీకి విరామం ఇస్తున్నట్లు తెలియజేసింది. కాగా, మొత్తం ఈ ఏప్రిల్-జూలై ఉత్పత్తి 12,13,281 యూనిట్లుగా ఉన్నదని, గతేడాది ఏప్రిల్-జూలైలో 13,97,404 యూనిట్లుగా ఉందని భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) పేర్కొన్నది. మారుతి ఉత్పత్తి 18.06 శాతం తగ్గగా, మహీంద్రా 10.65 శాతం, ఫోర్డ్ 25.11 శాతం, టాటా 20.37 శాతం, హోండా 18.86 శాతం, టయోట 20.98 శాతం మేర పడిపోయాయి. ఇకపోతే ద్విచక్ర వాహనాల విభాగంలోనూ ఇదే రకమైన పరిస్థితులు కనిపించాయని సియామ్ స్పష్టం చేసింది. టూవీలర్ సంస్థల మొత్తం ఉత్పత్తి 9.96 శాతం పతనమైంది. గతంతో పోల్చితే 87,13,476 యూనిట్ల నుంచి 78,45,675 యూనిట్లకు క్షీణించాయి. మార్కెట్ లీడర్ హీరో మోటోకార్ప్ ఉత్పత్తి 12.03 శాతం, హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా 18.5 శాతం, టీవీఎస్ మోటర్ 8.07 శాతం, రాయల్ ఎన్‌ఫీల్డ్ 22.35 శాతం తయారీని తగ్గించేశాయి.

#### పెరుగుతున్న ఉద్యోగ కోతలు

మునుపెన్నడూ లేనివిధంగా ఆటో పరిశ్రమలో నెలకొన్న విపత్కర పరిస్థితులు.. ఉద్యోగుల ఉసురు తీస్తున్నాయి. గడిచిన 2-3 నెలల్లో వాహన తయారీ సంస్థల్లో దాదాపు 15 వేల మంది కార్మికులు ఉపాధిని కోల్పోగా, దేశవ్యాప్తంగా డీలర్‌షిప్‌లలో ఏకంగా 2 లక్షల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. రిటైలర్లూ నిర్వహణ భారాన్ని తగ్గించుకునేందుకు ఉద్యోగుల్ని తొలగిస్తున్నారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఉద్యోగుల్ని తొలగించడానికే ఆటోమొబైల్ డీలర్లు మొగ్గు చూపుతున్నారని ఆటోమొబైల్ డీలర్ సంఘాల సమాఖ్య (ఎఫ్ఏడీఏ) చెబుతున్నది. రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాలు పోయే వీలుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నది. దేశవ్యాప్తంగా 15 వేల డీలర్లు 26 వేల ఆటోమొబైల్ షోరూంలను నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా దాదాపు 25 లక్షల మంది, పరోక్షంగా మరో 25 లక్షల మంది ఉపాధిని పొందుతున్నారు. అయితే ఆటో పరిశ్రమలో ఇప్పుడు నెలకొన్న మందగమన పరిస్థితులు.. డీలర్లను వ్యాపారానికి స్వస్తి పలికేలా చేస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసిన 18 నెలల్లో దేశవ్యాప్తంగా 271 నగరాల్లోగల 286 షోరూంలు మూతబడ్డాయంటే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీటిలో దాదాపు 32 వేల ఉద్యోగులు పనిచేస్తుండగా, ఇప్పుడు వారంతా రోడ్డున పడ్డారు. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలతోపాటు ప్రధాన నగరాల్లోగల ఔట్‌లెట్లనూ మూసి వేస్తున్నారని ఎఫ్ఏడీఏ అధ్యక్షుడు ఆశిష్ హర్షరాజ్ కాలే తెలిపారు. చాలా డీలర్‌షిప్‌లలో 7-8 శాతం ఉద్యోగాల్లో కోత పడిందని వివరించారు.

#### స్తంభించిన పెట్టుబడులు

అమ్మకాల పతనం ప్రభావం.. పరిశ్రమలోని పెట్టుబడులపైనా పడుతున్నది. ఆటో కంపోనెంట్ సంస్థలు తమ పెట్టుబడులను భారీగా తగ్గించేస్తున్నాయి. కొన్ని సంస్థలు పెట్టుబడుల ప్రతిపాదనల్ని వెనక్కి కూడా తీసుకుంటున్నాయి. భారత్ ఫోర్జ్, లూమాక్స్ ఇండస్ట్రీస్ తదితర ప్రధాన సంస్థల పెట్టుబడులు పడిపోయాయి. ఈ మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం (2018-19)లో లూమాక్స్ పెట్టుబడులు రూ.94 కోట్లకు తగ్గాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం లో రూ.162 కోట్ల పెట్టుబడులను పెట్టింది. గతేడాది నవంబర్ నుంచి అమ్మకాలు తిరోగమనంలో పడిన విషయం తెలిసిందే. గత 20 ఏండ్లలో ఎప్పుడూ ఈ స్థాయిలో పరిశ్రమ ఇబ్బందులో పడలేదని సియామ్ చెబుతున్నది. తాజా పరిస్థితులు 10 లక్షల ఉద్యోగాలను ప్రమాదంలో పడేశాయని తెలిపింది.

### పన్ను మినహాయింపులివ్వాలి: మారుతి

దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతి సుజుకీ.. హైబ్రిడ్, సీఎన్‌జీ కార్ల కోసం పన్నుల నుంచి ఉపశమనాన్ని కోరుతున్నది. కాలుష్య నియంత్రణ, ఇంధన వినియోగం తగ్గింపు కోసం విద్యుత్ ఆధారిత వాహనాల (ఈవీ)కు పన్ను మినహాయింపులు ఇవ్వడం సరైనదేనన్న మారుతి చైర్మన్ ఆర్‌సీ భార్గవ.. హైబ్రిడ్, సీఎన్‌జీ కార్లకూ ఆ తరహా ప్రోత్సాహకాలు అవసరమని అభిప్రాయపడ్డారు. హైబ్రిడ్ కార్లు 25 నుంచి 30 శాతం ఇంధనాన్ని ఆదా చేస్తాయని, ముడి చమురు దిగుమతులు చాలావరకు తగ్గుతాయన్నారు. ఈవీలపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను 5 శాతానికి కోత పెట్టిన విషయం తెలిసిందే. కానీ పెట్రోల్, డీజిల్ వాహనాలు, హైబ్రిడ్ కార్లపై అత్యధికంగా 28 శాతం పన్ను పడుతున్నది. మందగించిన అమ్మకాల నడుమ మారుతి సుజుకీ 3 వేల మందికిపైగా తాత్కాలిక ఉద్యోగులను తొలగించిన సంగతి విదితమే.

మునుపెన్నడూ లేనివిధంగా దేశ ఆటో పరిశ్రమలో నెలకొన్న విపత్కర పరిస్థితులను అధిగమించడానికి ఉద్దీపనలు అవసరమని మహీంద్రా అండ్ మహీంద్రా ఎండీ పవన్ గోయెంకా అన్నారు. నీరసించిన అమ్మకాలు, ఉద్యోగుల తొలగింపులు ఆటో రంగంపై ఆందోళన కలిగిస్తున్నదని చెప్పారు. ఆటోమోటివ్ సరఫరాదారులు, డీలర్‌షిప్‌లలోనే ఉద్యోగాల కోత ఎక్కువగా ఉందన్న ఆయన వాహన ఉత్పత్తి సంస్థల్లో తక్కువగానే ఉందన్నారు. అయితే వర్క్ హాలిడేలతో వ్యయ భారం పెరిగిపోతున్నదని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందేనన్న అభి

### ఉద్దీపనలు అవసరం: మహీంద్రా



ప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి దాకా తాము దాదాపు 1,500 మంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించామన్న ఆయన ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉద్దీపనలు అందించకపోతే వ్యాపారం పడిపోయి, నిరుద్యోగం పెరిగిపోయి ఆర్థిక వ్యవస్థ బలహీనపడటం ఖాయమన్నారు.

## అపోలోతో ఈఈఎస్ఎల్ ఒప్పందం

### దేశవ్యాప్తంగా ఆస్పత్రుల వద్ద విద్యుత్ వాహనాల చార్జింగ్ స్టేషన్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** ప్రభుత్వ రంగ ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్).. అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్‌తో చేతులు కలిపింది. దేశవ్యాప్తంగా అపోలో ఆస్పత్రుల వద్ద పబ్లిక్ ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకుగాను పదేండ్ల ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ఆదివారం ఈఈఎస్ఎల్ తెలియజేసింది. 'ఓ ప్రైవేట్ భాగస్వామితో ఈఈఎస్ఎల్ ఒప్పందం చేసుకోవడం ఇదే తొలిసారి. దేశీయంగా పబ్లిక్ చార్జింగ్ సదుపాయాల ఏర్పాటు కోసం ఈ ఎంవోయూను చేసుకున్నాం' అని ఓ ప్రకటనలో ఈఈఎస్ఎల్ తెలియజేసింది. ఈ ఎంవోయూలో భాగంగా చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం ఈఈఎస్ఎల్ మొత్తం పెట్టుబడులను పెట్టనున్నది. వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి విద్యుత్ ఆధారిత వాహనాలు ఎంతగానో దోహదపడుతాయన్న ఈఈఎస్ఎల్.. వాటి చార్జింగ్ సదుపాయాలను మెరుగుపర్చేందుకు నడుం బిగించినట్లు తెలిపింది.

## ఐబీసీ కింద మైక్రో రుణాల రద్దు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** మైక్రో ఫైనాన్స్ రుణగ్రహీతలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. దివాలా చట్టం (ఐబీసీ) కింద వీరి రుణాలను రద్దు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. కార్పొరేట్ వ్యవహారాల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ వివరాల ప్రకారం ఈ మేరకు మైక్రో ఫైనాన్స్ (సూక్ష్మ రుణాలు) సంస్థలతో చర్చలు జరుగుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈడబ్ల్యూఎస్)కు చెందిన రుణ గ్రహీతలకు సాయం అందించేందుకే ఇదంతా అని ఆయన చెప్పారు. కాగా, 'ఫ్రెష్ స్టార్ట్' పేరుతో తెస్తున్న ఈ రుణాల రద్దులో ఒకసారి లబ్ధి పొందినవారు ఐదేండ్లదాకా మళ్లీ ఆ సాయాన్ని అందుకోలేరన్నారు. మూడు, నాలుగేండ్లలో జాతీయ స్థాయిలో రూ.10 వేల కోట్లకు మించకుండా రుణాల రద్దు చేసే వీలుందని శ్రీనివాస్ తెలిపారు.

## రుణాలకు గిరాకీ లేదు

- ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపనలు అవసరం
- ఎస్బీఐ చైర్మన్ రజ్నీశ్ కుమార్



**కోల్‌కతా, ఆగస్టు 18:** మార్కెట్‌లో క్రెడిట్ డిమాండ్ ఇంకా అంతంతమాత్రంగానే ఉన్నదని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ చైర్మన్ రజ్నీశ్ కుమార్ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపనల అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ.. రుణాలపై బ్యాంకుల వడ్డీరేట్లు తగ్గాయని గుర్తుచేశారు. బ్యాంకుల నుంచి రుణాల విషయంలో ఎలాంటి ఆటంకాలూ లేవని, రుణ లభ్యత పుష్కలంగానే ఉన్నా.. డిమాండ్ కరువైందని చెప్పారు. రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నా.. తీసుకునేవారే లేరన్న ఆయన ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపనల అవసరం ఉందన్నారు. కాగా, దేశవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురిస్తే రుణాల మంజూరు ఊపందుకోవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాబోయే పండుగ సీజన్‌లోనూ రుణాలకు డిమాండ్ పెరిగే వీలుందన్నారు.

**ఈసారి 12-14 శాతం వృద్ధి**

ఈ ఆర్థిక సంవత్సరం (2019-20)లో రుణ వృద్ధిరేటు 12 నుంచి 14 శాతంగా నమోదు కావచ్చని ఈ సందర్భంగా కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2018-19) 14 శాతంగా ఉందన్నారు. కోల్‌కతా రీజియన్‌లో ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్లతో సమావేశం కావడానికి కుమార్ ఇక్కడకు వచ్చారు. ఎస్బీఐ లోన్ పోర్ట్‌ఫోలియో దాదాపు రూ.23 లక్షల కోట్లుగా ఉన్నది. వచ్చే ఐదేండ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు తీసుకెళ్లాలన్న కేంద్ర ప్రభుత్వ ఆశయ సాధనలో భాగంగా బ్యాంకింగ్ రంగ పనితీరును సమీక్షించుకుని, మెరుగు పర్చుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించింది. దీంతో అన్ని బ్యాంకులు శాఖాధిపతుల సమావేశాలను నిర్వహిస్తున్నాయి.

**ఆటో రంగానికి చేయూత**

ఒత్తిడిలో ఉన్న ఆటో రంగాన్ని ఆదుకోవడంలో భాగంగా ఆటోమొబైల్ డీలర్ల రుణ వ్యవధిని పొడిగించినట్లు ఎస్బీఐ ఎండీ (రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) ఆదివారం ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ తెలిపారు. సాధారణంగా క్రెడిట్ పీరియడ్ 60 రోజులు ఉంటుందని, దీన్ని 75 రోజులకు పెంచామన్న ఆయన కొన్ని కేసుల్లో 90 రోజుల వెసులుబాటును కల్పించామని పేర్కొన్నారు.

## తొలి దశ ముగిసెన్..

### పనితీరుపై పూర్తయిన ప్రభుత్వ బ్యాంకుల సమాలోచనలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పనితీరుపై ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్వహించిన రెండు రోజుల సమీక్షా సమావేశాలు ఆదివారం ముగిశాయి. దేశ ఆర్థిక వ్యవస్థను ఐదేండ్లలో 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగంగానే ఈ సమాలోచనలు జరిగాయి. జీడీపీని గాడిలో పెట్టేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచనల మేరకే బ్యాంకులు తొలి దశలో భాగంగా శని, ఆదివారాల్లో చర్చలు నిర్వహించాయి. ఎస్బీఐ, పీఎన్‌బీ, బీవోబీ, కెనరా బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, ఐవోబీ తదితర బ్యాంకులు రివ్యూలను జరిపాయి. వృద్ధిరేటు బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి చర్యలు తీసుకోవాలని.. ప్రాంతాలవారీగా బ్రాంచ్ మేనేజర్లతో బ్యాంకులు ఈ సమావేశాలు ఏర్పాటు చేశాయి. వారి సమస్యలు, వ్యాపారాభివృద్ధికి వారిచ్చిన సలహాలను ఉన్నతాధికారులు తీసుకున్నారు. డిజిటల్ పేమెంట్ల పెంపు, మెరుగైన కార్పొరేట్ గవర్నెన్స్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు రుణ సదుపాయం, రిటైల్ లెండింగ్, వ్యవసాయ రుణాలు తదితర అంశాలే ఎంజెడాగా ఈ సమావేశాలు జరిగాయి.

**ఎస్బీఐ...**



17 సర్కిళ్లలోగల 502 ప్రాంతీయ వ్యాపార కార్యాలయాల్లో ఎస్బీఐ సమావేశాలు జరిగాయి. 15 వేల మందికిపైగా అధికారులు ఇందులో పాల్గొన్నట్లు ఎస్బీఐ ఎండీ పీకే గుప్తా తెలిపారు. హైదరాబాద్ సర్కిల్‌లో బ్రాంచ్-రీజినల్ స్థాయిల్లో చర్చలు జరిగాయని, మొత్తం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్రాంతీయ వ్యాపార కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించామని బ్యాంక్ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాశ్ మిశ్రా ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ ప్రాధాన్యాలు, వృద్ధిరేటు పురోగతి వంటి అంశాలపై సమాలోచనలు జరిగాయని పేర్కొన్నారు.

**కెనరా బ్యాంక్....**



ప్రస్తుతం బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు-సమస్యలపై చర్చించినట్లు ఓ ప్రకటనలో కెనరా బ్యాంక్ స్పష్టం చేసింది. వృద్ధిరేటు కోసం చేపట్టాల్సిన చర్యలు, వ్యాపార, పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ, ఎగుమతులు, విద్య, వ్యవసాయ రంగాలకు రుణాల మంజూరు, ప్రభుత్వ రంగ పథకాలకు నిధులను సమకూర్చడం, డిజిటల్ లావాదేవీలకు ఊతం వంటి వాటిపై చర్చలు జరిగాయి.

**ఓరియంటల్ బ్యాంక్...**

శాఖల పనితీరు, రుణాల మంజూరులో ప్రాధాన్యతలు వంటి అంశాలపై చర్చించామని ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ) తెలియజేసింది. స్వచ్ఛ భారత్, మహిళా సాధికారత, ముద్ర రుణాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యతలపై అభిప్రాయాలను సేకరించామని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సందర్భంగా నందన్ నీలేకనీ, ఉదయ్ కొటక్, యూకే సిన్హా, ఆదిత్యా పురి, చరణ్ సింగ్ వంటి ప్రముఖుల సూచనల అమలుపై చర్చించినట్లు వెల్లడించింది.

## ఖతాదారులకు మెరుగైన సేవలు: బీవోబీ

**హైదరాబాద్, ఆగస్టు 18:** ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి తమ పనితీరును మెరుగుపరుచుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ప్రకటించింది. ఆర్థిక వృద్ధితోపాటు మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ, విద్యా, ఎగుమతులు, మహిళా సాధికారిత లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు బీవోబీ హైదరాబాద్ జనరల్ మేనేజర్ పీ శ్రీనివాస్ తెలిపారు. బ్రాంచ్‌ల పనితీరుపై రెండురోజులపాటు జరిగిన సమావేశం ఆదివారం ముగిసింది. ఎన్‌పీఏలను తగ్గించడంలో ప్రాంతీయ శాఖలు కీలకపాత్ర పోషించాయని, ఇవి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి బ్యాంక్ ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. నూతన సేవలు అందించడంలోభాగంగా టెక్నాలజీ రంగానికి పెద్దపీట వేయనున్నట్లు ప్రకటించిన బ్యాంక్..రైతులు, చిన్నస్థాయి వ్యాపారవేత్తలు, యువత, విద్యార్థులు, మహిళల అవసరాలనిమిత్తం సేవలను విస్తృత పరుచనున్నట్లు చెప్పారు. నగదు బదిలీ, నగదు రహిత సేవలు, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి బ్యాంక్ అన్ని విధాలుగా కృషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

## గ్లోబల్ మార్కెట్లే ఆధారం

### ఈ వారం మార్కెట్ సరళిపై నిపుణుల అంచనా




**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు ఈవారంలో తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశ ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటంతో గడిచిన కొన్ని వారాలుగా దిగువముఖం పట్టిన సూచీలకు..ఈవారంలో అంతర్జాతీయంగా జరుగనున్న పరిణామాలు కీలకంకానున్నాయని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా విదేశీ పెట్టుబడిదారుల సరళి, అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య చర్చలు, చమురు, రూపాయి కదలికలు మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలని పేర్కొన్నారు. మందగిస్తున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకోనున్న చర్యలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు ముగియడంతో ఇక దేశీయ, అంతర్జాతీయంగా జరుగనున్న పరిణామాలు మార్కెట్లకు కీలకమని స్యామ్‌కో సెక్యూరిటీస్ అండ్ స్టాక్ నోట్ ఫౌండర్, సీఈవో జిమీట్ మమోదీ వ్యాఖ్యానించారు. ఈవారంలో దేశీయంగా ఎలాంటి ప్రభావితం చేసే అంశాలు లేకపోవడంతో గ్లోబల్‌గా జరిగే పరిణామాలపై మదుపరులు దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. గతవారంలో సెన్సెక్స్ 231.58 పాయింట్లు లాభపడింది.

**84 వేల కోట్లు పడిపోయిన బ్లూచిప్ సంస్థల విలువ**

గతవారంలో దేశీయ బ్లూచిప్ సంస్థలకు నిరాశనే మిగిల్చింది. ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) కలుపుకొని టాప్-10 కంపెనీల్లో తొమ్మిది రూ.84,354.91 కోట్ల మేర మార్కెట్ వాటాను కోల్పోయాయి. ఈ సంస్థల్లో ఒక రిలయన్స్ ఇండస్ట్రీస్ మాత్రమే కోలుకున్నది. ఆర్ఐఎల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.72,153.08 కోట్లు పెరిగి రూ.8,09,755.16 కోట్లకు చేరుకున్నది. టీసీఎస్‌తోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్(హెచ్‌యూఎల్), హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఐటీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐల మార్కెట్ విలువ పడిపోయింది. టీసీఎస్ రూ.30,807.10 కోట్లు కోల్పోయి రూ.8,11,828.43 కోట్ల వద్ద ముగిసింది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ విలువ రూ.19,495.4 కోట్లు కోల్పోగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.15,065.80 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.6,700.27 కోట్లు, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.6,525.48 కోట్లు, హెచ్‌యూఎల్ రూ.2,954.95 కోట్లు, ఐటీసీ రూ.1,657.41కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.790.71 కోట్లు, ఎస్బీఐ రూ.356.99 కోట్లు ఎం-క్యాప్‌ను తగ్గాయి.

### రూ.8,319 కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి

విదేశీ పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణలు కొనసాగుతున్నాయి. ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు దేశీయ ఈక్విటీ, డెబిట్ మార్కెట్ల నుంచి రూ.8,319 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. విదేశీ పోర్ట్‌పోలియో ఇన్వెస్టర్లపై విధించిన పన్నుపై అనిశ్చితి కొనసాగుతుండటం, అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటం ఇందుకు కారణం. ఈ నెల 1 నుంచి 16 వరకు ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.10,416.25 కోట్లను వెనక్కి తీసుకున్న ఎఫ్‌పీఐలు..డెబిట్ మార్కెట్లలో మాత్రం రూ.2,096.38 కోట్లను చొప్పించారు. ప్రస్తుత నెలలో జరిగిన పది ట్రేడింగ్ రోజుల్లో తొమ్మిది రోజులు ఎఫ్‌పీఐలు నిధులను ఉపసంహరించుకోవడానికి మొగ్గుచూపినట్లు మార్నింగ్‌స్టార్ సీనియర్ విశ్లేషకులు హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు. జూలై నెలలోనూ రూ.2,985.88 కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్న విషయం తెలిసిందే. ఎఫ్‌పీఐలపై అధిక పన్నును విధిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ప్రకటించడంతో విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రస్థాయికి పెంచింది. ఫలితంగా అప్పటి నుంచి ఇప్పటి వరకు నిధులను తరలించుకుపోవడానికి మొగ్గుచూపుతున్నారని వెల్లడిస్తున్నారు.

## 2,500 కోట్లు వసూల్ చేస్తాం

### రుణాల రికవరీపై బీవోఐ ఈడీ చైతన్య

**హైదరాబాద్, ఆగస్టు 18:** ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ)..మొండి బకాయిలను తగ్గించుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. వచ్చే ఆరు నుంచి తొమ్మిది నెలల్లో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) కింద ఉన్న 10 అతిపెద్ద మొండి బకాయిలను పరిష్కరించడం ద్వారా రూ.2,500 కోట్ల వరకు రుణాలు రికవరీ కాగలవని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీజీ చైతన్య ఆశాభావం వ్యక్తంచేశారు. వీటిలో అతిపెద్ద కేసులు ఇప్పటికే కొలిక్కి వచ్చాయని, మరో రెండు నుంచి మూడు త్రైమాసికంలో మొత్తం కేసులను పరిష్కరించగల ధీమాను ఆయన వ్యక్తంచేశారు. బ్యాంక్ మొండి బకాయిల్లో అతిపెద్దవి 8 నుంచి 10 గుర్తించినట్లు, వీటిని ఇప్పటికే ఎన్‌సీఎల్‌టీకి అప్పగించడం జరిగిందని, వీటికి పరిష్కారం లభిస్తే బ్యాంక్ రూ.1,500 కోట్ల లాభాన్ని గడించే అవకాశం ఉంటుందన్నారు. మొండి బకాయిలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్న బ్యాంక్..ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నదని, ఈ జాబితాలోకి కొత్త రుణాలు వచ్చే అవకాశాలు లేవని ఆయన స్పష్టంచేశారు. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు-సమస్యలపైన చర్చించడానికి హైదరాబాద్‌లో జరుగుతున్న రెండు రోజుల జోనల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇలా ప్రభుత్వ రంగ బ్యాంక్ వర్గాలు చర్చించడం ఇదే తొలిసారని పేర్కొన్న ఆయన.. వ్యాపారాభివృద్ధి, మరింతగా రుణాల పంపిణీలపై దృష్టి పెట్టడంలో భాగంగా వయోవృద్ధులు, రైతులు, చిన్న స్థాయి పరిశ్రమలు, యువత, మహిళలకు పెద్దపీట వేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో డిజిటల్ పేమెంట్స్, కార్పొరేట్ పాలన మరింత పారదర్శకంగా ఉండటం, రిటైల్, ఎంఎస్ఎంఈ, వ్యవసాయం, ఎగుమతుల రంగాలకు ప్రత్యేకంగా రుణాలు ఇవ్వడంతో 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవడానికి మరింత సులభతరం అవుతుందన్నారు.



పీపుల్స్‌ప్లాజాలో జాతీయ ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

## ఉద్యానమేళాకు విశేష స్పందన

పోటెత్తిన నగరవాసులు.. నెక్లెస్‌రోడ్‌లో కోలాహలం ■ ఇంటిపంటలకు ఊతం.. దేశవాళీ విత్తనకిట్లపై ఆసక్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజా వేదికగా నిర్వహిస్తున్న 7వ జాతీయ ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శన ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతున్నది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉద్యానశాఖ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఈవెంట్ ఆర్గనైజర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదురోజులపాటు నిర్వహిస్తున్న ఉద్యాన మేళా జంటనగరాలకు చెందిన ఉద్యాన ప్రేమికులతో కిటకిటలాడుతున్నది. గతంలో కంటే భిన్నంగా ఈసారి అన్ని రకాల దేశీయ కూరగాయలు, పూలు, పండ్ల విత్తనాలు, మొక్కల నర్సరీలు, సేంద్రియ ఉత్పత్తులు, విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొత్తం వందకు పైగా స్టాళ్లు ఈ మేళాలో కొలువుదీరాయి. తెలంగాణ రాష్ట్ర ఉద్యానశాఖ ఇటీవల మిద్దెతోటల సాగుపై ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి, ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో మిద్దెతోటలకు సంబంధించిన విత్తనాలు, మొక్కలను నగర ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## హైకోర్టు ఆవరణలో ఘనంగా బోనాల పండుగ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైకోర్టు ఆవరణలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు ఆవరణలోని అమ్మవారి దేవాలయంలో ఆదివారం పెద్ద ఎత్తున మహిళలు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ పూజలు చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సునీల్‌గౌడ్, సభ్యులు గండ్ర మోహన్‌రావు, యూఖీద్, సీహెచ్ వెంకట్‌యాదవ్, అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ కే లక్ష్మణ్, హైకోర్టు బార్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రజనీకాంత్, జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు, చిత్రంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్



# బహుజన వీరుడు పాపన్న

- అధికారికంగా పాపన్న జయంతి నిర్వహించేందుకు కృషి
- సీఎంతో చర్చించి ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటుకు చొరవ
- పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి



చిక్కడపల్లిలో పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్



మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలవేస్తున్న మంత్రి దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ చిక్కడపల్లి/ పాలకుర్తి/ తొర్రూరు:** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ బహుజన విప్లవ వీరుడని, 300 ఏండ్ల క్రితం అప్పటి నిరంకుశపాలనకు ఎదురునిల్చి బడుగు బలహీనవర్గాలను ఏకంచేశారని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఏకంగా 32 కోటలను జయించి, ప్రజారంజక పాలనను అందించిన గొప్ప చక్రవర్తి అని కీర్తించారు. పాపన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు తనవంతు కృషిచేస్తానని చెప్పారు. పాపన్నగౌడ్ 369వ జయంతి సందర్భంగా ఆదివారం తెలంగాణ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ బడుగుబలహీనవర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. పాపన్నగౌడ్ నిర్మించిన కోటలు ఖిలాషాపూర్, జఫర్‌గఢ్, భువనగిరి, తాడికొండ కోటలను పర్యాటక, సాంస్కృతిక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఇప్పటికే నిధులు కేటాయించారని తెలిపారు. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ బహుజనులంటే బలహీ వర్గాలు కాదని బలమైనవర్గాలని చాటిచెప్పాలన్నారు. తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, కల్లుగీత కార్మికసంఘం అధ్యక్షుడు కే నాగరాజుగౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీ మురళీధర్‌రావు, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, రాంనగర్ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**స్వయం పాలనకు మారుపేరు: ఎర్రబెల్లి**

తెలంగాణలో స్వయంపాలనకు సర్దార్ సర్వాయి పాపన్న మారుపేరుగా నిలిచారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రవు అన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటుకు సీఎం కేసీఆర్‌తో చర్చిస్తానని చెప్పారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తిలో, మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో పాపన్న విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి కాంస్య విగ్రహం పాలకుర్తిలో తానే ఏర్పాటుచేయించానని గుర్తుచేశారు. చాకలి ఐలమ్మ మార్కెట్ యార్డులో మంత్రి ఎర్రబెల్లి మొక్కలు నాటారు. తొర్రూరులో మంత్రి దయాకర్‌రావును గౌడ సంఘాల ప్రతినిధులు శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, డీఎస్పీ మదన్‌లాల్, జెడ్పీటీసీ సభ్యులు పుస్కురి శ్రీనివాసరావు, మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ గుండె బాబు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలోనే బ్రాహ్మణ సంక్షేమం

- వీవోఈఎస్ కింద 54 మందికి రూ.10.80 కోట్ల ఆర్థికసాయం
- మంజూరుపత్రాలు ఇచ్చిన శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



వీవోఈఎస్‌కు ఎంపికైన లబ్ధిదారులకు ఆర్థికసాయం మంజూరు పత్రాలను అందజేస్తున్న స్పీకర్ పోచారం. చిత్రంలో టీబీఎస్పీ చైర్మన్ కేవీ రమణాచారి మాజీ ఎంపీ లక్ష్మీకాంతారావు కూడా ఉన్నారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సీఎం కేసీఆర్ పాలనలోనే బ్రాహ్మణుల సంక్షేమం జరుగుతున్నదని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ధార్మికభవన్‌లోని ధ్యాన మందిరంలో ఆదివారం వివేకానంద ఓవర్సీస్ విద్యా పథకం (వీవోఈఎస్) కింద అర్హులైన 54 మంది లబ్ధిదారులకు రూ.10.80 కోట్ల ఆర్థికసాయం మంజూరుపత్రాలను స్పీకర్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పోచారం మాట్లాడుతూ.. బ్రాహ్మణుల్లో పేదలున్నారని గుర్తించింది తెలంగాణ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్ ప్రత్యేకదృష్టితో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ఏర్పాటుచేసి బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. ఆ సమాజంలో విద్యావంతులకే ఎక్కువ గౌరవం ఉంటుందని, వేదాలు చదివిన బ్రాహ్మణులను ఎవరైనా గౌరవించాల్సిందేనని, అందుకే వేదికల మీదికి డబ్బున్న వారిని కాకుండా సరస్వతీ పుత్రులనే పిలుస్తారని వివరించారు. తెలంగాణలో అన్నివర్గాలవారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అన్ని మతాలకు సమప్రాధాన్యమిస్తున్న సీఎం కేసీఆర్ యాదాద్రిని అద్భుతంగా నిర్మిస్తున్నారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. పేదరికంలో ఉన్న బ్రాహ్మణుల ఆర్థిక ప్రగతికి సంక్షేమ పరిషత్‌ను ఏర్పాటుచేసి నిధులు మంజూరు చేశారని చెప్పారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి మాట్లాడుతూ.. విదేశీ విద్యకు అర్హులైన విద్యార్థులు 54 మందిలో అమెరికాకు 27 మంది, ఆస్ట్రేలియాకు 12 మంది, కెనడా 8 మంది, జర్మనీకి నలుగురు, యూకేకు ఇద్దరు, ఫ్రాన్స్‌కు ఒకరు వెళ్తున్నట్టు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థులకు రూ.20 లక్షలు ఆర్థికసాయం అందిస్తున్నామని, విద్యార్థులు వచ్చే నెల 20 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. టీబీఎస్పీ ఏర్పాటుచేయడంతోనే అధిక నిధులు మంజూరుచేశామని సంస్థ వైస్‌చైర్మన్ వనం జ్వాలానరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో టీబీఎస్పీ సభ్యులు మృత్యుంజయశర్మ, అష్టకాల రామ్మోహన్‌రావు, జోషి గోపాలశర్మ, బండారు శేషగిరిరావు (బండకాడి శేషు), ఎస్ సుమలతశర్మ, సువర్ణ సులోచన, ఎం వెంకటరమణశర్మ, బీ హనుమంతాచార్యులు, సభ్య కార్యదర్శి వీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

- స్నేహితుల్లా నమ్మిస్తూ మోసగిస్తున్నారు .. కస్టమ్స్ పేరుతో దోచుకొంటున్నారు
- డబ్బు ఆశ చూపి పెద్ద మొత్తంలో లాక్కొంటున్న మోసగాళ్లు

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సోషల్ మీడియాలో అమాయకులను ఎంచుకొని ఫ్రెండ్‌షిప్ చేసి.. వారిని తమ మోసపూరిత పథకాలకు బలిపశువులుగా మారుస్తున్నారు. గిఫ్ట్ పంపాను.. కస్టమ్స్ నుంచి విడిపించుకోమంటూ ఒకరు మోసం చేయగా.. పెద్ద మొత్తంలో డబ్బును కస్టమ్స్ వాళ్లు పట్టుకొన్నారు.. విడిపించుకొనేందుకు డ్యూటీ చెల్లించమంటూ మరొకరు దోపిడీకి పాల్పడ్డారు. ఇలాంటి మోసాలు నిత్యకృత్యంగా మారుతున్నా.. సైబర్ నేరగాళ్లను నమ్మి మోసపోతూనే ఉన్నారు. సోషల్ మీడియా అకౌంట్ల నుంచి వివరాలు సేకరించి మోసాలకు పాల్పడుతున్న మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సైబర్‌క్రైం పోలీసులు సూచిస్తున్నారు.

### అయామ్ చార్లెస్ ఫ్రం లండన్.. నీ ఫ్రెండ్‌ను

నా గుర్తుగా గిఫ్ట్ పంపుతున్నా అంటూ 1.8 లక్షల టోకరా

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హాయ్. అయామ్ చార్లెస్ ఫ్రం యూకే. నీ కాలేజ్‌మేట్‌ని అంటూ వెస్ట్‌మారేడ్‌పల్లికి చెందిన ఒక యువతికి వచ్చిన వాట్సాప్ మెసేజ్ రూ.1.8 లక్షలు ముంచింది. ప్రైవేట్ ఉద్యోగం చేసే ఆ యువతికి గత నెలలో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆ తరువాత చార్లెస్‌ను మాట్లాడుతున్నానంటూ వాట్సాప్ కాల్ చేసింది. కస్తూర్బా కాలేజీలో చదివాను, గుర్తుపట్టావా? అంటూ మాటలు కలిపింది. స్నేహితుల గురించి ఆరాతీసింది. లండన్‌లో ఉండి బాగా సంపాదించాను అని చెప్పి నమ్మించిన సదరు మోసగత్తె.. పౌండ్లు, ఐ ఫోన్, ల్యాప్‌టాప్ బహుమతిగా పంపుతున్నానని చెప్పింది. మరునాడు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి కస్టమ్స్ అధికారుల పేరుతో మాట్లాడిన ఇదే ముఠాకు చెందిన సభ్యుడొకరు.. మీ పేరుతో వచ్చిన పార్సిల్‌కు కస్టమ్స్ డ్యూటీ చెల్లించి తీసుకొండని చెప్పాడు. బ్యాంకు ఖాతా నంబర్ పంపిస్తా.. అందులో కస్టమ్స్ డ్యూటీ డిపాజిట్ చేయమని సూచించాడు. ఇలా రెండు దఫాలుగా రూ. 1,79,200 జమ చేసినా పార్సిల్ రాకపోవడంతో మోసపోయానని గుర్తించిన బాధితురాలు సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.

### నువ్వు నాకు నచ్చావ్.. పెండ్లి చేసుకొంటా

మ్యాట్రిమొని వెబ్‌సైట్‌లో పరిచయంతో రూ.4.05 లక్షల దోపిడీ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్‌వాళ్లు అరెస్ట్ చేశారు. రూ.97 లక్షల విలువైన అమెరికా డాలర్లు ఉన్నాయంటూ ఓ మహిళను సైబర్ నేరగాడు రూ.4.05 లక్షలకు నిలువు దోపిడి చేశాడు. మ్యాట్రిమొని వెబ్‌సైట్‌లో పరిచయంతో పెండ్లి చేసుకుంటానంటూ మోసం చేయడమే కాకుండా, మరింత డబ్బు కావాలంటూ డిమాండ్ చేశాడు. మెహదీపట్నం నానల్‌నగర్‌కు చెందిన ఒక యువతి.. మ్యాట్రిమొని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ప్రొఫైల్‌కు డాక్టర్ మెహెమెట్ షాఫాక్ అనే వ్యక్తి పేరుతో మెయిల్ వచ్చింది. ఫ్రెండ్స్ అయిన కొన్నాళ్లకు చాటింగ్ మొదలెట్టాడు. ఇండియా వస్తున్నానని చెప్పిన మరుసటి రోజు రూ.97 లక్షల విలువైన అమెరికా డాలర్లతో వస్తుండగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ అధికారులు అరెస్ట్ చేశారని చెప్పాడు. కొంత డబ్బు సర్దితే హైదరాబాద్ రాగానే ఇచ్చేస్తానంటూ నమ్మించాడు. దాంతో మూడు దఫాలుగా రూ.4.05 లక్షలు అతడు చెప్పిన ఖాతాలో జమచేసింది. మరోసారి రూ.6.9 లక్షలు ఆదాయపన్నుశాఖ కోసం అంటూ అడగడంతో అనుమానం వచ్చిన సదరు యువతి మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.

### బాలికపై రాక్షసత్వం.. గ్రామపెద్దపై కేసు

- అనంతపురంలో మైనర్ పేమికులపై దాడి ఘటనలో పోలీసుల విచారణ

**అనంతపురం:** ఏపీలోని అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలంలోని కేపీదొడ్డిలో మైనర్లను చితకబాదిన గ్రామపెద్ద లింగప్పపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద పోలీసులు ఆదివారం కేసు నమోదుచేశారు. బాలికను ప్రేమించిన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు పెట్టారు. లింగప్పను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. అన్నాచెల్లె వరుసయ్యే మైనర్లు ప్రేమించుకున్నారని ఆరోపిస్తూ వారిద్దరిపై కుటుంబసభ్యులు, గ్రామస్థుల సమక్షంలో గ్రామపెద్ద విచక్షణారహితంగా దాడిచేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయి కలకలం సృష్టించింది. బాలికను కొట్టే సమయంలో రచ్చబండపై ఉన్నవారిని కూడా విచారించి వారిపై కూడాకేసు నమోదుచేస్తామని డీఎస్పీ తెలిపారు.

## నేడు ఫొటోగ్రఫీ అవార్డుల ప్రదానం

హాజరుకానున్న విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, దేవులపల్లి అమర్

**బషీర్‌బాగ్:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్టుల సంఘం (టీఎస్‌పీజేఏ) ఆధ్వర్యంలో ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డుల బహూకరణ కార్యక్రమం సోమవారం జరుగనున్నది. బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించే ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి హాజరుకానున్నారు. సీనియర్ జర్నలిస్ట్ కే శ్రీనివాస్‌రెడ్డి, ఐజేయూ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ అతిథులుగా పాల్గొంటారని టీఎస్‌పీజేఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమల్ల గంగాధర్, కేఎన్ హరి తెలిపారు. ప్రథమ బహుమతి- వీ సతీశ్ (వెలుగు-సూర్యాపేట), ద్వితీయ బహుమతి- ఏ సతీశ్‌లాల్ (ఈనాడు-హైదరాబాద్), తృతీయ బహుమతి- కే శ్రీనివాసప్రసాద్ (ఆంధ్రప్రభ-నల్లగొండ) ఎంపికయ్యారు. జ్యూరీగా పీ రామ్మూర్తి, డాక్టర్ వీ సత్తిరెడ్డి (తెలుగు విశ్వవిదాలయం), ఎస్కే రహమాన్ (జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ), నల్లి రవి (ఫొటోగ్రాఫర్) వ్యవహరించారు.

# సమాచారవ్యాప్తిలో ఫొటో జర్నలిస్టులది కీలకపాత్ర

- అవార్డులివ్వడం వారికి దక్కిన గౌరవం: మంత్రి తలసాని
- ఏటా అవార్డులిచ్చి ప్రోత్సహించాలి: సీఎస్ ఎస్కే జోషి
- తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు: అల్లం నారాయణ



మంత్రి తలసాని, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సమాచారశాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్ చేతులమీదుగా అవార్డులు అందుకొంటున్న 'నమస్తే తెలంగాణ' డిప్యూటీ చీఫ్ ఫొటో జర్నలిస్టు రజినీకాంత్‌గౌడ్, సాయిలు (సంగారెడ్డి)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సంఘటనలకు చిత్రరూపమిచ్చి ప్రజలకు చేరవేయడంలో ఫొటో జర్నలిస్టులది కీలకపాత్ర అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కొనియాడారు. జర్నలిస్టు కుటుంబాలు సంతోషంగా ఉండాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ మీడియా అకాడమీ ఏర్పాటుచేశారని చెప్పారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకొని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలకు ఆదివారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫొటో జర్నలిస్టులకు పోటీలు నిర్వహించి అవార్డులు ఇవ్వడం వారికి దక్కిన గౌరవమన్నారు. సీఎస్ ఎస్కే జోషి మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ అనేది ఒక కళ అని, ఫొటోగ్రాఫర్లందరూ ఆర్టిస్టులని కొనియాడారు. ఇలాంటి అవార్డుల కార్యక్రమాలను ప్రతియేటా నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఫొటో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. సీఎం కేసీఆర్ నిరాహార దీక్ష సమయంలో నిమ్స్ దవాఖానలోని ఫొటో, శ్రీకాంతాచారి ఆత్మాహుతి ఫొటో ఉద్యమాన్ని ఉధృతం చేశాయన్నారు. సమాచారశాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్ మాట్లాడుతూ.. ఫొటో జర్నలిస్టులను ప్రోత్సహించేలా ప్రభుత్వపరంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సమాచారశాఖ అదనపు సంచాలకుడు నాగయ్య కాంబ్లే, మీడియా అకాడమీ కార్యదర్శి విజయ్‌గోపాల్, సంయుక్త సంచాలకుడు డీఎస్ జగన్ తదితరులు పాల్గొన్నారు. 'బంగారు తెలంగాణ', 'తెలంగాణ ఫెస్టివల్స్', 'ఫొటో జర్నలిజం', 'సిటీ డెవలప్‌మెంట్' విభాగాల్లో 52 మందిని విజేతలుగా ప్రకటించారు. ప్రతి క్యాటగిరీలో మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతికి రూ.15 వేలు, ప్రోత్సాహక బహుమతికి రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున అందజేశారు. 'నమస్తే తెలంగాణ' ఫొటో జర్నలిస్టులు వీ రజినీకాంత్‌గౌడ్‌కు క్యాటగిరీ-1లో రెండవ, క్యాటగిరీ-4లో ప్రోత్సాహక బహుమతులు రాగా, క్యాటగిరీ-1లో సాయిలు (సంగారెడ్డి) ప్రోత్సాహక బహుమతిని, క్యాటగిరీ-3లో పీ సైదిరెడ్డి (హైదరాబాద్) ప్రోత్సాహక బహుమతిని గెలుచుకొన్నారు.

### విభాగాలవారీగా విజేతలు

**బంగారు తెలంగాణ విభాగం:** మొదటి బహుమతి- ముచ్చర్ల విజయ్ కుమార్ (నల్లగొండ), రెండో బహుమతి- వీ రజినీకాంత్ (హైదరాబాద్), మూడో బహుమతి- చావ సంపత్‌కుమార్ (ఖమ్మం),ప్రోత్సాహక బహుమతులు- కే శివకుమార్ (యాదాద్రి భువనగిరి), వీ శరత్‌బాబు (వరంగల్), కే సాయిలు (సంగారెడ్డి), జీ దేవీశ్రీ (ఖమ్మం), ఎన్ శివకుమార్ (హైదరాబాద్), సంపత్‌కుమార్ (మంచిర్యాల), సీహెచ్ నరేందర్ (నల్లగొండ), పఠాన్ హుస్సేన్‌ఖాన్ (ఖమ్మం), కే రమేశ్ (వరంగల్), కే.యాదగిరి (వరంగల్).

**తెలంగాణ ఫెస్టివల్స్ విభాగం:** మొదటి బహుమతి- పీ సంపత్‌కుమార్ (మంచిర్యాల), రెండో బహుమతి- వీ శరత్‌బాబు (వరంగల్), మూడో బహుమతి- పఠాన్ హుస్సేన్‌ఖాన్ (ఖమ్మం), ప్రోత్సాహక బహుమతులు- కే బజ్‌రంగ్ ప్రసాద్ (నల్లగొండ), చావ సంపత్‌కుమార్ (ఖమ్మం), ఎస్వీ రమేశ్ (వనపర్తి), మహిమల క్యాదర్‌రెడ్డి (కరీంనగర్), కే సతీశ్ (సిద్దిపేట), జీ వేణుగోపాల్ (జనగామ), కంది శివప్రసాద్ (ఆదిలాబాద్), ఎం నాగేశ్వర్‌రావు (ఖమ్మం), ఉప్పు సైదయ్య (పెద్దపల్లి).

**ఫొటో జర్నలిజం విభాగం:** మొదటి బహుమతి- రవీందర్ (సూర్యాపేట), రెండో బహుమతి- ఆవుల శ్రీనివాస్ (హైదరాబాద్), మూడో బహుమతి- ఎన్.రాజేశ్‌రెడ్డి (హైదరాబాద్), ప్రోత్సాహక బహుమతులు- పీ సైదిరెడ్డి (హైదరాబాద్), జీ వేణుగోపాల్ (జనగామ), ఎన్.శివకుమార్ (హైదరాబాద్), ఎం.వినయ్‌కుమార్ (హైదరాబాద్), రాజమౌళి (హైదరాబాద్), దుబ్బాక సురేశ్‌రెడ్డి (హైదరాబాద్), కే శ్రీనివాస్‌ప్రసాద్ (నల్లగొండ), దశరథ్ రజువా (భద్రాద్రి కొత్తగూడెం), ఎం సత్యనారాయణ (సంగారెడ్డి), సుధాకర్ (నాగర్‌కర్నూల్).

**సిటీ డెవలప్‌మెంట్ విభాగం:** మొదటి బహుమతి- లవకుమార్ (హైదరాబాద్), రెండో బహుమతి- కే శ్రీనివాస్ (హైదరాబాద్), మూడో బహుమతి- ఆర్ రాఘవేందర్ (హైదరాబాద్), ప్రోత్సాహక బహుమతులు- ఎం భాస్కర్‌రెడ్డి (సిద్దిపేట), ఎన్ రాజేశ్‌రెడ్డి (హైదరాబాద్), సూర్యా శ్రీధర్ (హైదరాబాద్), ఎం రమేశ్ (హైదరాబాద్), ఏ సతీశ్‌లాల్ (హైదరాబాద్), ఎం వెంకటేశంగౌడ్ (హైదరాబాద్), ఎం గోపీకృష్ణ (హైదరాబాద్), వీ రజినీకాంత్‌గౌడ్ (హైదరాబాద్), ఆవుల శ్రీనివాస్ (హైదరాబాద్), పీ కుమారస్వామి (కరీంనగర్).

## బీజేపీ భిన్నమైన పార్టీ: జేపీ నడ్డా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో ఉన్న పార్టీలన్నింటిలో బీజేపీ భిన్నమైనదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. తొలిసారిగా రాష్ట్రపర్యటనకు వచ్చిన ఆయన పార్టీ శ్రేణుల్లో విశ్వాసం నింపే ప్రయత్నంచేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతున్నదని జోస్యంచెప్పారు. కొత్త నాయకులను కలుపుకొని నేతలంతా కలిసి పార్టీ బలోపేతానికి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పార్టీలో చేరారు. తొలుత పార్టీ కార్యాలయంలో నేతలతో సమావేశమైన నడ్డా.. సాయంత్రం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. ముస్లిం మహిళల సమస్యలను అర్థంచేసుకొని ట్రిపుల్ తలాక్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రధాని ఆవాస్ యోజనతో ప్రతి కుటుంబానికి ఇంటిని నిర్మిస్తామన్నారు. 2020 నాటికి ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు.

**టీడీపీ ఎంపీ గరికపాటి సంచలన వ్యాఖ్యలు**

బీజేపీలో చేరిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు సంచలన వ్యాఖ్యలుచేశారు. రాజకీయ భవిష్యత్తు కోసం మనసు చంపుకొని పార్టీ మారుతున్నామన్నారు.



సికింద్రాబాద్ యశోద దవాఖానలో సదస్సుకు హాజరైన వివిధ రాష్ట్రాల ఫిజియోథెరపిస్టులు

## యశోదలో పల్మనరీ రిహాబిలిటేషన్‌పై సదస్సు

**హైదరాబాద్:** సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో పల్మనరీ రిహాబిలిటేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 150 మందికి పైగా ఫిజియోథెరపిస్టులు హాజరయ్యారు. వ్యాధులు, మందుల వాడకంపై అవగాహన, అధిక బరువు, రక్తపోటు, మధుమేహం, ధూమపాన నియంత్రణ పద్ధతులతోపాటు వ్యాయామాల గురించి విస్తృత అవగాహన కల్పించారు. శ్వాసకోశ వ్యాధులపై యశోద దవాఖాన వైద్యనిపుణులు డాక్టర్ గోపీకృష్ణ యడ్లపాటి, డాక్టర్ గంగాధర్‌రెడ్డి, వ్యాయామాలపై మణిపాల్ కాలేజ్ ఆఫ్ హెల్త్ ప్రొఫెషనల్స్ డీన్ డాక్టర్ అరుణ్ మైయ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ జీ పవన్‌కుమార్, సికింద్రాబాద్ బ్రాంచ్ యూనిట్ హెడ్ డాక్టర్ డీ సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
# జిందగీ
సోమవారం 19 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## స్వేచ్ఛగా వదిలేయాలని..!



కరీంనగర్

**జంతువులను బంధించి పంచభక్షపరమాన్నాలు పెట్టినా ఉపయోగం ఉండదు. వాటికి కూడా మనుషుల్లాగే బాధ కలుగుతుంది. కాబట్టి వాటికి స్వేచ్ఛావాయువులు అందించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఇద్దరు మహిళలు.**

గదుల్లో బంధీగా ఉంచడం వల్ల అవి పలు రోగాల బారిన పడుతున్నాయి. 24 గంటలూ ఇంట్లోనే ఉండడం వల్ల అనుక్షణం అవి భయభ్రాంతులకు గురవుతున్నాయి. దీనివల్ల జాగిలాల ఆయువు కూడా తగ్గుతున్నట్లు ఓ పరిశోధనలో వెల్లడయింది. బెంగళూరుకు చెందిన అవంతి అగర్వాల్, చింతన అనే ఇద్దరు మహిళలు శునకాల సంరక్షణ కోసం ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా పునరావాస కేంద్రాలను ప్రారంభించి కుక్కల పట్ల మానవత్వాన్ని చూపిస్తూ వాటి ఆలనా, పాలనా చూసుకుంటున్నారు. గొలుసులతో బంధించకుండా వాటిని సౌకర్యవంతంగా ఉంచాలని కోరుతున్నారు. శునకాల దత్తత కేంద్రమైన కంపాషన్ అన్‌లిమిటెడ్ ప్లస్ యాక్షన్(కుప) సంస్థతో కలిసి 'ఫ్రీగల్స్ ఆఫ్ ఇండియా' పేరుతో జంతు ప్రేమికులకు వాటి పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. పెంపుడు కుక్కలను హద్దుల్లో ఉంచడం వాటి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను హరించినట్టేనని ఫ్రీగల్స్ ఆఫ్ ఇండియా సహవ్యవస్థాపకురాలు అవంతి చెబుతున్నది. ఫ్రీగల్స్ ఆఫ్ ఇండియా సంస్థ 2016లో ప్రారంభమయింది. ఈ సంస్థ ప్రారంభమయిన కొద్దిరోజులకే బెంగళూరులోని 250 శునకాలకు స్వేచ్ఛ లభించింది. కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా శునకాలకు స్వేచ్ఛను ప్రసాదించాలంటూ పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నామని ఫ్రీగల్స్ ఆఫ్ ఇండియా సహవ్యవస్థాపకురాలు చింతన చెబుతున్నది. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 465 శునకాలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఫ్రీగల్స్ ఆఫ్ ఇండియా సేవలను త్వరలోనే దేశంలోని పలు నగరాల్లో విస్తరించనున్నారు.





# ప్రతి ఫొటో.. ఒక సందేశం!

**ఫొటో..**
**క్షణ కాలంలో జీవితాన్ని మెమరీ లేయర్స్‌లోకి తీసుకెళ్తుంది.**
**ఘటన.. సంఘటనలను జ్ఞాపకాలుగా కట్టి పడేస్తుంది.**
**యాంగిల్స్ తిప్పుతూ బింబం.. ప్రతిబింబాలుగా బంధిస్తుంది.**
**అందుకే.. ప్రతి ఫొటో ఒక మెమరీ. ప్రతి మెమరీ ఒక ఆల్బమ్‌గా మిగిలిపోతుంది.**
**ఫొటోలో విషయం ఉంటుంది. వినోదం ఉంటుంది. విషాదం ఉంటుంది. వింత ఉంటుంది!**
**ఇవన్నీ కలగలిపి.. ఒక పేజీ మ్యాటర్ చెప్పలేని భావాల్ని ఒక సందేశం ద్వారా చూపిస్తుంది.**
**ఈరోజు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇద్దరు మహిళా ఫొటోగ్రాఫర్ల పరిచయం మీ కోసం.**

















మనోజ్ఞ రెడ్డి.. త్రిష్ణాంత కంజీలాల్ పేర్లు ఎప్పుడన్నా విన్నారా? వీరు హైదరాబాద్‌లో టాప్ ఉమన్ ఫొటోగ్రాఫర్స్. వీరి దృష్టి కోణం వేరే. ఎంచుకున్న విభాగంలో.. వీరు తీసే ఛాయాచిత్రాలకు వేరే ఎవ్వరూ సరిలేరు అని చెప్పొచ్చు.

**భిన్న శైలి.. విభిన్న చిత్రం:** ఒకరికి ప్రతీది అందంగానే కనిపిస్తుంది. ఇంకొకరికి ఎంత వెతికినా అందమే కనిపించదు. అంటే చూసేదాన్నిబట్టి.. పసిగట్టే దాన్నిబట్టి ఫ్లేవర్ వస్తుంది. మనోజ్ఞకు ఫొటోగ్రఫీలో మంచి టేస్ట్ ఉంది. యుద్ధానికి విల్లు ఎక్కుపెట్టినట్టే.. ఆమె తన కెమెరా లెన్స్‌ను ఎక్కుపెట్టి ఎవరి కంటికీ దొరకని ఎన్నో అద్భుత దృశ్యాలను పట్టేస్తుంది. అంచెలంచెలుగా ఎదుగుతూ టాప్ పొజిషన్‌కు చేరుకున్నది. త్రిష్ణాంత కూడా అంతే. ఆమెదొక భిన్న శైలి. ఈ స్మార్ట్ యుగంలో ఇస్మార్ట్‌గా ఫొటోలు తీస్తూ అందరి ప్రశంసలూ అందుకుంటున్నది.


**మెటర్నిటీ ఫొటోగ్రఫీ:** చాలా కొత్తగా.. వింతగా ఉందా ఈ పదం? అవును కొత్తగానే ఉంది కాబట్టి మనోజ్ఞ దీనిని ఎంచుకున్నది. న్యూబార్న్, బేబీ, మెటెర్నిటీ ఫొటోలు తీయడమే ఆమె ప్రత్యేకత. మనోజ్ఞకు ఇద్దరు కవల పిల్లలు. వారు ఎదుగుతున్న కొద్దీ మార్పులు జరుగుతున్నాయి. కానీ పుట్టినప్పుడు అలా ఉండేవాళ్లు.. ఇలా ఉండేవాళ్లు అని చెప్పుకునే జ్ఞాపకంగా మారిపోయేట్టు ఉంది అనుకున్నది. చాలాచోట్ల వెతికింది.. ఎక్కడన్నా న్యూబార్న్ బేబీ ఫొటోగ్రాఫర్స్ ఉంటారేమో అని. కానీ ఎక్కడా దొరకలేదు. ఆలస్యం చేస్తే తన పిల్లల స్వీట్ మెమరీస్.. చెప్పుకోవడానికే పరిమితం అవుతాయేమో అనుకున్నది. ఇక.. చేసేదేం లేక తానే ఫొటోగ్రాఫర్ అవతారమెత్తి పిల్లలకు ఫొటోషూట్ చేసింది. తర్వాత ఇదొక అలవాటుగా మార్చుకున్నది.

**ప్రొఫెషనల్‌గా ఎలా మారింది?**
ఆసక్తి వల్లో.. అవసరం వల్లో మొత్తానికి ఫొటోగ్రఫీలో అడుగుపెట్టిన మనోజ్ఞ అక్కడే ఆగిపోవాలి అనుకోలేదు. వేరేవాళ్ల ఫొటోలు కూడా తీయాలని నిర్ణయించుకున్నది. ఫ్రెండ్స్, రిలేటివ్స్ సర్కిల్స్‌లో మెటర్నిటీ నుంచి ఆర్నెళ్లు.. ఏడాది దాటేవరకు తల్లీపిల్లలకు ఫొటోషూట్ చేయడం మొదలుపెట్టింది. నిజానికి పసిపాపల ఫొటోలు తీయడమంటే అంత ఈజీ కాదు. ఒకరు స్టడీ అనేంతవరకు బాగానే ఉండి క్లిక్‌మనేసరికి కదులుతారు. నవ్వమన్నప్పుడు ఏడ్చి.. ఏడ్వమన్నప్పుడు నవ్వుతారు. అయితే మనోజ్ఞ దీనిని ఏమాత్రం రిస్క్‌గా భావించలేదు. పనిలో ఆనందం వెతుక్కుంది. కాళ్లు.. చేతులు.. యాంగిల్స్ ఇలా అన్నీ సెట్‌చేయడానికి ఎంత సమయం పట్టినా ఓపికతో క్యాప్చర్ చేసి ఆల్బమ్స్ కూడా రూపొందిస్తున్నది. డ్రెస్ మెటీరియల్స్.. బ్యాండ్స్ ఇతర అన్ని ఉపకరణాలు కూడా ఆమే అందిస్తున్నది. ఒకరికి ఉపయోగించినవి డ్రైవాష్ చేసిన తర్వాతే మరొకరికి ఉపయోగిస్తూ ఆరోగ్య విలువలనూ పాటిస్తున్నది. ఈమె పుట్టింది కడపలో అయినా పెరిగింది.. స్థిరపడింది మాత్రం హైదరాబాద్‌లోనే. భర్త ప్రోత్సాహంతో వృత్తిలో సంతృప్తికరంగా ఉంటున్నది. తనలాంటి ఎంతోమంది తల్లులకు ఫొటోగ్రఫీ నేర్పిస్తున్నది. అంతేకాదు.. రకుల్‌ప్రీత్ సింగ్, పూజా హెగ్డే, సోనాల్ చౌహాన్, హన్సికా వంటి హీరోయిన్లకు ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నది మనోజ్ఞ.

**మామ్స్ వర్క్‌షాపులు:**
పిల్లలు ఎప్పుడు ఎలాంటి చిలిపి పనులు చేస్తుంటారో తెలీదు. ఒకసారి చేసిన పనిని మరలా చేపించి ఫొటోషూట్ చేపించడం కష్టం. ఇలా ప్రతిసారీ వారి చిలిపి పనులను ఫొటోగ్రాఫరే వచ్చి ఫొటోలు తీయాలంటే కష్టం కదా! అందుకే పిల్లలున్న తల్లిదండ్రులకు ఫొటోషూట్ మీద ఆసక్తి ఉంటే వారికి వర్క్‌షాపులు నిర్వహించి శిక్షణ ఇవ్వాలనుకుంటున్నాను. డిసెంబర్ నుంచి మొదలుపెట్టాలనుకుంటున్నాను. ఫొటోలు తీయడానికి కెమెరానే అవసరం లేదు. మంచి మొబైల్ ఉండి, ఫొటోగ్రఫీ తెలిస్తే సరిపోతుంది. పిల్లలు చేసే ప్రతి అల్లరినీ కెమెరాలో బంధించవచ్చు. సందేహాలు ఉంటే www.facebook.com/ manognareddyphotography లో సెర్చ్ చేయగలరు.

**మనోజ్ఞరెడ్డి**

## ఫుడ్ ఫొటోగ్రఫీ









మంచి ఫుడ్ కావాలి అని అందరమూ కోరుకుంటాం. కానీ ఎక్కడో ఒక దగ్గర కాంప్రమైజ్ అయ్యి ఏదో ఒకటి తినేద్దాంలే అని కానిచ్చేస్తాం. మనమేదో ఊహించుకొని ఆర్డర్ చేస్తాం. వాళ్లేదో తెచ్చిస్తారు. అది తినేవరకు తెలియదు అలా ఉంటుందని. లలితా జ్యుయెలర్స్ బాస్ అన్నట్టు నిజంగానే నాలుగు హోటల్స్ తిరిగి.. నాలుగు రకాల భోజనాలు చూసి.. ఎస్టిమేట్ వేసుకొని తినేసే అవకాశం ఉంటే బాగుండేమో. కానీ ఆ అవకాశం మనకు లేదాయె. ఉన్నా అంత తిరిగే ఓపిక ఉండదు. ఇలా కాకుండా ఏది మంచి ఫుడ్? తినక ముందే ఫొటోల ద్వారా రుచి చూపిస్తే ఎలా ఉంటుంది? అని భావించి ఫుడ్ ఫొటోగ్రఫీని ఎంచుకున్నది త్రిష్ణాంత కంజిలాల్. ఫొటోగ్రఫీపై పట్టు సంపాదించి తీరొక్క రుచుల్ని ఫొటోల ద్వారా ప్రతిబింబిస్తూ అందరి మన్ననలూ పొందుతున్నది.


**ప్రొఫెషన్‌గా ఎలా మారింది?**
త్రిష్ణాంత ఎంఎన్‌సీ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగం చేసేది. ఆ ఉద్యోగం వదిలేసి 2012లో కెమెరా చేతబట్టింది. కొన్నేండ్లపాటు పార్ట్‌టైమ్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేసి.. 2018 నుంచి ఫుల్‌టైమ్‌లోకి వచ్చేసింది. రాయలసీమ రుచులు.. ఆలివ్ బిస్ట్రో వంటి పెద్ద రెస్టారెంట్స్‌లో దొరికే ఫుడ్, డ్రింక్స్‌కు సంబంధించిన చిత్రాలను తన కెమెరాలో బంధిస్తూ ఫుడ్ లవర్స్‌కు మరింత ఆసక్తి కలిగిస్తున్నది. అభిరుచి కోసం మొదలుపెట్టిన ఫొటోగ్రఫీ ఇప్పుడు అలవాటుగా మారి.. వృత్తిగా రూపాంతరం చెందింది. క్రీమ్‌స్టోన్, హోటల్ మారీగోల్డ్, గ్రీన్ పార్క్ వంటి చాలా వాటికి ఫొటోగ్రఫీ చేస్తుంది. త్రిష్ణాంత తండ్రి కూడా ఫొటోగ్రాఫరే. ఆయన నుంచే త్రిష్ణాంతకు ఫొటోగ్రఫీ అబ్బిందట. బెంగళూరు, ఢిల్లీలో ఫొటోగ్రఫీ మెంటర్‌గా కూడా పనిచేసిన అనుభవం ఉన్నది ఆమెకు.

**నా కోసమే నేర్చుకున్నా:**
నాకు బేకింగ్ చేయడమంటే చాలా ఇష్టం. అలా చేసిన ఐటమ్స్‌ను ఫొటోలు తీసుకునేదాన్ని. ఫొటోలు అంత మంచిగా వచ్చేవి కావు. వేరేవాళ్లు ఫొటోషూట్ చేస్తే శాటిస్ఫై కాలేకపోయాను. అందుకే నేనే నేర్చుకోవాలనుకున్నా. నేర్చుకున్నాను. చేసిన రెసిపీస్‌ను డాక్యుమెంటరీ చేశాను. వీటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటాను. ఎక్కడ వర్క్‌షాప్ జరుగుతున్నా దానికి హాజరవుతాను. అలాగే నేను కూడా 6 వర్క్‌షాపులు నిర్వహించాను. దీనికి ఫీజు రూ. 1000 నుంచి ఉంటుంది. ముమ్ముందు దేశమంతా తిరిగి ఫొటోగ్రఫీ చేయాలి. ఏమైనా సందేహాలు ఉంటే www.facebook.com/trishnanta ద్వారా సంప్రదించగలరు.

**త్రిష్ణాంత కంజిలాల్**

... వనజ వనిపెంట

## స్థూలకాయంతో ఫ్యాటీ లివర్ వస్తుందా?




**మా సోదరుడి వయసు 45 సంవత్సరాలు. ఈ మధ్య తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఫ్యాటీ లివర్ సమస్య అని డాక్టర్ చెప్పారు. దీని నుంచి ఉపశమనం పొందాలంటే ఏం చేయాలి? అతడు లావు ఎక్కువగా ఉంటాడు. ఈ సమస్యకు బరువు కూడా కారణం అవుతుందా? దయచేసి తెలుపగలరు.**

**- ఆర్. భాస్కర్, హిమాయత్‌నగర్**

ఫ్యాటీ లివర్ రకరకాల కారణాల వల్ల వస్తుంది. శరీర బరువు కూడా ఒక కారణం అయి ఉండొచ్చు. శరీరంలో అధికంగా కొవ్వు ఉండడం వల్ల ఇలా జరుగుతుంది. మీ సోదరుడు బరువు అధికంగా ఉంటారు అన్నారు కాబట్టి బరువు తగ్గితే చాలా మంచిది. వ్యాయామం తప్పనిసరి. బరువు తగ్గాలి అనే తొందరలో లేనిపోని ప్రయోగాలు చేయొద్దు. ఒక క్రమ పద్ధతిలో బరువు తగ్గాలి. నిపుణుల సహాయం అవసరం. పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండడం మంచిది. మధుమేహం ఉన్నవారిలో కూడా ఫ్యాటీ లివర్ సమస్య ఉంటుంది. షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి. ఫ్యాటీ లివర్‌కు ఇంకో కారణం హైపోథైరాయిడిజం. ఇన్సులిన్ తీసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. విటమిన్-ఇ, బెటానైన్, ఎస్ఎడినోజిన్, మిథియోనైన్ వంటి మందులు వాడడం వల్ల శరీర బరువును తగ్గించి ఫ్యాటీ లివర్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

**డాక్టర్ ఆశా సుబ్బలక్ష్మి**
ఇంటర్వెన్షనల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్



## ఒక్క ఫొటో జీవితాన్నే మార్చేసింది!

**ఒక్కోసారి అదృష్టం తన్నుకొస్తుంది. జీవితమే మారిపోతుంది. ఊహించని ఓ పరిణామంతో రోజులన్నీ మారిపోతాయి. అలానే జరిగింది.. యూకేకు చెందిన కరెన్ అన్విల్ అనే మహిళ జీవితంలో!**





ఆమె కూడా ఊహించి ఉండదు. అభిమానంతో తీసిన ఆ ఫొటో ఆమె జీవితాన్నే మార్చేస్తుందని. విషయంలోకెళ్తే.. కరెన్ అల్విన్ యూకెకు చెందిన 41 ఏండ్ల మహిళ. ఆ దేశపు రాయ్ ఫ్యామిలీ అంటే ఆమెకెంతో అభిమానం. ముఖ్యంగా ప్రిన్స్ మేఘన్‌మెర్కిల్‌కు కరెన్ కూతురు పెద్ద ఫ్యాన్. ఈ రాయల్ ఫ్యామిలీలో ఉండే విలియమ్, కేట్, మేఘన్, హ్యారీ ఎప్పుడూ బయట కనిపించరు. కానీ ఒకరోజు పుట్టిన రోజు వేడుకకు వీళ్లు హాజరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కరెన్ వాళ్లను చూడడానికి వెళ్లింది. అక్కడి చర్చిలో నేరుగా చూసి నివ్వెరపోయింది. ముందు నుంచి నడుచుకుంటూ వస్తున్న ఆ నలుగురిని తన ఫోన్‌లో ఫొటోలు తీయడం ప్రారంభించింది. కరెన్‌ను గమనించిన మేఘన్ తన దగ్గరకు వచ్చి ఆమె తీసిన ఫొటోలను చూసి ఆనందం వ్యక్తం చేసింది. ఇంత అందమైన ఫొటోలను తీసినందుకు అభినందించింది. ఈ ఫొటోలను కరెన్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. ఈ ఫొటోలు చాలా వైరల్ కావడంతో స్థానికులు చాలామంది ఫొటోలను కొనడానికి ముందుకు వచ్చారు. అలా ఎంతో మంది నుంచి రాయల్టీ చెక్‌ను అందుకున్నది కరెన్. దీనిద్వారా సుమారు ఇప్పటివరకు రూ.34 లక్షలు పొందింది. ఆ డబ్బు తన కూతురు భవిష్యత్‌కు ఉపయోగపడుతుందనీ, అట్లాగే పాడుబడ్డ ఆమె ఇంటిని పునరుద్ధరించగలుగుతానని చెబుతున్నది.

## వానకాలంలో వెంట్రుకలకు రక్షణ

**వానకాలం కచ్చితంగా వెంట్రుకలు తడుస్తాయి. తడిచిన జుట్టు పట్ల జాగ్రత్తగా లేకపోతే రకరకాల సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి వానలో తడిచిన జుట్టును సంరక్షించుకోవాలంటే ఈ జాగ్రత్తలు పాటించండి.**



- వానాకాలంలో జుట్టుతో ఎన్నో ఇబ్బందులు ఉంటాయి. గజిబిజి జుట్టు, దురద, మురికి, వెంట్రుకలు రాలడం ఇవి ప్రధానమైనవి. వీటినుంచి విముక్తి పొందడానికి జాగ్రత్తలు తప్పనిసరి.
- చర్మానికి కావాల్సినట్టే వెంట్రుకలకు కూడా హైడ్రేషన్ అవసరం. అందుకే వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి.
- జుట్టు తడిగా ఉన్నప్పుడు అసలే దువ్వకూడదు. కట్టి వేయకూడదు కూడా. పూర్తిగా ఆరిన తర్వాతే దువ్వడం కానీ, కట్టడం కానీ చేయాలి.
- కచ్చితంగా జుట్టు కట్టాలి అనుకుంటే పోనీటేల్ మాత్రమే వేసుకోండి.
- ఈ కాలంలో ముఖ్యంగా భిన్నమైన హెయిర్ స్టైల్స్‌కు దూరంగా ఉండడం మంచిది. సాధారణ శైలిలోనే జుట్టును ఉంచుకోవాలి
- హెయిర్ డ్రైయర్లను వాడడం, రంగులు వేయడం తగ్గించడం మంచింది.
- వర్షం నీటివల్ల జుట్టులోకి మురికి చేరే అవకాశం ఉంది. సరైన షాంపును ఎంచుకొని దాన్ని తొలగించాలి. ఎక్కువ షాంపును వాడడం కూడా మంచిది కాదు.
- వారానికి రెండుసార్లు అయినా ఆయిల్ మసాజ్ చేసుకోవడం మంచిది. దీని వెంట్రుకలు కుదుళ్ల నుంచి బలంగా తయారవుతాయి.

నమస్తే తెలంగాణ
# నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 19 ఆగస్టు 2019



- ఇంటర్ అభ్యర్థులకు అవకాశం
- ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం
- రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- చివరితేదీ: సెప్టెంబర్ 3

**యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) & నేవల్ అకాడమీ (ఎన్‌ఏ) ఎగ్జామినేషన్ (II), 2019కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది.**

## ఎన్‌డీఏ & ఎన్‌ఏ ఎగ్జామినేషన్ II

- ఎన్‌డీఏ & ఎన్‌ఏ ఎగ్జామినేషన్‌ను ప్రతియేటా రెండుసార్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తుంది. ఈ ఎగ్జామ్ ద్వారా ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ విభాగాల్లోని ఖాళీలను భర్తీచేస్తారు.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 415
- **నేషనల్ డిఫెన్స్ అకాడమీ:** 370 పోస్టులు (ఇండియన్ ఆర్మీ-208, ఇండియన్ నేవీ-42, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్-120)
- ఇండియన్ నేవల్ అకాడమీ-45 పోస్టులు (10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)

### అర్హతలు:
- **ఆర్మీ వింగ్ (ఎన్‌డీఏ) :** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి ఇంటర్ లేదా 10+2 లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- ఎయిర్ ఫోర్స్/నేవల్ (ఎన్‌డీఏ)/ఇండియన్ నేవల్ అకాడమీ: ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా 10+2లో ఉత్తీర్ణత. ఇంటర్ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చును.
- **వయస్సు:** 18 నుంచి 21 ఏండ్ల మధ్య ఉండాలి. (2 జనవరి 2001 నుంచి 1 జనవరి 2004 మధ్య జన్మించి ఉండాలి)

### శారీరక ప్రమాణాలు:
- **ఎత్తు:** 157.5 సెంటీమీటర్లు, ( ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ 162.5 సెంటీమీటర్లు)
- **బరువు:** ఎత్తుకు తగ్గ బరువును కలిగి ఉండాలి.
- **కంటిచూపు:** 6/6, 6/9

- నేషనల్ డిఫెన్స్ అకాడమీకి ఎంపికైన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాలకు చెందిన అభ్యర్థులకు మూడేండ్లపాటు అకాడమిక్, ఫిజికల్ ట్రెయినింగ్ ఉంటుంది. మొదటి రెండేన్నర ఏండ్లపాటు మూడు విభాగావారికి ఒకే విధమైన శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత మూడు సేవలకు ఎంపికైన అభ్యర్థులకు జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి కింది డిగ్రీ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు.
- ఆర్మీ క్యాడెట్స్ - బీఎస్సీ/బీఎస్సీ/బీఏ (కంప్యూటర్)
- నేవల్ క్యాడెట్స్- బీటెక్
- ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్స్- బీటెక్
- ఎజిమలలోని నేవల్ అకాడమీకి ఎంపికైనవారికి నాలుగేండ్లపాటు అకడమిక్, ఫిజికల్ ట్రైనింగ్ ఉంటుంది. శిక్షణ అనంతరం వీరికి బీటెక్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.
- ఎన్‌డీఏలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆర్మీ అభ్యర్థులకు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ, నేవల్ అభ్యర్థులకు ఇండియన్ నేవల్ అకాడమీ (ఎజిమల)కి, ఎయిర్‌ఫోర్స్ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకామీకి పంపిస్తారు. వీరికి ఆయా విభాగాల్లో ఏడాదిపాటు శిక్షణ ఇచ్చి అనంతరం లెఫ్టినెంట్ హోదాలో ఉద్యోగం ఇస్తారు.

- **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో..**
- 15 నిమిషాల్లో 2.4 కి.మీ. దూరాన్ని పూర్తిచేయాలి
- స్కిప్పింగ్ చేయాలి
- 3-4 మీటర్ల రోప్ క్లైంబింగ్ చేయాలి.
- 20 పుష్ అప్‌లు, 8 చిన్ అప్‌లు చేయాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/- జనరల్/ఓబీసీ (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు లేదు)
- **జీతభత్యాలు:** రూ. 56,100/- శిక్షణ సమయంలో స్టయిఫండ్ చెల్లిస్తారు.
- **పదోన్నతులు:** ఆర్మీ/నేవీ/ఎయిర్‌ఫోర్స్‌ల్లో లెఫ్టినెంట్/సబ్ లెఫ్టినెంట్/ఫ్లయింగ్ ఆఫీసర్ నుంచి జనరల్/అడ్మిరల్/ఎయిర్ చీఫ్ మార్షల్ హోదా వరకు వెళ్లవచ్చు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, వైజాగ్, బెంగళూరుతోపాటు దేశవ్యాప్తంగా 41 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
- **ఎంపిక:** రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూ ద్వారా.
- **రాత పరీక్ష విధానం:** రాతపరీక్ష మొత్తం 900 మార్కులకు ఉంటుంది. ఈ రాతపరీక్షలో రెండు విభాగాలు (పేపర్ 1, పేపర్ 2) ఉంటాయి. ప్రతి పేపర్‌కు 150 నిమిషాలు కేటాయించారు. మ్యాథమెటిక్స్ (పేపర్ 1)-300 మార్కులు, జనరల్ ఎబిలిటీ టెస్ట్ (పేపర్ 2)- 600 మార్కులు.
- ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూకు 900 మార్కులు
- మొత్తం (రాతపరీక్ష+ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ)-1800 మార్కులకుగాను అత్యధిక ప్రతిభ చూపిన అభ్యర్థులను ఎంపిక చేసి ట్రెయినింగ్ ఇస్తారు.
- పేపర్1 (మ్యాథ్స్)లో ఆల్‌జీబ్రా, మ్యాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్, త్రికోణమితి, అనలిటికల్ జామెట్రీ (2 లేదా 3 డైమెన్షన్స్), డిఫరెన్షియల్ క్యాలిక్యులస్, ఇంటిగ్రల్ క్యాలిక్యులస్ & డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ ఆల్‌జీబ్రా, స్టాటిస్టిక్స్ & ప్రాబబిలిటీ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- పేపర్-2 (జనరల్ ఎబిలిటీ టెస్ట్)లో పార్ట్-ఏలో ఇంగ్లిష్, పార్ట్-బీలో జనరల్ నాలెడ్జ్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, హిస్టరీ, ఫ్రీడమ్ మూవ్‌మెంట్, జాగ్రఫీ, కరెంట్ ఈవెంట్స్) నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- రాతపరీక్షలో నెగెటివ్ మార్కిగ్ విధానం ఉంది.
- ఈ పరీక్షలో మెరిట్ పొందినవారికి (ఎన్‌డీఏకు 144వ కోర్సు, నేవల్ అకాడమీకి 106వ కోర్సు) 2020 జూలై 2 నుంచి శిక్షణ ప్రారంభిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** సెప్టెంబర్ 3 (సాయంత్రం 6 గంటల వరకు)
- **రాతపరీక్ష:** నవంబర్ 17
- **ఫలితాలు విడుదల:** డిసెంబర్‌లో
- **వెబ్ సైట్:** www.upsc.gov.in

## ఎస్ఎస్‌సీ 1350 సెలక్షన్ కొలువులు

**కేంద్రంలోని పలు శాఖల్లో ఖాళీగా ఉన్న సెలక్షన్ పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **పోస్టు:** సెలక్షన్ (ఫేజ్ 7/2019)
- **మొత్తం ఖాళీలు:** 1350

**పోస్టులవారీగా ఖాళీలు**
- సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-2
- **అర్హత:** డిగ్రీ లేదా ఆపై అర్హత కలిగినవారు.
- సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్-9
- **అర్హత:** హయ్యర్‌సెకండరీ ఉత్తీర్ణత.
- సైంటిఫిక్ అసిస్టెంట్ (జెనెటిక్స్)-36
- **అర్హత:** డిగ్రీ లేదా ఆపై చదివినవారు.
- జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రానిక్స్)-1
- **అర్హత:** డిగ్రీ లేదా ఆపై చదివినవారు.
- స్టాఫ్ కార్ డ్రైవర్-2
- **అర్హత:** మెట్రిక్యులేషన్‌తోపాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- సైంటిఫిక్ అసిస్టెంట్ (కెమిస్ట్రీ)-20
- **అర్హతలు:** డిగ్రీ లేదా ఆపై చదివినవారు.
  **నోట్:** పై పోస్టులకు 18-30 ఏండ్లు.
- బ్లాక్‌స్మిత్- 7
- **అర్హతలు:** మెట్రిక్యులేషన్.
- ఎంటీఎస్ - 47
- **అర్హతలు:** మెట్రిక్యులేషన్. 18-27 ఏండ్ల మధ్య ఉండాలి.
- ప్రూఫ్ రీడర్-1
- **అర్హత:** డిగ్రీ లేదా ఆపై ఉన్నత చదువు కలిగి 18-25 ఏండ్ల మధ్య ఉన్నవారు.
- ల్యాబొరేటరీ అటెండెంట్-2
- **అర్హత:** మెట్రిక్యులేషన్/పదోతరగతి ఉత్తీర్ణత.
- టెక్స్‌టైల్ డిజైనర్-1
- **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత.
- జూనియర్ టెక్నికల్ అటెండెంట్-3
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణత.
- జనరేటర్ ఆపరేటర్-1
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణత.
- రిసెర్చ్ అసిస్టెంట్-2
- **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత.
- గర్ల్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్-11
- **అర్హతలు:** డిగ్రీ ఉత్తీర్ణత.
- వీటితోపాటు జూనియర్ జాగ్రఫికల్ అసిస్టెంట్-1, జూనియర్ ఇంజినీర్-6, జూనియర్ జులాజికల్ అసిస్టెంట్-1, ల్యాబొరేటరీ అసిస్టెంట్-6, ప్రైమరీ టీచర్-2, ల్యాబొరేటరీ టెక్నీషియన్-2, లైబ్రేరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్-1, సీనియర్ రిసర్చ్ అసిస్టెంట్-1, ఇన్‌స్పెక్టర్ (నాన్ టెక్నికల్)-1, జూనియర్‌సైంటిఫిక్ అసిస్టెంట్-5, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్-2, ప్రిజర్వేషన్ అసిస్టెంట్-6, గార్డెన్ ఓవర్‌సీర్-7, సీనియర్ ప్రిజర్వేషన్ అసిస్టెంట్-24, ఫీల్డ్ అటెండెంట్-18, ఆఫీస్ అటెండెంట్-13, రిసెర్చ్ అసిస్టెంట్-1, అకౌంటెంట్-1, టెక్నికల్ ఆపరేటర్-7, మెకానిక్-28, సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్-9, డాటా ఎంట్రీ ఆపరేటర్-2, జూనియర్ ఇంజినీర్-2, మెడికల్ అటెండెంట్-12 తదితర పోస్టులు ఉన్నాయి.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ ద్వారా. ఈ పరీక్షను పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయి అర్హతలను బట్టి మూడు రకాలుగా నిర్వహిస్తారు. పరీక్షలో కింది అంశాలు ఉంటాయి.
- జనరల్ ఇంటెలిజెన్స్-25 ప్రశ్నలు-50 మార్కులు
- జనరల్ అవేర్‌నెస్-25 ప్రశ్నలు- 50 మార్కులు
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (బేసిక్ అర్థమెటిక్ స్కిల్స్)- 25 ప్రశ్నలు- 50 మార్కులు
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ (బేసిక్ నాలెడ్జ్)-25 ప్రశ్నలు- 50 మార్కులు.
- పరీక్ష కాలవ్యవధి 60 నిమిషాలు. పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 0.50 మార్కులు కోతవిధిస్తారు.
- అవసరమైన పోస్టులకు స్కిల్ టెస్ట్ అంటే టైపింగ్/డాటా ఎంట్రీ/కంప్యూటర్ ప్రొఫిషియన్సీ వంటివి నిర్వహిస్తారు. ఇవి కేవలం అర్హత పరీక్షలు మాత్రమే.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 31
- **ఫీజు చెల్లించడానికి (ఆన్‌లైన్ విధానంలో):** సెప్టెంబర్ 2
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ ద్వారా
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

## కరీంనగర్‌లో ఆర్మీ ర్యాలీ

**భారత సైన్యంలో సోల్జర్‌తోపాటు పలు రకాల ఉద్యోగాల భర్తీకి కరీంనగర్‌లో నిర్వహించే ఆర్మీ ర్యాలీకి నోటిఫికేషన్‌ను సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ విడుదల చేసింది.**



### పోస్టులు-అర్హతలు:
- సోల్జర్ టెక్నికల్- ఎత్తు -166 సెం.మీ ఉండాలి. బరువు 50 కేజీలు. ఛాతీ 77 సెం.మీతోపాటు గాలిపీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ వ్యాకోచించాలి.
- **విద్యార్హతలు:** కనీసం 45 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణత.
- **వయస్సు:** 17 1/2 ఏండ్ల నుంచి 23 ఏండ్ల మధ్య ఉండాలి.
- సోల్జర్ టెక్నికల్ (ఏవియేషన్/అమ్యునిషన్ ఎగ్జామినర్)- 165 సెం.మీ ఎత్తు, 50 కేజీల బరువు, 77 సెం.మీ. ఛాతీ ఉండాలి.
- **విద్యార్హతలు:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 17 1/2 ఏండ్ల నుంచి 23 ఏండ్ల మధ్య ఉండాలి.
- సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్/ ఏఎంసీ, ఆర్‌వీసీ- కనీసం 165 సెం.మీ ఎత్తు, 50 కేజీల బరువు, 77 సెం.మీల ఛాతీ ఉండాలి. గాలిపీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ. వ్యాకోచించాలి.
- **విద్యార్హతలు:** ఇంటర్ (బైపీసీ)లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ప్రతి సబ్జెక్టులో కనీసం 40 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
- **వయస్సు:** 17 1/2 ఏండ్ల నుంచి 23 ఏండ్ల మధ్య ఉండాలి.
- సోల్జర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్- కనీసం 162 సెం.మీ ఎత్తు, 50 కేజీల బరువు, 77 సెం.మీ ఛాతీతోపాటు గాలిపీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ వ్యాకోచం కలిగి ఉండాలి.
- **అర్హతలు:** ఇంటర్ (ఆర్ట్స్/కామర్స్ లేదా సైన్స్) గ్రూప్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ప్రతి సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు. 12వ తరగతిలో ఇంగ్లిష్‌తోపాటు మ్యాథ్స్/అకౌంట్స్/బుక్ కీపింగ్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి.
- **వయస్సు:** 17 1/2 ఏండ్ల నుంచి 23 ఏండ్ల మధ్య ఉండాలి.
- సోల్జర్ ఫార్మా (ఏఎంసీ)- కనీసం 165 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతీ 77 సెం.మీలు, బరువు 50 కేజీలు ఉండాలి.
- **విద్యార్హతలు:** ఇంటర్ బైపీసీలో ఉత్తీర్ణత. డిఫార్మాలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి స్టేట్ ఫార్మసీ కౌన్సిల్/ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో నమోదు చేసుకుని ఉండాలి.
- **వయస్సు:** 19-25 ఏండ్ల మధ్య ఉండాలి.
- సోల్జర్ ట్రేడ్స్‌మ్యాన్ (ఆల్ ఆర్మ్స్-పదోతరగతి)- కనీసం 166 సెం.మీ ఎత్తు ఉండాలి. బరువు 48 కేజీలు, కనీసం 76 సెంమీల ఛాతీతోపాటు గాలిపీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ వ్యాకోచించాలి.
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణత.
- సోల్జర్ ట్రేడ్స్‌మ్యాన్ (ఆల్ ఆర్మ్స్- ఎనిమిదో తరగతి)- కనీసం 166 సెం.మీ ఎత్తు ఉండాలి. బరువు 48 కేజీలు, కనీసం 76 సెంమీల ఛాతీతోపాటు గాలిపీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ వ్యాకోచించాలి.
- **అర్హతలు** : ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత.
- **పై రెండు పోస్టులకు వయస్సు:** 17 1/2 ఏండ్ల నుంచి 23 ఏండ్ల మధ్య ఉండాలి.

### ఎంపిక విధానం:
- **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ (పీఎఫ్‌టీ):**
- ఐదునిమిషాల 30/45 సెకన్లలో 1.6 కి.మీ దూరాన్ని పరుగెత్తాలి.
- పుల్ అప్స్, 9 అడుగుల డిచ్, జిగ్‌జాగ్ బ్యాలెన్స్‌లలో అర్హత సాధించాలి.
- అనంతరం శారీరక ప్రమాణాలను పరీక్షిస్తారు. తర్వాత మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనిలో అర్హత సాధించినవారికి కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఈ విషయాన్ని ర్యాలీ నిర్వహించిన ప్రదేశంలోనే తెలియజేస్తారు. పరీక్ష నిర్వహించే ప్రదేశం, సమయం వివరాలను అడ్మిట్‌కార్డులో పొందుపరుస్తారు. ఈ పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ఫలితాలను ఆర్మీ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.

**నోట్:** క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ తదితర సర్టిఫికెట్లు కలిగినవారికి అర్హతలు, ఎత్తు తదితర అంశాల్లో సడలింపు ఉంటుంది.

- ఈ ర్యాలీకి రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరుకావచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఆగస్టు 23 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** సెప్టెంబర్ 23
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

## కోస్ట్‌గార్డ్‌లో నావిక్ పోస్టులు

**ఇండియన్ కోస్ట్‌గార్డ్.. ఆర్మ్‌డ్ ఫోర్స్ ఆఫ్ యూనియన్‌లో ఖాళీగా ఉన్న నావిక్ (జనరల్ డ్యూటీ) 10+2 ఎంట్రీ (01/2020 బ్యాచ్) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**




- **పోస్టు:** నావిక్ (జనరల్ డ్యూటీ)10+2 ఎంట్రీ
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ (మ్యాథ్స్, ఫిజిక్స్) లేదా 10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18 నుంచి 22 ఏండ్ల మధ్య ఉండాలి. 1998, ఫిబ్రవరి 1 నుంచి 2002, జనవరి 31 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

**శారీరక ప్రమాణాలు:**
- ఎత్తు - 157 సెం.మీ.
- ఛాతీ - శరీరానికి తగ్గ అనుపాతంలో ఉండాలి. గాలిపీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ. వ్యాకోచం తప్పనిసరి.
- బరువు - ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.
- **ఎంపిక విధానం:** దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను ప్రతి జోన్ పరిధిలోని సెంటర్ ప్రకారం షార్ట్ లిస్ట్ చేసి రాతపరీక్ష నిర్వహిస్తారు.
- రాతపరీక్షలో క్వాలిఫయింగ్ మార్కులు ఒక్కొక్క జోన్‌సెంటర్ బట్టి ఎక్కువ/తక్కువగా ఉంటాయి.
- **రాతపరీక్ష:** ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. దీనిలో మ్యాథ్స్, ఫిజిక్స్, బేసిక్ కెమిస్ట్రీ, ఇంగ్లిష్ నాలెడ్జ్ (ఇంటర్ స్థాయిలో) జనరల్‌నాలెడ్జ్, కరెంట్‌అఫైర్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ తదితర అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- రాతపరీక్షలో క్వాలిఫై అయిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ప్రిలిమినరీ మెడికల్ ఎగ్జామినేషన్‌లను నిర్వహిస్తారు.
- ఈ పరీక్షల నిర్వహణకు 2 నుంచి 3 రోజులు పడుతుంది.
- అన్ని పరీక్షలు పూర్తిచేసిన మెరిట్ అభ్యర్థుల వివరాలను జోన్‌పరిధిలోని ఖాళీల సంఖ్య ఆధారంగా ఇండియన్ కోస్ట్‌గార్డ్ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.
- **శిక్షణ:** ఐఎన్ఎస్ చిల్కాలో కేటాయించిన ట్రేడ్‌కు సంబంధించి సముద్రంలో ప్రొఫెషనల్ ట్రెయినింగ్ ఇస్తారు.

**ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో..**
- 7 నిమిషాల్లో 1.6 కి.మీ. దూరాన్ని పూర్తిచేయాలి
- 20 ఉతక్ బైటక్‌లు చేయాలి
- 10 పుష్ అప్‌లు

పై అన్ని పరీక్షల్లో క్వాలిఫై అయినవారికి వైద్యపరీక్షలను నిర్వహించి జూలైలో ఫలితాలను వెల్లడిస్తారు.

- **జీతభత్యాలు:** 7వ వేతన సంఘం సిఫార్సులను అనుసరించి నెలకు జీతం రూ. 21,700/- వీటికి తోడు డీఏ, కిట్ మెయింటెనెన్స్, ఇతర అలవెన్సులు ఇస్తారు.
- **పదోన్నతులు:** నావిక్ నుంచి ప్రధాన అధికారి హోదా వరకు వెళ్లవచ్చు. ప్రధాన అధికారి పేస్కేల్ 7వ వేతన సంఘం సిఫార్సు అనుసరించి 47,600/- జీతం ఉంటుంది.
- **పరీక్ష కేంద్రాలు:** దేశవ్యాప్తంగా వివిధ జోన్లలోని మొత్తం 19 ఎగ్జామినేషన్ సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తారు.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యర్థులు ఈస్ట్ జోన్ పరిధిలోకి వస్తారు.
- ఈస్ట్‌జోన్ పరిధిలోని పరీక్ష కేంద్రాలు - సికింద్రాబాద్, మండపం, చెన్నై, విశాఖపట్నం ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 1 (సాయంత్రం 5 గంటలవరకు)
- **వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

## మజ్‌గావ్ డాక్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

**భారత ప్రభుత్వ సంస్థ మజ్‌గావ్‌డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**



- **పోస్టు:** నాన్ ఎగ్జిక్యూటివ్
- **మొత్తం ఖాళీలు:** 1980
- **ట్రేడులవారీగా ఖాళీలు:** ఏసీ రిఫ్రిజిరేటర్ మెకానిక్-21, కంప్రెసర్ అటెండెంట్-17, బ్రాస్ ఫినిషర్-26, కార్పెంటర్-78, చిప్పర్ గ్రైండర్-19, కాంపోజిట్ వెల్డర్-175, డీజిల్ క్రేన్ ఆపరేటర్-12, డీజిల్ కమ్ మోటార్ మెకానిక్-10, జూనియర్ డ్రాఫ్ట్స్‌మెన్-31, ఎలక్ట్రిక్ క్రేన్ ఆపరేటర్-12, ఎలక్ట్రానిక్ మెకానిక్-98, ఫిట్టర్-254, జూనియర్ ప్లాంట్ ఎస్టిమేటర్-33, గ్యాస్ కట్టర్-100, మెషినిస్ట్-20, మిల్ రైట్ మెకానిక్-40, పెయింటర్-58, పైప్ ఫిట్టర్-231, స్ట్రక్చరల్ ఫ్యాబ్రికేటర్-374, స్టోర్ కీపర్-40, యుటిలిటీ హ్యాండ్-53, యుటిలిటీ హ్యాండ్ సెమీస్కిల్డ్-145, ఫైర్ ఫైటర్-33, లాంచ్ డెక్ క్ర్యూ-34 తదితర ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** పదోతరగతి/ఇంటర్/డిగ్రీతోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణత. వేర్వేరు పోస్టుల అర్హతలు వేర్వేరుగా ఉన్నాయి. వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **పేస్కేల్:** స్కిల్డ్ పోస్టులకు రూ.22,000-83180/-, అన్‌స్కిల్డ్ పోస్టులకు రూ. 16,000-60,520/-
- **వయస్సు:** 2019, ఆగస్టు 1 నాటికి 18-38 ఏండ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

**నోట్:** ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన రెండేండ్ల కాలపరిమితికి భర్తీ చేయనున్నారు.

- **ఎంపిక:** రాతపరీక్ష, అనుభవం, ట్రేడ్ టెస్ట్ ద్వారా చేస్తారు.
- రాతపరీక్షకు 30 శాతం, అనుభవానికి 20 శాతం, ట్రేడ్ టెస్ట్‌కు 50 శాతం వెయిటేజీగా నిర్ణయించారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 5
- **వెబ్‌సైట్:** https://mazagondock.in

## ఆర్ఎంఆర్‌సీలో ఎంపీహెచ్

**భువనేశ్వర్‌లోని ఐసీఎంఆర్- రీజినల్ మెడికల్ రిసెర్చ్ సెంటర్ (ఆర్ఎంఆర్‌సీ) 2019-20 విద్యా సంవత్సరానికి ఎంపీహెచ్ కోర్సులో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**



- **కోర్సు పేరు:** మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఎంపీహెచ్)
- **కోర్సు వ్యవధి:** రెండేండ్లు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ (మెడిసిన్, ఆయుష్, డెంటల్, అల్లైడ్ మెడికల్ అండ్ హెల్త్ సైన్సెస్, వెటర్నరీ సైన్సెస్, నర్సింగ్, ఎపిడిమాలజీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఫిజియోథెరపీ, లైఫ్ సైన్సెస్, పాపులేషన్ సైన్స్/స్టడీస్, స్టాటిస్టిక్స్, బయోస్టాటిస్టిక్స్, డెమోగ్రఫీ, సోషల్ సైన్సెస్, సోషల్ వర్క్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్, ఫిజీషియన్ అసిస్టెంట్, న్యూట్రిషన్, హోంసైన్స్, కమ్యూనిటీ సైన్సెస్, సైకాలజీ, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, మేనేజ్‌మెంట్, లా, ఎకనామిక్స్) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.600/-
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 10
- **వెబ్‌సైట్:** www.rmrcbbsr.gov.in

## సీసీఆర్‌హెచ్‌లో

**న్యూఢిల్లీలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఇన్ హోమియోపతి (సీసీఆర్‌హెచ్)లో ఖాళీగా ఉన్న యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది**

- **పోస్టు పేరు:** యోగా ఇన్‌స్ట్రక్టర్
- మొత్తం ఖాళీలు- 5 (జనరల్-3, ఓబీసీ-1, ఎస్సీ-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి యోగాలో బ్యాచిలర్ డిగ్రీ/ఎంఏ లేదా ఎమ్మెస్సీ (యోగా) ఉత్తీర్ణత. హాస్పిటల్/నర్సింగ్ హోంలో పనిచేసిన అనుభవం ఉండాలి. లేదా ఏదైనా బ్యాచిలర్ డిగ్రీతోపాటు యోగాలో డిప్లొమా కోర్సు సర్టిఫికెట్, సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ.27,000/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.ccrhindia.nic.in



ముంబైలోని లతామంగేష్కర్ నివాసానికి వెళ్లి ఆమెతో ముచ్చటిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

## లతామంగేష్కర్ ఇంటికి రాష్ట్రపతి

**ముంబై:** ప్రసిద్ధ సినీ నేపథ్యగాయని, భారత రత్న లతామంగేష్కర్ ఇంటికి అనుకోని అతిథిలా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వచ్చి ఆశ్చర్యానికి గురిచేశారు. లతాజీ ఆరోగ్య పరిస్థితిని కోవింద్ వాకబు చేశారు. రాష్ట్రపతి తన ఇంటికి రావడం ఎంతో గౌరవంగా భావించానని పేర్కొంటూ లతామంగేష్కర్.. రామ్‌నాథ్ కోవింద్‌తో మాట్లాడుతున్న ఒక ఫొటోను ట్విట్టర్‌లో షేర్ చేశారు. 'నమస్కారం, మన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన శ్రీమతి సవితతో కలిసి నా నివాసానికి వచ్చి నాతో కలిశారు. ఆయన రాగానే కృతజ్ఞత తెలుపుతూ లేచి నిలుచున్నా. సర్! మీరు మాకు గర్వకారణం' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కోవింద్ వెంట మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, వినోద దంపతులు కూడా ఉన్నారు. పలు భాషల్లో వేల సంఖ్యలో పాటలు పాడిన లతామంగేష్కర్ సేవలను కొనియాడుతూ భారత ప్రభుత్వం 1989లో దాదాసాహెబ్ ఫాల్కే, 2001లో భారతరత్న పురస్కారంతో సత్కరించింది.



# శవాల దిబ్బగా పెండ్లి వేదిక



ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో మారణహోమం జరిగిన పెండ్లి వేదిక



సంఘటనా స్థలంలో విలపిస్తున్న మృతుల బంధువు

- ఆత్మాహుతి బాంబు పేలి 63 మంది మృత్యువాత
- 182 మందికి గాయాలు
- కాబూల్‌లోమారణహోమం
- ఐఎస్ ఉగ్రవాద సంస్థ ఘాతుకం

**కాబూల్, ఆగస్టు 18:** బంధుమిత్రుల ముచ్చట్లు, డ్యాన్సుల మధ్య సంతోషంగా సాగుతున్న పెండ్లి వేడుక ఒక్కసారిగా భీకరంగా మారిపోయింది. పెండ్లి వేదిక శవాల దిబ్బగా మారింది. ఎక్కడికక్కడ మృతదేహాలు.. చెల్లాచెదురుగా తెగిపడిన శరీర భాగాలతో ఆ ప్రాంతం రక్తసిక్తమైంది. అప్పటివరకు కేరింతలు కొట్టిన వారు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఏం జరుగుతున్నదో తెలియక భయాందోళన చెందారు. అరుపులు, కేకలతో ఆ పెండ్లి ప్రాంగణం దద్దరిల్లింది. ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్ పశ్చిమలో శనివారం రాత్రి పెండ్లి వేడుకలో ఈ ఘోర మారణ హోమం జరిగింది. ఆత్మాహుతి బాంబు పేలుడులో 63 మంది మృతి చెందగా, 182 మంది గాయపడ్డారు. ఆ దేశ అధికార ప్రతినిధి నస్రత్ రష్మి దీన్ని ధృవీకరించారు. ఈ పేలుడు నుంచి పెండ్లి కుమారుడు, కుమార్తె సురక్షితంగా బయటపడ్డారు. తన సంతోషమంతా ఒక్కసారిగా విషాదంగా మారిపోయిందని వరుడు మిర్వాజ్ వాపోయారు. స్థానిక టీవీ చానల్‌తో ఆయన మాట్లాడుతూ.. 'నా సోదరుడు, బంధువులు, స్నేహితులను కోల్పోయాను.. నా కళ్లెదుటే వారి మృతదేహాలను తరలించారు. నా కుటుంబమంతా షాక్‌లో ఉన్నది. వధువు భయంతో మూర్ఛపోయింది. సంతోషాన్ని ఇక నా జీవితంలో చూడలేను' అంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఆఫ్ఘనిస్థాన్‌లో పెండ్లి వేడుకలు ఎంతో అట్టహాసంగా జరుగుతాయి.. రక్షణ ఏర్పాట్లు సరిగా ఉండని కారణంగా ఉగ్రవాదులు వీటిని లక్ష్యంగా చేసుకుంటారు. సున్నీలు మెజారిటీగా ఉన్న ఆఫ్ఘనిస్థాన్‌లో షియాలపై దాడులు సర్వసాధారణం. షియా వేడుకలను ఉగ్రమూకలు లక్ష్యంగా చేసుకుంటాయి. తాజా నరమేధం కూడా ఈ కోవలోకి చెందినదే. 'పెండ్లికి వచ్చిన అతిథులు నృత్యాలు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు జరిగింది' అని తీవ్రంగా గాయపడిన మునీర్ అహ్మద్ (23) చెప్పారు. పెండ్లిలో మగవారంతా ఒకవైపు ఉన్నచోట పేలుడు జరిగిందని, 20 నిమిషాల పాటు అక్కడంతా పొగతో నిండిపోయిందని, అంతా హాహాకారాలు చేస్తూ హాలు నుంచి బయటకు పరుగెత్తారని వేడుకకు హాజరైన అతిథి మహ్మద్ ఫర్హాగ్ తెలిపారు. తాను మహిళలు ఉన్న చోటుకు అప్పుడే వెళ్లడంతో ప్రాణాలతో బయటపడినట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ మారణహోమానికి తమదే బాధ్యతని ఐఎస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. పెండ్లి సమూహం వద్ద తమ ఆత్మహుతి దళ సభ్యుడు పేల్చుకున్నాడని, సెక్యూరిటీ సిబ్బంది రాగానే బాంబులతో కూడిన వాహనాన్ని పేల్చివేశామని టెలిగ్రామ్ మేసేజ్ యాప్‌లో ప్రకటించింది. ఈ పెండ్లికి హాజరయ్యేందుకు ఓ వాహనంలో వస్తున్న 11 మంది బాల్ఖష్ ప్రావిన్సు వద్ద రోడ్డు పక్కన జరిగిన బాంబు పేలుడులో మృతిచెందినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

**అనాగరిక చర్య: అష్రఫ్ ఘని**

పెండ్లి వేడుకపై జరిగిన దాడిని అనాగరిక చర్యగా ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘని అభివర్ణించారు. ఆ దేశ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అబ్దుల్లా అబ్దుల్లా .. మానత్వంపై జరిగిన నేరమన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని అమెరికా రాయబారి జాన్ బాస్ ఈ దాడిని నీచమైన చర్యగా పేర్కొన్నారు. ఆ దేశం నుంచి సుమారు 14 వేల మంది సైన్యాన్ని వెనక్కి తీసుకునేందుకు తాలిబాన్‌తో అమెరికా జరుపుతున్న చర్చలు ఓ కొలిక్కి వస్తున్న తరుణంలో ఈ మారణకాండ చోటుచేసుకున్నది. అల్‌ఖైదా, ఐఎస్ వంటి జిహాదీ గ్రూపులు ఆఫ్ఘనిస్థాన్‌ను తమ స్వర్గధామంగా మార్చుకోకుండా అడ్డుకుంటామని తాలిబాన్ ఇచ్చే హామీపైనే అమెరికా నిర్ణయం తీసుకునే అవకాశమున్నది. ఈ దాడి ఘటన దీనిపై ప్రభావం చూపే అవకాశమున్నట్లు తెలుస్తున్నది. అమెరికా తన బలగాలను ఉపసంహరించుకుంటే తాలిబాన్ మరింత బలపడుతుందని, అధికారం కోసం అంతర్యుద్ధానికి ఇది దారి తీయవచ్చని ఆఫ్ఘనిస్థాన్ ప్రజలు కూడా భయాందోళన చెందుతున్నారు.



హాంకాంగ్‌లో ఆదివారంనాడు భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆందోళనకారులు

## హాంకాంగ్‌లో ఆగని ఆందోళనలు

### భారీవర్షంలో సైతం నిరసనకారుల శాంతియుత ప్రదర్శనలు

**హాంకాంగ్, ఆగస్టు 18:**

హాంకాంగ్‌లోని ప్రజాస్వామ్య ఉద్యమకారుల నిరసనలు ఆదివారం కూడా కొనసాగాయి. 'నేరస్థుల అప్పగింత బిల్లు'పై హాంకాంగ్ పది వారాలుగా అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. హాంకాంగ్ ఆందోళనలపై చైనా ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నిరసనలను విరమించకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. అయినప్పటికీ, నిరసనకారులు తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. ఆదివారం భారీ వర్షం కురుస్తున్నప్పటికీ, గొడుగులు పట్టుకొని శాంతియుత ప్రదర్శనలు చేపట్టారు. విక్టోరియా పార్కు నుంచి మొదలైన నిరసనలకు సివిల్ హ్యూమన్ రైట్స్ ఫ్రంట్ నేతృత్వం వహించింది. హాంకాంగ్‌లో తిరిగి శాంతియుత వాతావరణం నెలకొల్పడానికే ఈ ఆందోళనలు చేపడుతున్నామని పేర్కొన్నది. తమ నిరసనలు హేతుబద్ధమైనవని, అహింసతో కూడుకున్నవని ఫ్రంట్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం హాంకాంగ్ విమానాశ్రయాన్ని దిగ్బంధించిన నిరసనకారులు.. తమ ఆందోళనలను క్రమంగా తీవ్రతరం చేస్తున్నారు. 'బిల్లు'కు వ్యతిరేకంగా శనివారం నిర్వహించిన ఆందోళనలో వేలమంది నిరసనకారులు పాల్గొన్నారు.

## ముగ్గురు పాలస్తీనీయుల కాల్చివేత

**గాజా సిటీ:** ఉత్తర గాజా స్ట్రిప్ ప్రాంతంలో ముగ్గురు పాలస్తీనీయులను ఇజ్రాయెల్ సైన్యం కాల్చి చంపింది. ఈ మేరకు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఘటనలో మరో పాలస్తీనీయుడు కూడా గాయపడ్డాడని వెల్లడించింది. ఈ దాడులను ఇజ్రాయెల్ సైన్యం సమర్థించుకున్నది. గాజా నుంచి ఆయుధాలు కలిగిన కొందరు అనుమానితులు తమ భద్రతా కంచెను దాటడానికి ప్రయత్నిస్తున్న సమయంలో కాల్పులు జరిపామని ఇజ్రాయెల్ ప్రకటించింది. తాజా దాడులు పాలస్తీనా– ఇజ్రాయెల్ మధ్య మరిన్ని ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి.

## ఇద్దరి ప్రాణాలు తీసిన చెత్త

- మృతుడు స్థానిక దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నట్టు గుర్తింపు

**మీరట్:** చిన్న వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొన్నది. చెత్త, పశువుల వ్యర్థాల తొలగింపుపై తలెత్తిన ఘర్షణలో స్థానిక విలేకరితో పాటు ఆయన సోదరుడు దారుణహత్యకు గురయ్యారు. సంచలనాత్మకమైన ఈ ఘటన సహారన్‌పూర్‌లోని కోత్వాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం జరిగింది. మృతులను అశీష్ ధిమాన్, అశుతోష్ ధిమాన్‌గా గుర్తించారు. అశీష్ ధీమాన్ ప్రస్తుతం గర్భందాల్చిన భార్య, తల్లితో నివసిస్తున్నాడు. ముగ్గురు వ్యక్తులు అశీష్ ఇంట్లోకి చొరబడి కాల్పులు జరిపి పారిపోయారని ప్రత్యక్ష్యసాక్షి ఒకరు చెప్పారు. ఘటనాస్థలాన్ని డీఐజీ ఉపేంద్ర అగర్వాల్, ఎస్సెస్పీ దినేశ్‌కుమార్ తదితరులు సందర్శించారు. అయితే, చెత్త కారణంగానే హత్యలు జరిగిన విషయాన్ని స్థానికులు ధ్రువీకరించడం లేదు. సోదరుల దారుణహత్యతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితుల ఇంటిని చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. దాంతో పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది. సన్నీ సైనీ, గౌరవ్ సైనీలను హంతకులుగా అనుమానించిన పోలీసులు వారిని పట్టుకొనేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసినట్టు డీఐజీ ఉపేంద్ర అగర్వాల్ పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక హరితహారం

- అటవీశాఖ ఆధ్వర్యంలో వినూత్న చర్యలు
- ఆసిఫాబాద్ పట్టణంలో ఆహ్లాదం



ఆసిఫాబాద్ పట్టణానికి ఆనుకొని పెద్దవాగు సమీపంలో అధికారులు నాటిన మొక్కలు

**కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమంలా చేపడుతున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమం సత్ఫలితాలిస్తున్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఆధ్యాత్మిక హరితహారం విశేష ఆదరణ పొందుతున్నది. ఆసిఫాబాద్ పట్టణానికి ఆనుకొని పెద్దవాగు సమీపంలో రెండేండ్ల కిందట హరితహారం కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో రెండువేలకుపైగా వివిధ రకాల మొక్కలు నాటారు. నాడు నాటిన పలు మొక్కలు ప్రస్తుతం పచ్చగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పెంచేందుకు అటవీశాఖ అధికారులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. మొక్కలకు ఆధ్యాత్మికతను తోడుచేసి 'ఆధ్యాత్మిక హరితహారం' కార్యక్రమానికి రెండేండ్ల కిందట శ్రీకారంచుట్టారు. ప్రతి ఒక్కరు మొక్కలను ఆసక్తితో నాటేలా సహకరించారు. ప్రజలు మెచ్చిన మొక్కలను అందజేసి ప్రోత్సహించారు.

**రాశులకు అనుగుణంగా మొక్కలు..**

ప్రకృతిలో ఔషధ మొక్కలు, దేవుళ్లను ప్రత్యేకంగా పూజించే మొక్కలు, సెంటిమెంట్‌గా భావించే మొక్కలు, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించే మొక్కలు, అలంకరణ ఇచ్చేవి.. ఇలా అనేక రకాల మొక్కలు ఉంటాయి. పేర్లను బట్టి వచ్చే రాశులకు అనుకూలమైన మొక్కలనూ చూస్తుంటాం. తమ రాశులకు అనుకూలమైన మొక్కలను పెంచుకుంటే మంచిదనే సెంటిమెంట్ ఉంటుంది. ఇలాంటి సెంటిమెంట్‌ను హరితహారానికి తోడుచేస్తే.. బాగుంటుందనే ఆలోచనపై అటవీశాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. పేర్లను బట్టి వచ్చే రాశులకు అనుకూలమైన మొక్కలను సైతం అటవీశాఖ అధికారులు అందించారు. వాటిని సంరక్షించేలా చర్యలు చేపట్టారు. మేషరాశివారికి ఎర్రచందనం, వృషభరాశివారికి మద్ది చెట్టు, మిథునరాశికి పనస చెట్టు, కర్కాటక రాశికి మోదుగ, సింహరాశికి రేగు చెట్టు, కన్యారాశికి మామిడి, తులారాశికి పొగడ చెట్టు, వృశ్చిక రాశికి సండ్ర చెట్టు, ధనుస్సురాశికి రావి చెట్టు, మకరరాశికి జిట్రేగి చెట్టు, కుంభరాశికి జమ్మి చెట్టు, మీనరాశివారు మర్రిచెట్టు నాటి, సంరక్షిస్తే మంచిదని శాస్త్రాలు చెప్తున్నాయి. గ్రహాలను బట్టి కూడా కొన్నిరకాల మొక్కలను పెంచుకుంటే మంచిదనే నమ్మకం ప్రజల్లో ఉన్నది. సూర్య, చంద్ర, కుజ, బుధ, గురు, శుక్ర, రాహు, కేతు ఇలా గ్రహాలకు అనుకూలమైన తెల్లజిల్లెడు, మోదుగ, సండ్ర, ఉత్తరేణి, రావి, మేడి, జమ్మి, గరిక, దర్భ వంటి మొక్కలను పెంచుకోవాలని పలువురు భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా అటవీశాఖ అధికారులు మొక్కలు పంపిణీచేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణ సమీపంలోని పెద్దవాగు వద్ద నాటిన ఆధ్యాత్మిక హరితహారం మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నాటిన ఆధ్మాత్మిక మొక్కలు పెద్దగా మారి ఆకట్టుకుంటున్నాయి.

# సవాళ్లకు సై అనేలా శిక్షణ!

- ఎస్సైల శిక్షణ సిలబస్‌లో 20 ఏండ్ల తర్వాత మార్పులు
- సైబర్‌క్రైం, నేరపరిశోధనలో మెళకువలపై తరగతులు
- చట్టాలపై అవగాహనకు నల్సార్ ద్వారా డిప్లొమా కోర్సు





సంతోష్‌మెహ్రా, టీఎస్‌పీఏ డైరెక్టర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మారుతున్న నేర సరళి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఆకళింపు చేసుకొని బాధితులకు తగిన న్యాయం చేయాలంటే తొలుత అధికారులకు వాటిపై అవగాహన తప్పనిసరిగా ఉండాలి. గతంలో రౌడీలు, గుండాలు, జేబుదొంగలు, గొలుసు దొంగలను నిత్యం ఓ కంట కనిపెట్టాల్సిన బాధ్యత ఆ ఏరియా పోలీసులపై ఉండేది. ఇప్పుడు ఆ ట్రెండ్ పూర్తిగా మారింది. వైట్‌కాలర్ నేరాలు, చిట్‌ఫండ్స్ మోసాలు, సైబర్‌నేరగాళ్ల జమానా వచ్చేసింది. మనిషి కనిపించకుండానే మన అకౌంట్‌లో నుంచి లక్షలు మాయం చేసే సైబర్ దొంగలు పెరిగిపోయారు. సరికొత్త నేరాలు క్షేత్రస్థాయిలో పోలీసులకు సవాళ్లు విసురుతున్నాయి. వీటిని దీటుగా ఎదుర్కొనేలా క్షేత్రస్థాయి విధుల్లో కీలకమైన ఎస్సైలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా తెలంగాణ పోలీస్ అకాడమీ (టీఎస్‌పీఏ) సిలబస్‌లో మార్పులు చేసింది.

**క్షేత్రస్థాయి అంశాలకు ప్రాధాన్యం**

డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి సూచనల మేరకు క్షేత్రస్థాయి విధుల్లో ప్రధాన అంశాలకు ఎస్సైల శిక్షణలో పెద్దపీట వేసినట్టు టీఎస్‌పీఏ డైరెక్టర్ సంతోష్‌మెహ్రా 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. వీటిలో ఐపీసీ, సీఆర్పీసీ, ఐఈఏ (ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్), స్టేషన్ మేనేజ్‌మెంట్, ఇన్వెస్టిగేషన్, ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్ వంటి అంశాలకు శిక్షణ తరగతుల సంఖ్యను మరింత పెంచినట్టు చెప్పారు. దాదాపు 20 ఏండ్ల తర్వాత పోలీస్ శిక్షణ సిలబస్‌లో సమూల మార్పుల తీసుకొచ్చినట్టు తెలిపారు. సైబర్‌నేరాలపై అవగాహన పెరిగేలా తరగతులు, సైబర్‌ల్యాబ్‌లో ప్రాక్టికల్స్, ఆర్థిక నేరాలు, చిట్‌ఫండ్ మోసాలు, మల్టీలెవల్ మార్కెటింగ్ కుంభకోణాలు తదితర కొత్త తరహా నేరాలపై అవగాహన తీసుకొచ్చేలా సిలబస్ తయారుచేసినట్టు వివరించారు. మహిళలపై నేరాలు, మానవ అక్రమ రవాణాపైన సిలబస్‌లో దృష్టి సారించామన్నారు. ట్రైనీలకు చట్టాలపై మరింత అవగాహన పెంచేలా నేర శాస్త్రం, నేర చట్టాలపై అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా సర్టిఫికెట్ కోర్సు కోసం నల్సార్‌తో ఒప్పందం కుదుర్చుకొన్నట్టు పేర్కొన్నారు. కొత్త ఎస్సైలను మెరికల్లా తయారుచేసేందుకు 35 మందికి మధ్యప్రదేశ్ నీముచ్‌లోని సీఆర్పీఎఫ్ శిక్షణ కేంద్రంలో కఠోర శిక్షణ ఇప్పించనున్నట్టు సంతోష్‌మెహ్రా తెలిపారు.

**మానసిక, శారీరక దృఢత్వానికి ప్రణాళికలు**

నిరంతరం ఒత్తిడితో కూడుకొన్న పోలీస్ ఉద్యోగంలో నెగ్గుకువచ్చేందుకు ఆరోగ్యకరమైన ఆహారంతోపాటు వ్యాయామం, యోగాను శిక్షణలో భాగంచేసేలా తరగతులను ప్రణాళికలో పొందుపరిచినట్టు టీఎస్‌పీఏ డైరెక్టర్ సంతోష్‌మెహ్రా తెలిపారు. ట్రైనీలకు ఇచ్చే బలవర్ధక ఆహారంలో ఏయే పదార్థాలు ఎప్పుడెప్పుడు ఉండాలన్నది సూచించేందుకు జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) సహకారంతో స్పెషల్ డైట్ రూపొందించామన్నారు. అలాగే జిమ్, యోగా సిలబస్ కూడా పెంచినట్టు తెలిపారు.

## ఆర్మీ విభాగాల్లో ఉద్యోగాల భర్తీ

- 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకునే అవకాశం
- అక్టోబర్ 7 నుంచి సెలక్షన్స్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వివిధ ఆర్మీ విభాగాలో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ఆర్మీ రిక్రూట్‌మెంట్ విభాగం సికింద్రాబాద్ కార్యాలయ ఉన్నతాధికారులు తెలిపారు. ఆసక్తిగలవారు 'www.joinindianarmy.nic.in' వెబ్‌సైట్‌లో ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆర్మీలోని టెక్నికల్ (ఏవియేషన్, అమ్యునిషన్ ఎగ్జామినర్), నర్సింగ్ అసిస్టెంట్, నర్సింగ్ అసిస్టెంట్ వెటర్నరీ, క్లర్క్స్, స్టోర్ కీపర్ టెక్నికల్, జనరల్ డ్యూటీ, ఫార్మా, ట్రేడ్స్‌మెన్ విభాగాల్లో సైనిక ఉద్యోగాల నియామకాలు చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల అభ్యర్థులకు కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అక్టోబర్ 7 నుంచి 17 వర కు సెలక్షన్స్ నిర్వహిస్తామని చెప్పారు. సందేహాలుంటే 'ఆర్మీ కాలింగ్' మొబైల్ ఆప్షన్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని, లేదా 040–27740059 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## రెండునెలల్లోనే గొప్ప నిర్ణయాలు తీసుకున్నాం

- మా రాష్ట్రంలో పెట్టుబడులుపెట్టండి
- ఎన్నారైలకు ఏపీ సీఎం జగన్ పిలుపు



డల్లాస్‌లో ప్రవాసాంధ్రుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఎన్నారైలు భాగస్వాములు కావాలని ఎన్నారైలకు ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ సారథ్యంలోని ప్రభుత్వ పరిపాలనలో రెండునెలల కాలంలోనే గొప్ప నిర్ణయాలను తీసుకున్నామని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న జగన్.. ఆదివారం డల్లాస్‌లో ప్రవాసాంధ్రులు ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసంగించారు. పరిశ్రమలు పెట్టేందుకు రాష్ట్రానికి వచ్చేవారికి తాము అండగా ఉంటామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ పక్కనే ఉన్న తెలంగాణతో సఖ్యత కుదుర్చుకొని సముద్రంలో వృథాగా పోతున్న గోదావరి జలాలను ఎండిపోతున్న ప్రాంతాలకు తీసుకొచ్చేందుకు కృషిచేశామని చెప్పారు. అవినీతి, లంచాలు లేని రాష్ట్రం నిర్మాణం కోసం తాను శ్రమిస్తున్నట్టు తెలిపారు. నవరత్నాలు, మ్యానిఫెస్టో ప్రేరణగా తాను అహర్నిశలు పనిచేస్తున్నానని చెప్పారు. 'ఏపీ సీఎంగా ఉన్నది మీ అన్న. మీ తమ్ముడు అని మర్చిపోకండి. మీకు ఎప్పుడూ తోడుగా ఉంటాను' అని జగన్ హామీఇచ్చారు.



ఒడ్డుగూడ పంటచేనులో పెద్దపులి అడుగుజాడలు

## పెద్దపులి సంచారం

- భయాందోళనల్లో ప్రజలు

**దహెగాం:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని ఒడ్డుగూడ, బ్రహ్మన్‌చిచ్చాల, బహమ్మనగర్ గ్రామాల పంటచేన్లలో శనివారం రాత్రి పెద్దపులి సంచరించింది. దీంతో సమీప గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం పంటచేన్లకు వెళ్లిన రైతులకు పులి అడుగులు కనిపించాయి. ఆందోళనకు గురైన రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అటవీ సిబ్బంది వాటిని పెద్దపులి అడుగులుగా నిర్ధారించారు. శనివారంరాత్రి పెద్దపులి జంతువును వెంటాడుతూ వచ్చినట్టు భావిస్తున్నారు.

## ఉన్నతవిద్యపై తగ్గుతున్న మోజు

- ఇంటర్ పూర్తవగానే ఉద్యోగాన్వేషణలో యువకులు
- స్వల్పకాలిక కోర్సులవైపు మొగ్గు
- డిగ్రీ కాలేజీల్లో తగ్గుతున్న ప్రవేశాలు
- విభిన్నంగా ముందుకు సాగుతున్న యువతులు
- రాష్ట్రంలో మూడేండ్లుగా ఇదే ధోరణి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చాలామంది యువకులు డిగ్రీ లాంటి ఉన్నత చదువులపై ఆసక్తి చూపడంలేదు. ఇంటర్మీడియట్ పూర్తిచేసినవారిలో చాలామంది నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వేతనం వచ్చే ఉద్యోగాలు లేదా ఉపాధి చూసుకుంటున్నారు. డిగ్రీ చదివేందుకు ఆసక్తి చూపకుండా తక్షణ ఉపాధికి వీలుండే హోటల్ మేనేజ్‌మెంట్, హస్పిటాలిటీ లాంటి స్వల్పకాలిక కోర్సుల్లో చేరుతున్నారు. అయితే యువతులు మాత్రం ఉన్నత చదువులపై ఆసక్తి పెంచుకుంటున్నారు. ఇంజినీరింగ్ లాంటి కోర్సులతోపాటు బీఏ, బీకాం, బీఎస్సీ లాంటి సాధారణ డిగ్రీ కాలేజీల్లో కూడా భారీగానే చేరుతున్నారు. 'దోస్త్' అధికారుల గత మూడేండ్ల అడ్మిషన్ నివేదికలు ఈ విషయాలను స్పష్టంచేస్తున్నాయి. 2017 విద్యాసంవత్సరంలో 90,696 మంది యువకులు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు పొందితే.. యువతులు 1,10,109 మంది ప్రవేశాలు పొందారు. 2018లో యువకులు 94,483 మంది ప్రవేశాలు పొందితే.. యువతులు 1,07,384 మంది ప్రవేశాలు పొందారు. 2019లో ఇప్పటివరకు యువకులు 87,645 మంది ప్రవేశాలు పొందితే.. యువతులు 1,01,855 మంది ప్రవేశాలు పొందినట్లు దోస్త్ –2019 కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు.

**కామర్స్‌పై ఎక్కువ ఆసక్తి**

సాధారణ డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు ఎక్కువగా బీకాంలో, ఆ తర్వాత బీఎస్సీలో ప్రవేశాలు పొందుతున్నారు. ఈ కోర్సుల్లో కూడా యువకుల కంటే యువతులే ఎక్కువగా చేరుతున్నట్టు దోస్త్ లెక్కలు వెల్లడిస్తున్నాయి. గతంతో పోల్చితే దేశవ్యాప్తంగా ఆడపిల్లల చదువుల శాతం క్రమేణా పెరుగుతున్నదని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఉన్నత విద్యలను అభ్యసించేలా యువతీ యువకులను ప్రోత్సహించి ప్రజలకు ఉపయోగపడే పరిశోధనలవైపు వారి దృష్టిని మళ్లించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, విద్యావేత్తలపై ఉన్నదని ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ హైదరాబాద్ ]
సోమవారం 19 ఆగస్టు 2019

# మరో సవాలుకు సిద్ధం!


కీర్తి సురేష్

'మహానటి' చిత్రానికి గాను జాతీయ ఉత్తమ నటి పురస్కారాన్ని గెలుచుకొని దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకట్టుకుంది కీర్తి సురేష్. సావిత్రి పాత్రలో ఆమె ప్రదర్శించిన అద్భుతాభినయానికి దక్షిణాది ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. ప్రస్తుతం కీర్తిసురేష్ తెలుగు, తమిళ పరిశ్రమల్లో బిజీగా ఉంది. ఇదిలావుండగా ఆమె హిందీలో అరంగేట్రం చేయబోతున్న విషయం తెలిసిందే. అజయ్‌దేవ్‌గణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి అమిత్‌శర్మ దర్శకుడు. భారతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. బోనీ కపూర్ నిర్మాత. ఈ చిత్రంలో కీర్తి సురేష్..అజయ్‌దేవ్‌గణ్ సతీమణిగా భిన్న పార్శ్వాలు కలిగిన పాత్రలో కనిపించనుందని సమాచారం. కాలేజీ యువతిగా, మధ్య తరగతి గృహిణిగా ఆమె పాత్ర విభిన్న కోణాల్లో సాగుతుందని చిత్రబృందం చెబుతున్నది. త్వరలో ఈ సినిమా షూటింగ్ మొదలుకానుంది. చక్కటి అభినయానికి ఆస్కారమున్న పాత్ర ద్వారా కీర్తిసురేష్ బాలీవుడ్ అరంగేట్రం చేయడం పట్ల ఆమె సన్నిహితులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాది మాదిరిగానే బాలీవుడ్‌లో కూడా ఈ మలయాళీ సోయగం సత్తాచాటుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# సెప్టెంబర్ 8న రథసారథుల రజతోత్సవం

తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ (టీసీపీఈయూ) స్థాపించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 8న తెలుగు సినీ రథసారథుల రజతోత్సవ పేరుతో వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించబోతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్ మాట్లాడుతూ 'సినీ నిర్మాణంలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కీలక పాత్ర పోషిస్తారు. ఈ యూనియన్‌కు నిర్మాతల మండలి తరపున కావాల్సిన సహాయసహకారాలు అందిస్తాం' అన్నారు. కె.యస్.రామారావు మాట్లాడుతూ 'ఓ సినిమాకు నిర్మాతల కంటే ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ కష్టం ఎక్కువగా ఉంటుంది. ఈ కార్యక్రమానికి మా వంతు సహాయం అందిస్తాం' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'సినిమా షూటింగ్ మొదలుపెట్టినప్పటి నుంచి ప్యాకప్ అయ్యే వరకు ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ ముఖ్యభూమిక పోషిస్తారు. లొకేషన్‌లో ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటారు. వారి సంస్థ రజతోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది' అన్నారు. ఈ కార్యక్రమంలో టీసీపీఈయూ అధ్యక్షుడు అమ్మిరాజు, దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్, 'మా' అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మిరాజు, దిల్‌రాజు, కల్యాణ్

# తారామణి సందేశం!


ఆండ్రియా

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తారామణి'. రామ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని అదే పేరుతో ఉదయ్ హర్ష వడ్డెల్ల, డి.వి.వెంకటేష్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. సెప్టెంబర్ 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఇదొక ముక్కోణపు ప్రేమకథ. సినిమాలో ఎమోషనల్ అంశాలతో పాటు అన్ని రకాల అంశాలు సమపాళ్లలో వుంటాయి. నేటి యువత సాంకేతికత మాయలో పడి తమ జీవితాల్ని ఎలా సమస్యల మయం చేసుకుంటున్నారు? తద్వారా ఎలాంటి ప్రలోభాలకు లోనవుతున్నారు? అనే అంశాల నేపథ్యంలో సినిమా సాగుతుంది. యువతకు వినోదాన్ని అందిస్తూనే సందేశాన్నిచ్చే చిత్రమిది. ఈ చిత్ర కాన్సెప్ట్ నచ్చి ట్రైలర్‌ని కమల్‌హాసన్, పాటలను సూపర్‌స్టార్ రజనీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్, పాటలకు విశేష స్పందన లభించింది. తమిళంలో ఘనవిజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రం తెలుగులోనూ అదే తరహాలో ఆకట్టుకుంటుందనే నమ్మకముంది. కొత్త తరహా చిత్రాల్ని ఇష్టపడే తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రం తప్పకుండా నచ్చుతుంది' అన్నారు.


సుజిత్, శ్రద్ధాకపూర్, ప్రభాస్, ప్రమోద్, విక్కీ

# ప్రభాస్‌కు దూరదృష్టి ఎక్కువ

**- రాజమౌళి**

'బాహుబలి' దేశ వ్యాప్తంగా సృష్టించిన హంగామా అంతా ఇంతా కాదు. ఈ సినిమా తరువాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'సాహో'. సుజిత్ దర్శకుడు. యువీ క్రియేషన్స్ పతాకంపై వంశీ కృష్ణారెడ్డి, ప్రమోద్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 30న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏ హీరో ఫ్యాన్స్ అయినా వాళ్ల హీరో సినిమా హిట్ కావాలని కోరుకుంటారు. కానీ ప్రభాస్ సినిమాని అందరి హీరోల ఫ్యాన్స్ హిట్ కావాలని కోరుకుంటారు. ఎందుకంటే ప్రభాస్ ఏ రోజు ఏ హీరో గురించి చెడుగా మాట్లాడడు. తన చుట్టూ ఎప్పుడూ పాజిటివ్ వాతావరణం వుంటుంది. ఆ వాతావరణమే అతనికి ఇంత మంది అభిమానుల్ని సంపాదించి పెట్టింది. ప్రభాస్‌కు దూరదృష్టి చాలా ఎక్కువ. 'బాహుబలి' కథ చెప్పినప్పుడే నా తరువాత చిత్రం ఏంటని ఆలోచించడం మొదలుపెట్టాడు. దీని తరువాత ఎలాంటి సినిమా చేయాలని చాలా తపన పడ్డాడు. ఒక రోజు సుజిత్ కథ చెప్పాడు డార్లింగ్ అద్భుతంగా వుంది అన్నాడు. పెద్ద సినిమా తరువాత పెద్ద దర్శకుడితో వెళ్లకుండా కథని నమ్మి ప్రభాస్ 'సాహో' చేయడం ఆనందాన్ని కలిగించింది. 'బాహుబలి' తరువాత ఇలాంటి సినిమా అయితే ప్రేక్షకులకు, అభిమానులకు నచ్చుతుందని నమ్మి ఈ సినిమా చేశాడు. సుజీత్‌ది చాలా చిన్న వయసు. చేయగలడా? అని చాలా మంది అనుమానించారు. ఫస్ట్ లుక్, టీజర్‌తోనే సుజిత్ సత్తా ఏంటో అందరికి అర్థమైంది. ఇంత పెద్ద చిత్రాన్ని, ఇంత మంది టెక్నీషియన్స్‌ని, భారీ బడ్జెట్‌ని, ప్రభాస్ లాంటి ఆల్ ఇండియా స్టార్‌ని హ్యాండిల్ చేయడం మామూలు విషయం కాదు' అన్నారు.


ప్రభాస్, రాజమౌళి

**డైహార్డ్ ఫ్యాన్స్ డైలాగ్ రాసింది సుజితే..**

ప్రభాస్ మాట్లాడుతూ 'ఫ్యాన్స్ డైహార్డ్ ఫ్యాన్స్ డైలాగ్ రాసింది సుజితే. మాస్ పల్స్ ఏంటో అతనికి బాగా తెలుసు. ఈ సినిమాకు గ్రేట్ టెక్నీషియన్స్ పనిచేశారు. టీజర్, ట్రైలర్‌కి కమల్ కన్నన్ ఇంటర్నేషనల్ లుక్‌ని తీసుకొచ్చారు. జిబ్రాన్ మ్యూజిక్‌కి మంచి స్పందన లభించింది. జాకీష్రాఫ్‌తో కలిసి పనిచేయాలనుకున్నాను. ఈ సినిమాకి కుదిరింది. అనిల్ తడానీ ఈ చిత్రానికి చాలా సహకరించారు. సుజీత్ దగ్గర ఓ కథ వుంది మాకు నచ్చింది విను అని వంశీ, ప్రమోద్ చెప్పారు. దాంతో కథ విన్నాను. సినిమా షూటింగ్ కి ఏడాది ముందే యాక్షన్ డైరెక్టర్‌లని కలిశాం. షూటింగ్ మొదలైన తరువాత సుజిత్ తన కంటే పెద్ద వాళ్లని ఎలా హ్యాండిల్ చేస్తాడా అని ప్రమోద్, వంశీ, నేను కంగారుపడ్డాం. కానీ అతనిలో ఏ రోజూ ఆ కంగారు కనిపించకపోవడంతో సుజిత్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ అవుతాడనిపించింది. ఇలాంటి చిత్రాన్ని చేయడం మామూలు విషయం కాదు. ఏడాదికి రెండు చిత్రాలు ఇవ్వాలని గతంలో మాటిచ్చాను. కానీ ఆ మాటని నిలబెట్టుకోలేకపోయాను. జాగ్రత్తగా తీస్తే నిర్మాతలకు వంద కోట్ల లాభం వచ్చేది కానీ అలా ఆలోచించకుండా ఖర్చు చేశారు. వంశీ, ప్రమోద్ లాంటి స్నేహితులు అందరికి వుండాలి' అన్నారు.

**ప్రభాస్ అభిమానులకు హ్యాట్సాఫ్..**

దర్శకుడు సుజిత్ మాట్లాడుతూ 'ప్రభాస్ అభిమానులకు ఓపిక ఎక్కువ. అందుకే టీజర్‌లో డైహార్డ్ ఫ్యాన్స్ అని రాశాను. బాహుబలి, బాహుబలి-2 వంటి అద్భుతమైన చిత్రాల తరువాత వెంటనే తమ అభిమాన హీరో సినిమా రావాలని కోరుకుంటారు. కానీ తరువాత సినిమా కోసం అభిమానులు రెండేళ్లు ఎదురుచూడాల్సి వచ్చింది. అలా ఎదురుచూసినందుకు ప్రభాస్ అభిమానులకు హ్యాట్సాఫ్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'మా అందరికి ఒత్తిడి ఎక్కువగా వుండేది కానీ సుజిత్ ముఖంలో మాత్రం ఎప్పుడు ఎలాంటి టెన్షన్ చూడలేదు' అని ప్రభాస్ అన్నారు. నా ఒత్తడిని తల్లిదండ్రులతో, స్నేహితులతో పంచుకునేవాడిని. అలా చేయడం వల్లే ఈ చిత్రాన్ని అనుకున్న స్థాయిలో పూర్తి చేయగలిగాను. నా ప్రయాణం ఓ షార్ట్ ఫిల్మ్‌తో మొదలైంది. నేను చేసిన షార్ట్ ఫిల్మ్స్‌కు సంబంధించిన ఓ డీవీడీ యూవీ వారి దగ్గరికి వెళ్లడం, దాన్ని ప్రభాస్ చూశారట 'స్క్రీన్‌ప్లే బాగా రాస్తున్నాడు. ఒకసారి వాడిని పిలవండి' అన్నారట. మా నాన్నతో కలిసి 'మిర్చి' సినిమా చూస్తుంటే ప్రభాస్‌గారు రమ్మంటున్నారని యూవీ నుంచి ఫోనొచ్చింది. నేనెక్కడ, ప్రభాస్ ఎక్కడ? నన్ను పిలవడం ఏంటి? అనుకుని వెళ్లలేదు. రాజమౌళి సినిమా తరువాత ప్రభాస్‌తో సినిమా అంటే సముద్రానికి ఎదురువెళ్లినట్టే. అయితే ప్రభాస్ ప్రతి విషయంలోనూ నాలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించారు' అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, ప్రమోద్, విక్కీ, శ్రద్ధాకపూర్, దిల్‌రాజు, వి.వి.వినాయక్, శ్యామ్‌ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆ విషయంలో గర్వంగా ఉంది!

**'మీరు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ బ్యాచ్ అని, మీకు మాస్ పల్స్ తెలియదని పీవీపీగారు మమ్మల్ని ఎప్పుడూ తిడుతుంటారు. ఆయన అన్నట్టే 'ఎవరు' ఫైనల్ కాపీ చూసుకున్న తరువాత ఇది 'ఏ' సెంటర్‌లో మాత్రమే ఆడుతుందనుకున్నాం. కానీ మా అంచనాలని తారు మారు చేస్తూ అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. అడివి శేష్ పోషించిన విక్రమ్ వాసుదేవ్ పాత్రకు అన్ని వర్గాల ప్రేక్షకులు కనెక్ట్ అవుతున్నారు' అన్నారు వెంకట్ రామ్‌జీ. ఆయన దర్శకుడిగా పరిచయమైన చిత్రం 'ఎవరు'. అడివి శేష్, రెజీనా కలయికలో పీవీపీ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం దర్శకుడు వెంకట్ రామ్‌జీ పాత్రికేయులతో ముచ్చటించారు.**

పీవీపీ సంస్థలో చాలా చిత్రాలకు వివిధ శాఖల్లో పనిచేశాను. ఆయనకు కథ చెప్పాలని ఓ థ్రిల్లర్ స్క్రిప్ట్‌ని రాసుకుని వెళ్లాను. అయితే అది తరువాత చేద్దాం ముందు ఈ లైన్‌ని డెవలప్ చెయ్యాలని చెప్పారు. అప్పటికే నేను స్పానిష్ చిత్రం 'ది ఇన్విజిబుల్ గెస్ట్' చూశాను. అయితే దాన్ని యథాతదంగా తీసుకోకుండా ఆ కథలో తెలుగుకు అనుగుణంగా చాలా మార్పులు చేశాం. పాత్రల్ని మార్చాం. న్యాయం కోసం పోరాడుతున్న ఒక కొడుకు కథ ఇది. ఓ రివేంజ్ డ్రామాని థ్రిల్లర్‌గా మార్చి తెరపైకి తీసుకొచ్చాం. అదే ఇప్పుడు ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ స్థాయి ఆదరణ లభిస్తుందని ఊహించలేదు.

**'బద్లా' గురించి ముందే తెలుసు..**

'ది ఇన్విజిబుల్ గెస్ట్' స్ఫూర్తితో 'బద్లా' చేస్తున్నారని ముందే ఊహించాం. అయితే అందులోని భావోద్వేగాలు మన తెలుగు నేటివిటీకి దగ్గరగా లేవు. ఓ కథ చెప్పాలనుకున్నప్పుడు భావోద్వేగాలు ప్రధానం. ఎమోషన్స్ పండకపోతే ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం కష్టం. దీంతో భావోద్వేగాల్ని మిళితం చేసి ఆకట్టుకోవాలని ప్రయత్నించాం. మాతృకకు మా చిత్రానికి అస్సలు పోలిక కనిపించదు. ఆ విషయంలో గర్వంగా వుంది.


వెంకట్ రామ్‌జీ

తెలుగు కథలో భావోద్వేగాలతో పాటు, కొన్ని పాత్రల్ని మార్చడమే కాకుండా మార్చుకున్న పాత్రలకు అనుగుణంగా కొత్త స్క్రీన్‌ప్లేని రాసుకున్నాం. ఈ విషయంలో అబ్బూరి రవి చాలా సపోర్ట్ చేశారు. కథ ఎక్కడో పట్టు తప్పుతుందని అనిపించిన చోట మాత్రం అడివి శేష్ సలహాలిచ్చారు. దాంతో మేము అనుకున్న కథని గ్రిప్పింగ్‌గా చెప్పగలిగాం. అబ్బూరి రవి డైలాగ్‌లతో పాటు సినిమాకు థియేటర్లలో ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తే గర్వంగా వుంది. 'క్షణం' సినిమాతో కొత్త తరహా చిత్రాల ఒరవడికి శ్రీకారం చుట్టాం. ఆ కోవలో 'ఎవరు' కూడా సక్సెస్ కావడం ఆనందంగా వుంది.

**ఆమె కళ్లు చాలా ఎక్స్‌ప్రెసివ్..**

రెజీనా దాదాపు ఏడెనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో వుంది. ఆమెకు ఎలాంటి సినిమాలు చేయాలో తెలుసు. 'అ!' నుంచి తన పంథా మార్చుకుంది. ఈ సినిమాలోని కీలక పాత్రల కోసం కొంత మందిని అనుకున్నాం. వారు తప్ప ఆ పాత్రలకు ప్రత్యామ్నాయం లేదు. రెజీనాను కూడా అలాగే ఎంచుకున్నాం. ఈ చిత్రంలోని సమీరా పాత్రకు రెజీనా నూటికి నూరు శాతం న్యాయం చేసింది. ఆమె కళ్లు చాలా ఎక్స్‌ప్రెసివ్. సినిమాలోని కొన్ని సన్నివేశాల్లో తన కళ్లతోనే నటించి ఆకట్టుకుందామె. ఈ సినిమా తరువాత కూడా రెజీనా తనకు నచ్చిన చిత్రాల్లో మాత్రమే నటిస్తుందని నమ్ముతున్నాను. సినిమా చూసి చిత్ర పరిశ్రమ నుంచి చాలా మంది అభినందించారు. క్రిష్, రాఘవేంద్రరావు, ప్రకాష్ కోవెలమూడి ఫోన్ చేశారు. రవితేజ సినిమా చూస్తానన్నారు. త్వరలో పీవీపీ సంస్థలో మరో సినిమా చేయబోతున్నాను.


'ఆర్‌డీఎక్స్ లవ్' చిత్రంలో పాయల్ రాజ్‌పుత్

# వలపు మల్లెలమాల

మల్లెల సౌరభం, సుకుమారి సోయగం జతకలిస్తే పరువం కొత్త హొయలు పోతుంది. చూపరుల హృదయాల్లో వలపు సునామీ రేపుతుంది. పక్కనున్న ఫొటోలో పంజాబీ అమ్మడు పాయల్‌రాజ్‌పుత్‌ను చూస్తే కుర్రకారు గుండెల్లో అచ్చంగా అవే భావాలు వ్యక్తమవుతాయి. 'ఆర్ ఎక్స్ 100' చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమలో తెరంగేట్రం చేసిన ఈ సుందరి తొలి సినిమాలోనే యువతరాన్ని ఉర్రూతలూపింది. హాట్‌హాట్ అందాలతో ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సుందరి 'ఆర్‌డీఎక్స్ లవ్' చిత్రంలో నటిస్తున్నది. తేజస్ కథానాయకుడు. శంకర్‌భాను దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో పాయల్‌రాజ్‌పుత్ పాత్ర యువతరాన్ని అలరించేలా సాగుతుందని..అందం, అభినయం కలబోతగా మెప్పిస్తుందని చిత్ర బృందం చెబుతున్నది. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

